thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు
సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 107 | కరీంనగర్ గురువారం, 26 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 'తుంగభద్ర'పై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం..

బెంగళూరు : తుంగభద్ర డ్యాం కు గతేడాది కొట్టుకుపోయిన 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటును అమర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. టీబీడ్యాంపై కొప్పళ జిల్లా బీజేపీ బృందం పర్యటించింది. ప్రతిపక్ష నాయకుడు దొడ్డగౌడ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బసవరాజ్ కావటూర్, రమేష్, గణేష్, మంజునాథ్, మల్లికార్జున తదితర నాయకులు బృందంలో ఉన్నారు. దెబ్బతిన్న 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటు అమర్చేందుకు రూ.2 కోట్ల వ్యయంతో టెండర్ పిలిచారని, కానీ మళ్లీ రద్దు చేశారన్నారు. ఇక మిగిలిన గేట్లకు ఎప్పుడు టెండర్ పిలుస్తారో.. ఎప్పుడు మరమ్మత్తుచేస్తారో ఆయోమయంగా ఉందని మండిపడ్డారు. డ్యాంకు నీరు వస్తున్న తరుణంలో గేట్లు పటిష్టంగా లేకుంటే నీరు ఎలా నిలుస్తాయని ప్రశ్నించారు. ఇది పూర్తిగా సర్కార్ వైఫల్యమేనన్నారు. పలువురు బీజేపీ నాయకులు డ్యాంను పరిశీలించారు.




దిల్లీ: హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ముగ్గురు కేంద్రమంత్రులను కలిశారు. కేంద్రమంత్రులు కుమారస్వామి, పీయూష్ గోయల్, శ్రీపాద యశోనాయక్‌లను కలిసిన శ్రీధర్‌బాబు.. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించిన భూముల అంశంపై చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలని కోరారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2పై కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. దీనిపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రధాని, కేంద్రమంత్రిని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. మెట్రోపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నిర్ణయం తీసుకోలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర క్యాబినెట్‌లో మెట్రోకు అనుమతి వస్తుందని భావించామన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

## ఎమర్జెన్సీ పాలన దేశానికి మాయని మచ్చ: కేంద్రమంత్రి బండి సంజయ్



హైదరాబాద్: ఎమర్జెన్సీ పాలన చీకటి అధ్యాయం.. దేశానికి మాయని మచ్చ అని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఎమర్జెన్సీ ప్రకటించి 50 ఏళ్లు గడిచిన సందర్భంగా .. నాటి పరిస్థితులపై 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రజాస్వామ్యానికి పాతరేసి, నియంతృత్వం రాజ్యమేలిన రోజు. దేశమంతా అధికార దాహమనే చీకటితో నిండిన రోజు. స్వాతంత్ర్యాన్ని కాలరాసి, రాక్షసత్వం రాజ్యమేలిన రోజు. వ్యక్తి స్వేచ్ఛకు సమాధి కట్టి రాజ్యాంగాన్ని పరిహసించిన రోజు కాంగ్రెస్ పార్టీ విధించిన ఎమర్జెన్సీ. భారతదేశ చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా మిగిల్చిన దుర్దినం. ఎమర్జెన్సీని ఎత్తివేసేందుకు పాటుపడి, రాజ్యాంగ విలువలను కాపాడానికి జైళ్లలో మగ్గిన ఎందరో మహనీయుల సేవలను స్మరించుకుంటూ రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడదాం" అని బండి సంజయ్ పేర్కొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డికి టోనీ బ్లెయిర్ లేఖ..
## తెలంగాణ రైజింగ్ 2047కు ప్రశంస

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ లేఖ రాశారు. తెలంగాణ రైజింగ్-2047ను ప్రశంసించారు. ఇటీవల దిల్లీ పర్యటన సందర్భంగా టోనీ బ్లెయిర్‌తో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ రైజింగ్ విజన్ 2047గురించి ఆయనకు వివరించిన విషయం తెలిసిందే. పెట్టుబడులు, ఐటీ, ట్రిలియన్ డాలర్ల ఎకానమీలో లక్ష్యాల గురించి ఆయనతో చర్చించారు. ఈ నేపథ్యంలో టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ ఛేంజ్, తెలంగాణ మధ్య అవగాహన ఒప్పందం కుదరగా.. రైజింగ్ విజన్ రూపకల్పన, అమలుకు లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను ఇరువైపుల ప్రతినిధులు మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రైజింగ్ 2047 తనను ఆకట్టుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డిని అభినందించిన టోనీ బ్లెయిర్.. ఈ విజన్‌కు సహకరిస్తామని తెలిపారు.



## బోనాలకు వేళాయె.. నేటి నుంచి గోల్కొండ కోటలో ఉత్సవాలు ప్రారంభం

**- శ్రీజగదాంబిక అమ్మవారికి తొలి బోనం - తెలంగాణలో నెల రోజులపాటు బోనాల జాతరే**

హైదరాబాద్ : ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే బోనాల ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం బోనాలను అధికారిక పండుగగా ప్రకటించినది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని అలయాల్లో ఉన్న అమ్మవార్లకు భక్తులు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. నెల రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల వద్ద అవసరమైన ఏర్పాట్లను చేసింది.

**కులీకుతుబ్‌షా కాలం నుంచే...** గోల్కొంట కోటలో బోనాలు మొదట ప్రారంభించే సంప్రదాయం కులీకుతుబ్‌షా కాలం నుంచి వస్తుంది. అప్పట్లో కులీకుతుబ్‌షా నిర్వహించగా, నేడు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను నిర్వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేస్తుంది. బోనాలు ఉత్సవాలకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని శ్రీజగదాంభిక ట్రస్టు బోర్డు ఏర్పాట్లు మొదలుపెట్టింది.

**నెలరోజుల జాతర...** గురువారం నుంచి జూలై 24వతేదీ వరకు తెలంగాణలో బోనాల జాతర జరుగనుంది. నెలరోజుల పాటు ఇక్కడ తొమ్మిది ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ఈ పూజలకు నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్నారు. వీరికోసం గోల్కొండ కోటలోని అక్కన్న మాదన్న కార్యాలయాలు, బాడిగార్డ్స్ లైన్స్ ప్రాంతాలు సిద్ధం చేస్తున్నారు.

# సర్పంచ్ ఎన్నికలకు వేళైంది..
## టైం సెట్ చేసిన హైకోర్టు..
# ఎన్నికల వేడి షురూ!




హైదరాబాద్ : స్థానిక సంస్థలకు సంబంధించి ఎన్నికల నిర్వహిస్తామని అనేక సందర్భాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇక బీసీలకు రిజర్వేషన్లు కూడా కేటాయిస్తామని వెల్లడించింది. బీసీల రిజర్వేషన్ల విషయంలో అనేక న్యాయపరమైన సమస్యలో ఉన్న నేపథ్యంలో.. ప్రభుత్వం కాస్త వెనుకడుగు వేసినట్టు తెలుస్తోంది. ఇటీవల బీసీల రిజర్వేషన్లకు సంబంధించి శాసనసభలో ప్రభుత్వం ఒక తీర్మానాన్ని రూపొందించి కేంద్రానికి పంపించింది. అయితే ఆ తీర్మానాన్ని కేంద్రం ఇంకా ఆమోదించలేదని తెలుస్తోంది. కేంద్రం ఆమోదించిన తర్వాత అది రాష్ట్రపతి పరిధిలోకి వెళ్తుంది. రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే ఆ బిల్లుకు మోక్షం లభిస్తుంది. అయితే బీసీలు కేవలం తెలంగాణలో మాత్రమే లేరు కాబట్టి.. పైగా రిజర్వేషన్ల అంశం అనేది కేంద్ర పరిధిలోది కాబట్టి.. దీనిపై స్పష్టత రావాల్సిన అవసరం ఉంది.. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడంలో ప్రభుత్వం ఆశించినత స్థాయిలో ఆసక్తి చూపించకపోవడంతో రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం రంగంలోకి దిగింది. ఇప్పటికే స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికల వ్యవహారంలో సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి అనేక పిటిషన్లు వెళ్లాయి. ఆ పిటిషన్లను పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం బుధవారం కీలక తీర్పు వెల్లడించింది. సెప్టెంబర్ 30 లోపు ఎన్నికల నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. వార్డుల విభజన ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యాయవాది స్పందించారు. ప్రభుత్వం తరపున ఎన్నికల నిర్వహణకు 30 రోజుల సమయం కావాలని కోరారు. మరోవైపు ఎన్నికల నిర్వహణకు 60 రోజుల గడువు కావాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం కోరింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసిన సర్వోన్నత న్యాయస్థానం సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలను సెప్టెంబర్ లోపు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. వార్డుల విభజన, ఓటర్ జాబితాలో మార్పులు , చేర్పులు.. కొత్త ఓటర్ల నమోదు.. రిజర్వేషన్లు.. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాత ఎన్నికలు జరుగుతాయని తెలుస్తోంది.. ఇక తెలంగాణ రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. పార్లమెంటు ఎన్నికల్లో 8 స్థానాలు సాధించినప్పటికీ.. అధికార పార్టీకి ఆ ఫలితాలు అంతగా ఆనందాన్ని ఇవ్వలేదు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు ఏడాదిన్నర పరిపాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో.. స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల్లో జడ్పీ చైర్మన్, ఇతర స్థానాలను కైవసం చేసుకోవాలని భావిస్తోంది. మరోవైపు ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ కూడా అధికార పార్టీకి గట్టి పోటీ ఇస్తామని చెబుతున్నాయి.





# "బనకచర్ల" బెంబేలు..
## తెలంగాణలో సవాళ్ల రాజకీయం!

హైదరాబాద్ : తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి భారీ సవాల్ రువ్వారు. "నీ ఇష్టం. నీకు నచ్చిన రోజు రెడీగా. అసెంబ్లీ పెడతం. గోదావరి జలాలపై నువ్వు ఏం చేశావో.. మేం ఏం చేశామో.. చర్చిద్దాం" అని సవాల్ రువ్వారు. కేసీఆర్.. చర్చకు వస్తవా?! అని నిలదీశారు.

ప్రస్తుతం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య గోదావరి జలాల వ్యవహారం రాజకీయ రచ్చ రేపుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ ఎస్ నాయకులు.. రేవంత్ రెడ్డి సర్కారుపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. తన గురువు, ఏపీ సీఎం చంద్రబాబుకు మేలు చేస్తున్నాడని.. బీఆర్ ఎస్ కీలక నాయకులు విమ ర్శిస్తున్నారు. ముఖ్యంగా ఏపీలోని కర్నూలు జిల్లాలో నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణలోను, ఇటు రెండు రాష్ట్రాల్లోనూ రాజకీయంగా తీవ్ర వివాదం అయింది. బనక చర్ల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఏపీ తరలించుకుని పోయేందు కు రెడీ అయిందని.. అయినా రేవంత్ రెడ్డి ప్రభుత్వంనిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని బీఆర్‌ఎస్ నాయకులు హరీష్ రావు, కవిత, కేటీఆర్ సహా ఇతర నేతలు ఆరోపిస్తున్నారు. గోదావరి జలాలను తామే రక్షించామని చెప్పుకొచ్చారు.

మరోవైపు.. ఏపీ సీఎం చంద్రబాబు రెండు రాష్ట్రాలూ కూర్చుని చర్చించుకుంటే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. దీనికి రేవంత్ రెడ్డి కూడా దాదాపు ఒకే చెప్పారు. అయితే.. ఇంతలోనే బీఆర్ ఎస్ నాయకులు గోదావరి జలాలపై లాలూచీ వ్యవహారం చేసేందుకే గురు శిష్యులు ప్రయత్నిస్తున్నారంటూ.. ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులపై విమర్శలు చేశారు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి తాజాగా స్పందిస్తూ.. గోదావరి జలాల విషయంలో చర్చించేందుకు కేసీఆర్ ముందుకు రావాలని సవాల్ రువ్వారు. ఆయన చెప్పిన రోజే.. అసెంబ్లీ నిర్వహించేందుకు తాము సిద్దంగా ఉన్నామన్నారు. ఈ మేరకు స్పీకర్‌కు లేఖరాయాలని ఆయన సూచించారు. అవసరమైతే.. ఒక్కరోజు కాదు.. ఎన్ని రోజులైనా ఈ విషయంపై చర్చిద్దామని చెప్పారు. మరి దీనిపై బీఆర్ ఎస్ నాయకులు ఎలా రియాక్ట్ అవుతారో చూడాలి.



# ప్రజాస్వామ్యానికి చీకటియుగం 'ఎమర్జెన్సీ'.. కేంద్ర క్యాబినెట్

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గంపలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఎమర్జెన్సీ బాధితులకు నివాళిగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించిన క్యాబినెట్.. అత్యవసర పరిస్థితి (%జుఎవతీస్త్రవఅఎవ%)కి వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించింది. శుభాంశు శుక్లాతో కూడిన మిషన్ విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడాన్ని స్వాగతిస్తూ చేసిన మరో తీర్మానానికి ఆమోదం తెలిపిన మంత్రివర్గం పుణె, ఆగ్రాలలో పలు ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇంటర్నేషనల్ పొటాటో సెంటర్ (%జఖూ%)లో భాగంగా రూ. 111.5 కోట్లతో దక్షిణాసియా ప్రాంతీయ పరిశోధనా కేంద్రాన్ని ఆగ్రాలో ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పుణె మెట్రో రైలు విస్తరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.3,626 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఝూరండ్‌లోని ఝరియా బొగ్గు గనుల నిర్వాసితుల పునరావాసానికి (ఝరియా మాస్టర్ ప్లాన్) రూ.5,940 కోట్లు కేటాయించింది. నిర్వాసిత కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం కోసం నైపుణ్య శిక్షణ, స్థిరమైన జీవనోపాధి మార్గాలు చూపడం వంటివి ఇందులో ఉన్నాయి.

శుభాంశు శుక్లాతో కూడిన వ్యోమగాముల బృందం విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడాన్ని స్వాగతిస్తూ చేసిన తీర్మానానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 140కోట్ల భారతీయుల ఆశయాలను ఆయన మోసుకెళ్లారని, ఈ సందర్భంగా శుభాంశుతోపాటు ఇతర వ్యోమగాములకు అభినందనలు తెలిపింది. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన బాధితులకు సంఘీభావంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించిన క్యాబినెట్.. వారి త్యాగాలను గౌరవించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. ఈ ఏడాదితో సంవిధాన్ హత్యా దివస్‌కు 50ఏళ్లు పూర్తైందని పేర్కొంది.



# మూడు నెలల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించండి

హైదరాబాద్: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. గ్రామపంచాయతీ ఎన్నికలు 3 నెలల్లో నిర్వహించాలని, 30 రోజుల్లో వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి ఇవాళ తీర్పు వెలువరించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు 2024 జనవరి 30వ తేదీతో ముగిసినా ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ప్రశ్నించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని సవాలు చేస్తూ పలువురు మాజీ సర్పంచులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ టి.మాధవిదేవి ఇవాళ తీర్పు ఇచ్చారు. తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. "గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసినా.. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించింది. ఇది రాజ్యాంగ, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధం. ప్రత్యేక అధికారులు ఇతర విధుల్లో ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరుస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచులు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. ప్రస్తుతం ఆ నిధులు అందక ఇబ్బందులుపడుతున్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడంలేదు. వెంటనే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలి" అని కోరారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి మరో నెల రోజుల గడువు అవసరమని కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తికాగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపాక.. ప్రక్రియ పూర్తి చేయడానికి రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున... ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. న్యాయవాది సమాధానమిస్తూ..రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి మూడు నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు.

# ఆ భూముల పరిష్కారానికి జోక్యం చేసుకోండి.. కేంద్రమంత్రికి శ్రీధర్ వినతి

న్యూఢిల్లీ, జూన్ 25: దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు బిజీబిజీగా ఉన్నారు. ఈరోజు (బుధవారం) కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామితో మంత్రి సమావేశమయ్యారు. తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించిన భూముల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కుమారస్వామిని మంత్రి కోరారు. 1960లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన కోసం హైదరాబాద్ చుట్టుపక్కల విలువైన భూములను భారీ ఎత్తున రాయితీ ధరలకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించిందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో అనేకం మూతపడ్డాయని.. కొన్ని ఉత్పత్తులను నిలిపివేశాయని.. ఆ భూములన్నీ ఇప్పుడు నిరుపయోగంగా ఉన్నాయంటూ కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని కేంద్ర రంగ సంస్థలు తమ భూములను వాణిజ్య పరంగా వినియోగానికి మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. కేంద్ర రంగ సంస్థలకు ఇచ్చిన భూముల విషయంలో ఉపయోగంలో లేకుండా ఉండటం, పెట్టుబడులు ఉపసంహరించుకుంటూ ఎటువంటి ప్రత్యామ్నాయ ప్రణాళికలు లేకపోవడం వల్ల రాష్ట్ర అభివృద్ధికి ఆటంకంగా మారిందని తెలిపారు. సరైన పరిహారం లేకుండానే భూములను ప్రైవేట్ కంపెనీలకు బదిలీ చేయడం వల్ల రాష్ట్రానికి నష్టమే తప్ప ప్రయోజనం లేదని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారానికి



కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. భూముల విషయంలో రాష్ట్రాలకు మేలు కలిగేలా మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్రమంత్రి కుమారస్వామికి మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. **కేంద్రప్రభుత్వ రంగ సంస్థలు ఇవే...** 1. హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్, మేడ్చల్-మల్కాజిగిరి - 324.87 ఎకరాలు 2. హిందుస్తాన్ ఫ్లోరోకార్బన్స్ లిమిటెడ్, సంగారెడ్డి - 126.33 ఎకరాలు 3. ఐడీపీఎల్, మేడ్చల్-మల్కాజిగిరి - 551.03 ఎకరాలు 4. హెచ్‌ఎంటీ, మేడ్చల్-మల్కాజిగిరి - 888.05 ఎకరాలు 5. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), ఆదిలాబాద్ - 2,272.85 ఎకరాలు 6. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, ఎద్దుమైలారం, సంగారెడ్డి - 3,020 ఎకరాలు

# తెలంగాణలో మూడ్రోజులపాటు వర్షాలు.. ఐదు జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్: వాయువ్య బంగాళఖాతంలో రాగల 24 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో తెలంగాణలో రానున్న మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించింది.

ఇవాళ (బుధవారం) కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది.

ఆయా జిల్లాలకు జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.




# మోదీ.. ది ఎమర్జెన్సీ డైరీస్

దిల్లీ: దేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి నేటితో 50 ఏళ్లు పూర్తవుతోంది. ఈసందర్భంగా ఆ నాటి రోజులను గుర్తుచేసుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. గత కాంగ్రెస్ పాలనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నాటి దురాగతాలను భారతీయులెవరూ ఎన్నటికీ మర్చిపోలేరని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఎమర్జెన్సీ రోజుల్లో తన ప్రయాణాన్ని వివరించే ఓ పుస్తకం రానున్నట్లు ప్రధాని ప్రకటించారు. 'ది ఎమర్జెన్సీ డైరీస్' పేరుతో ఈ పుస్తకాన్ని తీసుకొస్తున్నారు. "ఎమర్జెన్సీ విధించిన సమయంలో నేను ఆర్‌ఎస్‌ఎస్‌లో యువ ప్రచారక్‌గా పనిచేస్తున్నా. అత్యయిక స్థితికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమం.. నాకు ఎన్నో పాఠాలు నేర్పించింది. అనుభవాలను మిగిల్చింది. మన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను ఈ ఉద్యమం పునరుద్ఘాటించింది. అదే సమయంలో ఎంతోమంది రాజకీయ ప్రముఖుల నుంచి నేర్చుకునే అవకాశం కల్పించింది. ఆ అనుభవాల్లో కొన్నింటిని సమీకరించి 'బ్లూక్రాఫ్ట్ డిజిటల్ ఫౌండేషన్' పుస్తక రూపంలో తీసుకొస్తోంది. 'ది ఎమర్జెన్సీ డైరీస్'.. అత్యయిక స్థితి నాటి రోజుల్లో నా ప్రయాణాన్ని వివరిస్తుంది. ఎన్నో జ్ఞాపకాలను గుర్తుచేస్తుంది" అని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ పుస్తకానికి మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ ముందుమాట రాశారు. దీన్ని బుధవారం సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షా విడుదల చేయనున్నారు.

**జాతి గుండెలపై చెరగని గాయం ప్రజాస్వామ్యాన్ని నిర్బంధించి..** ఈసందర్భంగా ఎమర్జెన్సీకి కారణమైన నాటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రధాని విమర్శలు గుప్పించారు. "దేశ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిన ఎమర్జెన్సీ విధించి నేటికి 50 ఏళ్లు పూర్తయ్యాయి. దీన్ని 'సంవిధాన్ హత్య దివస్'గా నేడు ప్రజలు గుర్తుంచుకోనున్నారు. యాభై ఏళ్ల క్రితం ఇదే రోజున భారత రాజ్యాంగ విలువలను పక్కన బెట్టి, ప్రాథమిక హక్కులను అణచివేసి, పత్రికా స్వేచ్ఛను కాలరాసి.. ఎంతోమంది రాజకీయ నేతలు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, సామాన్య పౌరులను జైలుకు పంపించారు. ఆ సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని నిర్బంధానికి గురిచేసింది. రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లంఘించి వారు ప్రవర్తించిన తీరును భారతీయులెవరూ ఎన్నటికీ మర్చిపోలేరు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రతి ఒక్కరికీ మేం సెల్యూట్ చేస్తున్నాం. రాజ్యాంగ విధానాలను మరింత బలోపేతం చేసి వికసిత్ భారత్‌ను నిర్మించేందుకు కృతనిశ్చయంతో ఉన్నాం. దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేస్తూ కొత్త శిఖరాలను అధిరోహిస్తాం" అని మోదీ రాసుకొచ్చారు.

# రేవంత్‌రెడ్డి నీ ఛాలెంజ్‌ని స్వీకరిస్తా.. హరీష్‌రావు ప్రతి సవాల్

సిద్దిపేట: బనకచర్ల ప్రాజెక్ట్ గురించి కాంగ్రెస్ పార్టీకి మాట్లాడే నైతిక హక్కు లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి 18 నెలల పాలన చూశాక కాంగ్రెస్ పార్టీ అంటే ఏంటో ప్రజలకు అర్థమైందని చెప్పారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలి, కావాలని ప్రజలు అంటున్నారని తెలిపారు. మళ్లీ పదేళ్ల దాకా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుండా రేవంత్‌రెడ్డి చేశారని అన్నారు. లోకల్ బాడీ ఎన్నికలు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు మాజీ మంత్రి హరీష్‌రావు. ఈ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే నిర్వహించడం లేదని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. ఇవాళ(బుధవారం) సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం యూత్ కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల ప్రశాంత్ పాటిల్ బీఆర్ఎస్‌లో చేరారు. ప్రశాంత్ పాటిల్‌కి హరీష్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హరీష్‌రావు వెంట ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. అబద్ధాల్లో సీఎం రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పోటీపడుతున్నారని ఎద్దేవా చేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. సీఎం రేవంత్‌రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ చర్చకు పోదామని అంటున్నారని.. ఎక్కడికి రమ్మంటారో చెప్పాలని.. తాను సిద్ధమని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రతి సవాల్ విసిరారు. ఏ టీవీలో కూర్చుందామో, ఎక్కడ




మాట్లాడుదామో చెప్పు తాను రెడీ... రేవంత్‌రెడ్డి వస్తారో, మహేష్ కుమార్ గౌడ్ వస్తారో చెప్పాలని ప్రతి సవాల్ చేశారు. అసెంబ్లీ నిర్వహించడం చేతగాక రేవంత్‌రెడ్డి పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. వారం రోజులకు మించి అసెంబ్లీ నడిపే పరిస్థితి లేదని చెప్పుకొచ్చారు. మళ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచేది కేసీఆర్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ఐదేళ్లు పూర్తిగా అధికారంలో ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు ఈ ఎన్నికల కోసం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. అందరం కలసి ఐక్యతతో ముందుకు పోతేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు సాధ్యమని హరీష్‌రావు పేర్కొన్నారు.

# భారాస సోషల్ మీడియా ప్రచారం ప్రజలు నమ్మొద్దు: మహేశ కుమార్‌గౌడ్

హైదరాబాద్: భారాస సోషల్ మీడియా ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "కాంగ్రెస్ హయాంలో జరిగిన సామాజికన్యాయం ఏ ప్రభుత్వంలోనూ జరగదు. గత ప్రభుత్వం ఎన్నికల కోసమే పథకాలు తెచ్చేది. హుజూరాబాద్ ఎన్నిక కోసమే దళితబంధు తీసుకొచ్చారు. భారాస పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని.. కాంగ్రెస్ 18 నెలల్లో చేసింది. అభూత కల్పనలతో సోషల్ మీడియాలో భారాస ప్రచారం చేస్తోంది. రాష్ట్రంలో పరిపాలన అద్భుతంగా జరుగుతోంది.

పదేళ్ల భారాస పాలన తర్వాత వాళ్ల పరిస్థితి ఏంటో ప్రజలకు తెలుసు. రాష్ట్ర అవసరాలను, హక్కులను గత ప్రభుత్వం




తాకట్టుపెట్టింది. గోదావరి-బనకచర్లపై లోతుగా అధ్యయనం చేసి నిర్ణయం ప్రకటిస్తాం" అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ చేయించాలి: ఎంపీ డీకే అరుణ



నల్లగొండ: స్థానిక సంస్థలకు వెళ్లే ధైర్యం కాంగ్రెస్‌కి లేదని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. రెండు ఎకరాలు ఉన్నవారికి కూడా రైతు భరోసా ఇంకా రాలేదని.. అలాంటప్పుడు రైతు భరోసా పేరుతో సంబురాలు ఎందుకు చేసుకుంటున్నారో కాంగ్రెస్ నేతలకే తెలియదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌లో బీజేపీ నాయకులందరూ బాధితులేనని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ ప్రభుత్వం ఇంత వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదని నిలదీశారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ చేయించాలని కోరారు. ఇవాళ(బుధవారం) నల్లగొండలో ఎంపీ డీకే అరుణ పర్యటించారు. బీజేపీ నేతలతో పార్టీ కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. జూన్ 25వ తేదీ దేశ చరిత్రలో చీకటి రోజని తెలిపారు ఎంపీ డీకే అరుణ. ఎమర్జెన్సీ పేరుతో కాంగ్రెస్ చేసిన అరాచకాల గురించి ప్రజలందరికీ తెలియాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆనాడు పేదలపై అరాచకాలు చేశారని.. ఈనాడు సామాజిక న్యాయం అంటూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ తన అజెండాను దేశంపై రుద్దేందుకు రాజ్యాంగ సవరణలు చేపట్టిందని చెప్పుకొచ్చారు. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచిన కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగం గురించి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రపంచ వ్యాప్తంగా లభిస్తోన్న ఖ్యాతిని చూసి రాహుల్ గాంధీ ఓర్వలేక పోతున్నారని ధ్వజమెత్తారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత శక్తి ఏంటో పాకిస్థాన్‌కి చూపించామని తెలిపారు. ప్రధానిని విమర్శించే సీఎం రేవంత్‌రెడ్డి ఎమర్జెన్సీ గురించి ముందుగా మాట్లాడాలని ఎంపీ డీకే అరుణ హితవు పలికారు.

# సింహవాహిని టెంపుల్‌కు డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ : తెలంగాణ బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఆషాడ మాస బోనాల పండుగకు హైదరాబాద్ సిటీలోని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. బోనాల సందర్భంగా వివిధ ఆలయాల్లో సీఎం రేవంత్?తో పాటు మంత్రులు, ముఖ్యనేతలు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఈ నేపథ్యంలో ఏ ఆలయంలో ఎవరు పట్టువస్త్రాలు సమర్పిస్తారనే వివరాలను దేవాదాయశాఖ మంగళవారం వెల్లడించింది. వచ్చే నెల 13న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో నిర్వహించే బోనాల ఉత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. 20న లాల్ దర్వాజ సింహవాహిని మహంకాళి ఆలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని అధికారులు తెలిపారు.



# ఉజ్జయిని మహంకాళి బోనాలకు సీఎం

చురకలు

గురువారం 26 జూన్ 2025

# అమ్మ పూజకు అనువైన మాసం ఆషాఢం

## విశిష్ట పండగలకు నెలవు ఆషాడం



జ్యోతిష శాస్త్ర ప్రకారం ప్రతి మాసం నిర్ణయం ఆ మాసంలో పౌర్ణమి రోజున వచ్చే నక్షత్రం ఆధారంగా చేయబడుతుంది. చైత్ర పౌర్ణమి రోజున చంద్ర సంచారము చిత్తా నక్షత్రం అవుతుంది. కనుక ఆ మాసానికి చైత్ర మాసమని, విశాఖ నక్షత్రమందు సంచరించుట వల్ల వైశాఖ మాసం అని, ఇలా పన్నెండు మాసాలు పౌర్ణమిలలో చంద్రుని సంచారం ఆధారంగా పేర్లను నిర్ణయించారు. చంద్రుడు పౌర్ణమి రోజున పూర్వాషాఢ /ఉత్తరాషాఢ నక్షత్ర సమీపాన సంచరించే మాసం ఆషాఢ మాసం. దీనిని శూన్య మాసం అంటారు. వైశాఖ, జ్యేష్ఠ మాసాలు వివాహాలు, గృహ ప్రవేశాలు, ఉపనయనాలు వంటి శుభకార్యాలతో కళకళలాడితే అషాఢమాసం వాటన్నింటికీ విరామం ప్రకటించే మాసం. ఆషాఢ మాసము తెలుగు సంవత్సరంలో నాలుగవ నెల. ఈ నెలలో పౌర్ణమినాడు చంద్రుడు ఉత్తరాషాఢ/పూర్వాషాఢ నక్షత్రాల సమీపంలోనికి వచ్చే నెల, ఉత్తరాయణ పుణ్యకాలం పూర్తయి సూర్యుడు మిథునరాశి నుంచి కర్కాటకరాశి లోనికి ప్రవేశిస్తాడు. దాంతో దక్షిణాయనం మొదలవుతుంది. ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు విష్ణువు పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్ళే సందర్భాన్ని "తొలి ఏకాదశి"గా పరిగణిస్తారు. ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున "గురు పౌర్ణమి"గా వ్యవహరిస్తారు. మహా భాగవతాన్ని రచించిన వేద వ్యాసుడు జన్మించిన రోజును "వ్యాస పౌర్ణమి" అని కూడా అంటారు. వ్యాసుడు వేదాల్ని నాలుగు భాగాలుగా విభజించిన రోజు కూడా ఇదేనంటారు. ఆషాడం నుండే దక్షిణాయనం, వర్షరుతువు ప్రారంభం అవుతాయి. సూర్యుడు కర్కాటక రాశి లోనికి ప్రవేశించడంతో ప్రారంభమయ్యే దక్షిణాయనం, తిరిగి మకర రాశి గతుడు కావడం వరకు, ఆరు మాసాలు ఉంటుంది. సూర్యుడు భూమధ్య రేఖకు దక్షిణంగా సంచరిస్తారు. దక్షిణాయనం ప్రీతికరం. ఉత్తరాయణం కన్నా దక్షిణాయణం లోనే పండుగలు, పబ్బాలు అధికం. ఆషాడంలో ప్రధానంగా, శుక్ల పక్ష విదియ నాడు జగన్నాథ, బలభద్ర, సుభద్ర, రథయాత్రలో నిర్వహిస్తారు. "ఆషాఢ శుద్ధ పంచమ్యాం, వచ్చెనే వృద్ధ గౌతమి... అథవా తప్పి దారేణా, ద్వాదశ్యామది తప్పదు". అని లోకోక్తి ఉంది. గోదావరి తీర వాసుల్లో పంచమి తప్పితే ద్వాదశి గోదావరి వరద రాగలరని భావన, స్కంద పంచమి నాడు సుబ్రమణ్య స్వామిని ఆరాధించే దినంగా "కుమార షష్ఠి"గా, "భాను సప్తమి" పర్వదినాలను ఆచరిస్తారు. దశమి నాడు మహాలక్ష్మి ఆరాధిస్తారు. ప్రధానంగా శుక్ల ఏకాదశి "తొలి ఏకాదశి" అంటారు. "మహా ఏకాదశి"గా "ప్రథమైకాదశి" గా "శయన ఏకాదశి" గా పిలువబడే ఈ దినం నాడు చాతుర్మాస దీక్షలు ప్రారంభిస్తారు. ఉ త్తరాయణంలో పండగలు పబ్బాలు అధికం. అయితే దక్షిణాయనంలో ఆరోగ్య పరిరక్షణార్ధం, నియమాలు ఎక్కువగా పాటించాల్సిన సమయంలో, పూర్వీకులైన పెద్దలు, వ్రతాలు ఉత్సవాలు ఎక్కువ పెట్టారు. వాటికి బోణీ వంటిది తొలి ఏకాదశి. త్రైమూర్త్య స్వరూపుడైన గురువును పూజించే దినం "గురు పూర్ణిమ" లేదా "వ్యాస పూర్ణిమ". తెలంగాణలో ఆషాడంలో "బోనాల పండుగ" జరుపు కోవడం, అనాది నుండి వస్తున్నది. భోజనానికి వికృతి అయిన బోనాన్ని అమ్మవారికి నివేదించడం గ్రామీణ ఆచారం. హైదరాబాదు, సికింద్రాబాదు, తెలంగాణ, రాయలసీమలోని కొన్ని ప్రాంతాలలో ఆషాఢ మాసంలో బోనాలు పండుగ జరుపుకో బడుతుంది. మార్పు వల్ల, ఆరోగ్యానికి హాని చేకూర్చే వ్యాధుల నుండి కాపాడే, అన్నం, బెల్లం, పెరుగు, పసుపు నీళ్ళు, వేపాకులు, బోనాల్లో చేరుస్తారు. రైతులు వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యే కాలమిది. గ్రామీణులు వ్యవసాయ పనులకు వెళుతూ, తీరిక లేకుండా పని చేయాల్సి ఉన్నందున, విత్తడానికి అనువైన కాలం అయినందున, వైవాహిక జీవితం ధ్యాస నుండి మళ్ళించేందుకు, అత్తవారింటికి అల్లుడు వెళ్లకూడదనే నియమం పెట్టారు. పూర్వకాలంలో వ్యవసాయమే జీవనాధారం. సంపాదన మాట అటు నుంచి తినడానికైనా కొన్ని గింజలు ఉండాలని, కొత్త వలపు మోజులో పడి జీవనాధారమైన వ్యవసాయాన్ని ఎక్కడ నిర్లక్ష్యం చేస్తారో. అనీ ఈ నిబంధన పెట్టారు. అంతే కాదు ఈ మాసంలోని వాతావరణంలో చాలా మార్పులు చోటు చేసుకుటాయి. చల్లని వాతావరణం వల్ల బ్యాక్టీరియా, వైరస్లు అంటువ్యాధులుగా బాగా ప్రబలుతాయి. ఇలాంటి సమయంలో కొత్త పెళ్ళి కూతురు గర్భం దాల్చితే, పుట్టబోయే బిడ్డమీద వాటి ప్రభావం ఉంటుందనేది శాస్త్రీయ నమ్మకం. పిండానికి తొలి మూడు నెలలు చాలా ముఖ్యం. ఆ సమయంలోనే అవయవాలు ఏర్పడతాయి. జన్మించిన సమయం కన్నా, గర్భధారణ సమయం ముఖ్యమని పూర్వకాలంలో భావించేవారు. ఆషాఢంలో గర్భం దాల్చితే తొమ్మిది నెలలకి అంటే చైత్రం పూర్తవుతుంది. ఆ సమయంలో ఎండకు పుట్టిన పిల్లలు, బాలింతలు తట్టుకోలేదని ఈ నియమం పెట్టారు. అలాగే ఒక నెల వియోగం తర్వాత కలుసుకుంటే అన్యోన్యత దాంపత్యాన్ని పొందుతారని అని కూడా అంటారు. కావున ఈ నెలలో వధువు పుట్టింట్లో ఉండడమే క్షేమమని, పెద్దలు ఆధారంగా పెట్టారు. దీన్ని అనారోగ్య మానంగా పేర్కొంటారు. అందుకే కొత్తగా వివాహం అయిన నవ వధువులు, అత్త వారిళ్ళలో కాకుండా, తల్లిగారిళ్ళలో నెల రోజులు ఉండే సంప్రదాయం, ఇంకా కొనసాగుతూనే ఉంది.

ఆషాఢ మాసంలో నవదంపతులు కలవ కూడదనే ఆచారాన్ని మనదేశం లోని హైందవేతర మతస్తులు కూడా కొన్నిచోట్ల పాటిస్తుంటారు. ఈ మాసంలో పాదరక్షలు, గొడుగు, ఉప్పు, దానం చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయి. స్నానం, దానం జపం సత్కర్మల ఆచరణకు ముఖ్యమైన మాసం. గృహ నిర్మాణ ఆరంభాలకు శుభ సూచకమైన మాసంగా చెప్పబడింది. ఆషాఢంలో గృహ నిర్మాణం ప్రారంభిస్తే భృత్య, రత్న, పశు ప్రాప్తి కలుగుతుందని మత్స్యపురాణం వివరిస్తున్నది. ఆషాడంలో ఒక్కసారైనా గోరింటాకు పెట్టుకోవడం, ములగ కూర తినడం, అనప పప్పు వాడకాలు, ఆచారాలు ఉన్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# వరదాయిని వారాహి దేవి

## - ఆషాఢ శుద్ధ పాడ్యమి నుండి వారాహీ దేవి నవరాత్రులు



ఆషాఢ శుద్ధ పాడ్యమి నుంచి ఆషాఢ శుద్ధ నవమి వరకు గల తిథుల రాత్రి సమయంలో వారాహీ అమ్మవారిని పూజిస్తారు. వీటిని గుప్త నవరాత్రులు అంటారు. వారాహి దేవి అమ్మవారి శక్తి రూపాలలో ఒకటి. ఈమెను సప్త మాతృకలలో ఒకామెగా, దశ మహావిద్యలలో ఒకామెగా కొలుస్తారు. బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి., ఇంద్రాణీ, చాముండి, వంటి సప్త మాతృకలలో వారాహి ఒకరు. వారాహి దేవి వరాహ ముఖం అనగా పంది ముఖం కలిగి, చక్రం, కత్తి ధరించి భక్తులకు దర్శనమిస్తోంది. లలితా సహస్ర నామాలలో వారాహి దేవి నామం ఉండటం కనిపిస్తుంది. వారాహి దేవిని శైవులు, వైష్ణవులు, శాక్తేయులు పూజిస్తారు. పూర్వం హిరాణ్యాక్షుడు అనే రాక్షసుని సంహరించి, భులోకాన్ని ఉద్ధరించిన విష్ణువు అవతారమే వరాహమూర్తి. ఆ వరాహమూర్తికి ఉన్న స్త్రీతత్వమే వారాహి అంటారు. వారాహీ అమ్మవారు అంటే భూదేవి. వరాహుని స్త్రీతత్వమే వారాహి. శ్రీ వరాహస్వామి వారి స్త్రీతత్వముగా వారాహీ తల్లిగా మన పురాణాలు పేర్కొన్నాయి. మన ధర్మ సాహిత్య గ్రంథాల్లో శ్రీ వరాహస్వామికి తల్లి గా ప్రకటితమవుతుంది. దేవీ భాగవతం, మార్కండేయ పురాణం, వరాహ పురాణం వంటి పురాణాలలో ఈమె ప్రసక్తి కనిపిస్తుంది. ఆయా పురాణాలలో అంధకాసురుడు, రక్తబీజుడు, శుంభ నిశుంభులు వంటి రాక్షసులను సంహరించడంలో ఆమె పాత్ర స్పష్టంగా కనిపిస్తుంది. లలితాదేవికి సైన్యాధిపతిగా వారాహిదేవిని వర్ణిస్తారు. అందుకే ఈమె ప్రస్తావన లలితా సహస్ర నామంలో కూడా కనిపిస్తుంది. వారాహి రూపం దాదాపుగా వరాహమూర్తినే పోలి ఉంటుంది. ఈమె శరీరఛాయను నల్లని మేఘ వర్ణంలో ఉన్నట్లు పేర్కొంటారు. సాధారణంగా ఈ తల్లి వరాహ ముఖంతో, ఎనిమిది చేతులతో కనిపిస్తుంది. అభయవరద హస్తాలత శంఖము, పాశము, హలము వంటి ఆయుధాలతో దర్శనమిస్తుంది. నామ స్తోత్రంలో వారాహీ ధరణీ ధ్రువా అని కనిపిస్తుంది. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఈమె ఆలయాలు ఉన్నప్పటికీ చౌరాసి (ఒడిశా), వారణాసి, మైలాపూర్ (చెన్నై)లో ఉన్న ఈమె ఆలయాలకు ప్రాధాన్యత ఎక్కువ. వారాహి అమ్మవారు వారణాసికి గ్రామ దేవత. అంటే వారణాసిని ఎల్లప్పుడూ రక్షిస్తూ ఉండే దేవత. ఈమెకు వారణాసిలో ఒక విచిత్రమైన దేవాలయం ఉంది. ఆషాఢ శుద్ధ పాడ్యమి నుంచి ఆషాఢ శుద్ధ నవమి వరకు గల తిథుల రాత్రి సమయంలో వారాహీ అమ్మవారిని పూజిస్తారు.

వీటిని గుప్త నవరాత్రులు అంటారు. ఆషాఢ శుద్ధ పాడ్యమి నుండీ వారాహీ నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. అమ్మవారిని చిత్రాన్ని పరిశీలిస్తే, హలము (నాగలి), ముసలము (రోకలి) ధరించి కనిపిస్తుంది. నాగలిని భూమిని దున్నడానికి ఉపయోగిస్తే, రోకలిని ధాన్యం దంచడానికి వాడతారు. నుంచి పురాణాల ప్రకారం సస్య శామలం కావడానికి భూమాత రూపమైన వారాహీ దేవతను పూజించడం ఆనవాయితీగా ఉంది. అమ్మవారిని పూజిస్తే అన్ని కోరికలను నెరవేర్చు తుంది. భూతగాదాలను నివారిస్తుంది, పరిష్కరిస్తుంది. దేశం సుభిక్షంగా ఉండాలని, అందరూ చల్లగా ఉండాలని, ధర్మం వైపు మనం నడవాలని... అమ్మ మహా వారాహినిని పూజించడం సత్సాంప్రదాయం.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# బీజేపీ తీర్థం పుచ్చుకోనున్న మీనా.. ఈసారి పక్కానా?



సినీ నటి మీనా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వనున్నారా? ఆమె భారతీయ జనతాపార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారా? అన్నదిప్పుడు తాజా చర్చగా మారింది. నిజానికి మీనా బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారంటూ గత ఏడాది మొదట్లోనూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. కట్ చేస్తే.. మళ్లీ ఇప్పుడు కూడా ఇదే చర్చ మొదలైంది. దీనికి కారణం లేకపోలేదు. తాజాగా ఆమె ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ కడ్ ను కలిశారు. ఆయన్ను కలిసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఒకప్పుడు తెలుగు.. తమిళ సినీ రంగంలో అగ్రనటిగా వెలుగొందిన మీనా వ్యక్తిగత జీవితంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె భర్త 2022లో అనారోగ్యంతో మరణించారు. అప్పటినుంచి ఆమె ఒంటరిగానే ఉన్నారు. మీనా కుమార్తె నైనిక ఇటీవల అగ్రహీరో విజయ్ నటించిన మూవీలో యాక్ట్ చేయటం తెలిసిందే. ఈ మధ్యన దేశ రాజధాని ఢిల్లీ వెళ్లిన మీనా.. అక్కడ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ ను కలిశారు. వీరి భేటీకి సంబంధించిన ఫోటోలు బయటకురావటంతో మీనా బీజేపీలోకి చేరేందుకు ఆసక్తిని చూపుతున్నట్లు వార్తల జోరు పెరిగింది. అయితే.. ఆమె గతాన్ని చూస్తే.. గత ఏడాది (2024) జనవరిలో ఆమె ఢిల్లీకి వెళ్లారు.అక్కడ జరిగే కార్యక్రమానికి అటెండ్ అయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హాజరయ్యారు. గత ఏడాది కేంద్రమంత్రి మురుగన్ పొంగల్ వేడుకల్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మీనాకు ఇన్విటేషన్ ఉండటం.. ఆమె ఆ ప్రోగ్రాంకు హాజరుకావటం అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అయితే.. ఆమె మౌనంగా ఉండిపోయారు. తాజాగా మాత్రం ఉప రాష్ట్రపతితో ఆమె భేటీ.. రాజకీయాల్లోకి రావటానికి ముందే పక్కా గ్రౌండ్ వర్కు చేసేందుకు వీలుగా ఆమె ప్లానింగ్ ఉందా? అన్నది ప్రశ్నగా మారింది. తమిళనాడు రాజకీయాల్లో స్పేస్ ఉండటం.. కొత్త నాయకత్వం దిశగా అడుగులు వేసి.. అధికారాన్ని సొంతం చేసుకోవాలంటే ఇదే సరైన సమయంగా చెబుతున్నారు. ఎందుకంటే.. మరికొద్ది నెలల్లో తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్నాయి. విపక్ష అన్నాడీఎంకేతో కలిసి బీజేపీతో పొత్తు ఖాయం చేసుకున్నారు. యువ నటుడు విజయ్ తో కలిసి ఒక ఈ మూడు పార్టీలు కూటమిగా ఏర్పడే ఆలోచనలు జోరుగా తాగుతున్నాయి. మరోవైపుఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం బీజేపీ నేతలు నిర్వహించే కార్యక్రమానికి పవన్ కల్యాణ్ హాజరు కావటం.. తన ప్రసంగంతో ఆకట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పార్టీకి మరింత సినీ గ్లామర్ ను జోడించటం ద్వారా ఈసారి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కొలువు తీరేలా కమలనాథులు ప్లాన్ చేస్తున్నారు. అందుకు తగ్గట్లే సినీ నటి మీనాను పొలిటికల్ ఎంట్రీ ఇచ్చేలా ప్లాన్ చేస్తున్నట్లుగా కనిపిస్తోంది.

# డజను పెళ్లిళ్లు అబద్ధం..

## పోలీసులు ముందుకొచ్చిన నీలిమ!

కోనసీమ జిల్లాకు చెందిన ఓ యువతి.. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా డజను పెళ్లిళ్లు చేసుకుందని.. ఈ నేపథ్యంలో బాధితులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని.. ఈమె అత్యంత పకడ్బందీగా పక్కాగా ప్లాన్ చేసి మరీ విడాకులు పొంది, ఆర్థికంగా స్థితిమంతులైన మగవారిని టార్గెట్ చేసుకుని, పెళ్లి చేసుకుంటుందని ప్రధాన మీడియాలో కథనాలొచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా.. రామచంద్రాపురం గ్రామానికి చెందిన బేతి వీర దుర్గా నీలిమ అనే యువతి.. తన తల్లి, మరో ఇద్దరి సహకారంతో విడాకులు తీసుకుని డిప్రషన్ లో ఉన్న పురుషులను ఎంచుకుని, వివాహం చేసుకుంటుందని.. కొంత కాలం తరువాత అందినంత సొమ్ము లాగేస్తుందని కథనాలొచ్చాయి. ఈ క్రమంలో సుమారు 12 పెళ్లిళ్లు చేసుకున్నట్లు కథనాలొచ్చాయి. అయితే అదంతా అబద్ధం అంటూ నీలిమ మీడియా ముందుకు వచ్చారు. అవును...




తనపై "నిత్య పెళ్లి కూతురు, 12 పెళ్లిళ్లు చేసుకుంది" అంటూ జరుగుతున్న ప్రచారంపై నీలిమ అనే యువతి మీడియా ముందుకు వచ్చారు. ఈ ందర్భంగా... తనపై జరుగుతున్న ప్రచారం అంతా అబద్ధమని తెలిపారు. ఈ సందర్భంగా తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను అరికట్టాలని కోరుతూ రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు ఎవరి నుంచి సహాయం దొరకలేదని వాపోయారు. ఇప్పటికే కొంతకాలంగా తన జీవితాన్ని ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించిన నీలిమ... న్యాయం కోసం పలువురు రాజకీయ నాయకులను ఆశ్రయించినా ఫలితం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన పరువు, గౌరవాన్ని కాపాడుకోవడానికి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. తప్పుడు ప్రచారాలు, అసత్య ఆరోపణలతో వెనక్కి తగ్గే మనిషిని కాదని చెప్పుకొచ్చారు. తనపై చేసిన ఆరోపణలు నిజం కాకపోయినా వాటి వల్ల తనకు తీవ్రంగా నష్టం జరిగిందని.. ఎవరు ఇలా చేస్తున్నారో, ఎందుకు చేస్తున్నారు అనేది త్వరలో బయట పడుతుందని.. అప్పటి వరకు తన పోరాటం ఆగదని ఆమె తెలిపారు. తనకు 12 పెళ్లిళ్లు అయ్యాయి అంటున్నవారు వాటిని సాక్ష్యాధారాలతో సహా నిరూపించాలని ఆమె కోరారు!

# మర్డర్ చేసి ఫారిన్ వెళ్లాలని సెట్ చేసుకున్నారట

సాదాసీదా మనుషులు కరుడుగట్టిన నేరస్తుల మాదిరి ప్లానింగ్ చేయటం.. వెనుకా ముందు చూసుకోకుండా కర్కశంగా హత్యలు చేయటం.. ఆ నేరం నుంచి శిక్ష పడకుండా తప్పించుకోవటం కోసం చేసే ప్లానింగ్ చూసినప్పుడు.. మరీ ఇంత ముదురు ఆలోచనలా? అంటూ హడలిపోవటం ఖాయం. సంచలనంగా మారిన తేజేశ్వర్ హత్య ఉదంతంలో కొత్త నిజాలు వెలుగు చూసి షాకిస్తున్నాయి. వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకొని.. ధనవంతుడైన తేజేశ్వర్ ను పెళ్లాడి.. అతడి డబ్బును కొల్లగొట్టి.. ఆపై హత్య చేసి పారిపోవాలనుకున్న ప్లాన్ బెడిసి కొట్టి జైలుపాలైన సంగతి తెలిసిందే. తేజేశ్వర్ హత్య కేసును విచారిస్తున్న పోలీసులు సైతం నివ్వెర పోయే నిజాలు తాజాగా వెలుగు చూశాయి. తేజేశ్వర్ ను చంపిన తర్వాత తిరుమలరావు.. ఐశ్వర్య కలిసి తొలుత లద్దాఖ్ కు వెళ్లి.. అక్కడి నుంచి విదేశాలకు పారిపోయేందుకు ప్లాన్ చేసుకున్నారు. ఇందుకోసం రెండు విమాన టికెట్లు బుక్ చేసుకోవటంతో పాటు.. రూ.20 లక్షలు



సమకూర్చుకున్నారు. తాము సిద్ధం చేసుకున్న డబ్బుల్లో నుంచే రూ.2 లక్షల మొత్తాన్ని సుపారీ గ్యాంగ్ కు ఇచ్చారు. హత్య అనంతరం.. ఆ విషయం బయటకు రావటానికి ముందే విదేశాలకు పారిపోవాలని భావించారు. అయితే.. తేజేశ్వర్ కనిపించకపోవటంతో.. అతడి సోదరుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయటం.. వదిన ఐశ్వర్యపై అనుమానం వ్యక్తం చేయటంతో పోలీసులు స్పందించారు. ఆమెను అదుపులోకి తీసుకొని విచారించారు. తిరుమలరావు ఒక్కడే పారిపోయేందుకు ప్రయత్నించగా..అతడ్ని శంషాబాద్ ఎయిర్ పోర్టుకు సమీపంలో అదుపులోకి తీసుకోవటంతో.. అతడి ప్లాన్ బెడిసి కొట్టింది. అయితే.. అతడ్ని అదుపులోకి తీసుకున్నట్లుగా పోలీసులు ఇప్పటివరకు ప్రకటించలేదు. విశ్వసనీ సమాచారం ప్రకారం.. బ్యాంకులో పని చేసే తిరుమల రావు తొలుత తన మొదటి భార్యను చంపేసి.. ఆ తర్వాత ఐశ్వర్యను పెళ్లాడాలని భావించాడు.అయితే.. ఐశ్వర్యకు డబ్బులున్న వ్యక్తి సంబంధంరావటంతో.. అతడ్ని పెళ్లాడి..అతడి డబ్బుల్ని తీసుకొని చంపేద్దామని ప్లాన్ చేశారు. బ్యాంక్ లో పని చేసే తిరుమలరావు తన విధుల నిర్వహణలోనూ అవకతవకలకు పాల్పడతారన్న ప్రచారం జరుగుతోంది. మొత్తంగా చూస్తే.. అత్యాశకు పోవటం.. అంతమొందించే ప్లాన్లు వేసి పోలీసుల కళ్లు గప్పి పారిపోవటటం ఇప్పుడున్న పరిస్థితుల్లో అసాధ్యమన్న విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది.

చురకలు

## సంపాదకీయం

# తమిళనాడు పిలుస్తోంది పవన్ !

సినీ నటుడు రాజకీయ నాయకుడుగా మారిన పవన్ కళ్యాణ్ కి ఉన్న సౌలభ్యత ఎవరికీ ఉండదు. మామూలుగా రాజకీయాలు చేసే రెగ్యులర్ పొలిటీషియన్ కి అసలు ఈ తరహా వెసులుబాటు ఉండదు. ఎందుకంటే పవన్ స్క్రీన్ ఇమేజ్ ఆకాశమంతా. అది విస్తరించే పరిధి భూమండలమంతా. ఎక్కడ తెర ఉంటే అక్కడ పవన్ అలా పరచుకుపోతారు. అందుకే ఆయన సినీ గ్లామర్ రాజకీయాల్లో రక్షణ కవచంగా ఉంటూ కాపాడుతోంది. ఇక చూస్తే తెలుగు నాట రెండు రాష్ట్రాలలో పవన్ ఎక్కడికి వెళ్లినా ఫ్యాన్స్ పెద్ద ఎత్తున వస్తారు. పవన్ కూడా ఏ చోటకు వెళ్ళినా ఆ రిఫరెన్స్ తెస్తూ తాను స్థానికుడినే అన్న ఫీలింగ్ ఇస్తూ ఉంటారు. ఇపుడు తెలుగు నాట దాటి తమిళనాడుకు పవన్ వెళ్లారు. అక్కడ కూడా తాను తమిళనాడు కల్చర్ ని అభిమానిస్తాను అని పవన్ చెప్పుకున్నారు. తాజాగా మురుగన్ మహా భక్తి అమ్మేళనంలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం ఆధ్యాత్మికతతో కూడిన ప్రసంగం ఆసక్తిని పెంచింది. ఆయన ఈ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ఎవరికి తగలాలో వారికే తగిలాయి. అందుకే పవన్ పర్యటన ఇలా పూర్తి అయిందో లేదో అలా రీ సౌండ్ వస్తోంది. పవన్ తమిళ పర్యటన మీద ఇప్పటికే డీఎంకే విమర్శలు చేస్తూ వస్తోంది. తాజాగా అధికార డీఎంకే నుండి ఒక గట్టి సవాల్ అయితే పవన్ కి వచ్చింది పవన్‌కల్యాణ్ ని ఏకంగా తమిళనాడుకి పిలిచి మరీ పోటీ చేయమంటున్నారు డీఎంకే మంత్రి శేఖర్‌బాబు. తమిళనాడుకు తరచూ వస్తూ బీజేపీ వారి సభలు సమావేశాలలో పాలుపంచుకుంటున్న పవన్ కి ఒక పదునైన సవాల్ నే ఆయన విసిరారు. 2026లో తమిళనాడులో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నై నుంచి పోటీ చేసే దమ్ముందా పవన్ అని ఆయన నిగ్గదీశారు. మీరు చెన్నైలోని ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేయండి అని ఆఫర్ కూడా ఇచ్చేశారు. అంతే కాదు తమిళనాడు ఎన్నికల్లో పవన్ గెలిచి చూపించాలని అన్నారు. అలా పవన్ గెలిచిన తర్వాత ఆయన ఎన్నిచెప్పినా వినడానికి సిద్ధం అని డీఎంకే అంటోంది. అంతే కాదు అసలు తమిళనాడుతో పవన్‌కు ఏం సంబంధం ఉంది అని ఒక లాజిక్ తో కూడిన ప్రశ్నను సంధిస్తోంది అంతే కాదు అక్కడ అధికారంలో ఉన్న మమ్మల్ని ప్రశ్నించడానికి పవన్‌కల్యాణ్ ఎవరు అని నిలదీస్తోంది. ఇక బీజేపీ మాయలో మత రాజకీయాలను ప్రోత్సహించవద్దు పవన్ అని అంటోంది. తాము దేవదాయశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేస్తోంది. అంతే కాదు పవన్ మాటలు నమ్మడానికి తమిళ ప్రజలు సిద్ధంగా లేరని తమిళనాడు మంత్రి శేఖర్‌బాబు చెబుతున్నారు. అయితే ఈ చివరి మాటలే కాస్తా విడ్డూరంగా ఉన్నాయని అంటున్నారు. పవన్ ని నమ్మడానికి తమిళ ప్రజలు సిద్ధంగా లేకపోతే మంత్రి గారికి ఎందుకు అంత ఆయాసం అని అంటున్నారు. ఎవరు కాదన్నా పవన్ కి బ్రహ్మాండమైన సినీ ఇమేజ్ ఉంది. దాంతో పాటు ఆయనకు రాజకీయంగా ఉండాల్సిన ఇమేజ్ సైతం ఉంది. దాంతో పవన్ ఎక్కడికి వెళ్ళినా జనాలు వెల్లువలా వస్తారు. ఆయన ప్రసంగాలు శ్రద్ధతో ఆలకిస్తారు. పవన్ సైతం తనదైన శైలిలో ఆకట్టుకుంటారు. తమిళనాడు బీజేపీకి ఇపుడు పవన్ బాగా అందుకు వస్తున్నారు. దాంతో అధికార డీఎంకేకి కాస్తా మంటగా ఉంది అని అంటున్నారు. పైగా సనాతన ధర్మం గురించి పవన్ చాలా చెబుతున్నారు. అదే తమిళనాడు నుంచి స్టాలిన్ కుమారుడు సనాతన ధర్మం గురించి ఎంతగా విమర్శలు చేశారో కూడా అంతా చూశారు అని అంటున్నారు. తమిళనాడు చూస్తే ఆధ్యాత్మిక క్షేత్రంలో ఉంటుంది. అక్కడ ఉన్నన్ని మఠాలు క్షేత్రాలు ఆలయాలు దేశంలో ఎక్కడా లేవు. అలాంటి చోట సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడేవారు ఉన్నారు. అదే విచిత్రం అని అంటారు. మరి భక్తి సమ్మేళనం బీజేపీ నిర్వహించడం పవన్ వెళ్లడంతో రాజకీయ సన్నివేశంలో భారీ మార్పు వస్తోంది అని అంటున్నారు. అందుకే డీఎంకే పవన్ ని గట్టిగా విమర్శిస్తోంది అని అంటున్నారు. మొత్తానికి చూస్తే పవన్ కి తమిళనాడు నుంచి పిలుపులు వస్తున్నాయి. మరి ఆయన ఏమి చేస్తారో చూడాల్సిందే.


# తీర ప్రాంత పరిరక్షణలో నౌకాదళ అసమాన సేవలు - జూన్ 26... వారుణాస్త్ర భారత దేశ నౌకా దళంలో చేరిన దినం



భారత నావికాదళం దేశం యొక్క సముద్ర సరిహద్దులను భద్ర పరచుటలో, ఓడరేవు సందర్శనల ద్వారా, భారతదేశం అంతర్జాతీయ సంబంధాలను విస్తరించుటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. భారతదేశ నావికా దళం భారత సైనిక దళాల యొక్క సముద్ర విభాగం. భారతదేశ రాష్ట్రపతి నౌకాదళానికి సర్వ సైన్యాధ్యక్షుడు. కేవలం దేశ రక్షణకే కాకుండా మానవతా సహాయాలకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు సహాయం కొరకు భారత ప్రభుత్వం నేవీని వినియోగిస్తుంది. ఉమ్మడి వ్యాయామాలు, మానవతావాద మిషన్లు, విపత్తు ఉపశమనం మొదలైనవి వారి కర్తవ్యాలు. భారత దేశంలో క్రీ. పూ. 2300లో ప్రస్తుత గుజరాత్ లోని మంగ్రోల్ దగ్గర మొట్టమొదటి నౌకాతీరం నిర్మించ బడినది. క్రీ.పూ. 4వ శతాబ్దంలో మౌర్య సామ్రాజ్యంలో మొదటిసారి నౌకా విభాగాన్ని ఏర్పరిచారు. చంద్రగుప్త మౌర్యుడి ప్రధాన మంత్రి అయిన చాణక్యుడు తాను రచించిన అర్ధ శాస్త్రంలో నవాధ్యక్ష పేరుతో నదీ జలాల వినియోగం గురించి నిర్దేశించాడు. బ్రిటిషు ప్రభుత్వం భారత దేశాన్ని పాలిస్తున్నప్పుడు 1830లో రాయల్ ఇండియన్ నేవిని ఏర్పరిచారు. ఇది 1946 నాటికి 78 ఓడలు, 2000 మంది నిబ్బంది కలిగి ఉండేది. 26 జనవరి 1950 న భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చిన రోజున నౌకా దళానికి ఇండియన్ నేవిగా, వాహకాలకు ఇండియన్ నావల్ షిప్ గా పేరు పెట్టారు. 1961లో జరిగిన ఆపరేషన్ విజయ్ లో ఇండియన్ నేవి మొట్ట మొదటి సారి యుద్ధంలో పాల్గొన్నది. 1965లో జరిగిన భారత్ - పాక్ యుద్ధంలో నేవి ఎక్కువ పాల్గొనక పోయిన తీర ప్రాంతాల పరిరక్షణలో కీలకపాత్ర వహించింది. 1971లో జరిగిన భారత్ - పాక్ యుద్ధంలో నేవి విశిష్టమైన పాత్ర పోషించింది. ఈ యుద్ధంలో పాకిస్తాన్ దగ్గర ఉన్న అత్యంత ప్రమాదకరమైన పి ఎన్ ఎస్ ఘాజి జలాంతర్గామిని ధ్వసం చేసి సముద్రంలో ముంచి వేసిన ఘనత ఐ ఎన్ ఎస్ - రాజ్ పుత్ కు దక్కుతుంది. ఐ ఎన్ ఎస్ నిర్ఘాట్, ఐ ఎన్ ఎస్ నిపత్ లు కరాచీ పోరను చుట్టిముట్టి మిగిలిన పాకిస్తాన్ పోర్టులతో రాకపోకలను, పాక్ సైన్యానికి సహాయాన్ని అడ్డుకొని భారత దేశానికి విజయాన్ని అందించడంలో ముఖ్యపాత్ర వహించాయి. 2004లో దక్షిణ భారత దేశాన సునామి సంభవించి నపుడు కొద్ది గంటల్లోనే నేవి 27 నౌకలు, 19 హెలీకాప్టర్లు, 06 యుద్ధ విమానా నౌకలు, 5000 మంది సిబ్బందితో ముందుగా సహాయ చర్యలు చేపట్టింది. నేవి చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున సహాయ చర్యలు చేపట్టడం ఇదే ప్రథమం. ఆధునిక భారతీయ నౌకాదళం హిందూ మహాసముద్ర ప్రాంతంలో తన స్థానాన్ని మెరుగు పరిచేందుకు వేగవంతమైన పునర్నిర్మాణంలో భాగంగా ఉంది. ఈ నివేదిక ప్రకారం 58,000 మంది సిబ్బంది, విమాన వాహక నౌక, పెద్ద రవాణా ఓడ, 15 యుద్ధ నౌకలు, 8 గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్లు, 24 కొర్వెట్టెలు, 13 సంప్రదాయ జలాంతర్గాములు, 1 అణు దాడి జలాంతర్గామి, 30 పెట్రోల్ ఓడలు, వివిధ సహాయక నౌకలు మొదలైనవి భారత నావికా దళంలో భాగం. భారత నావికా దళంలో తూర్పు కమాండ్ - విశాఖపట్నం, పశ్చిమ కమాండ్ - ముంబాయి దక్షిణ కమాండ్ - కోచి, అండమాన్ నికోబార్ నావల్ - పోర్ట్ బ్లెయిర్ అనే 4 కమాండ్ లు ఉన్నాయి. 1985 నుండి అణు జలాంత ర్గాములను నిర్మించడానికి కల్పాక్కం వద్ద ఉన్న అణు కేంద్రంతో కలసి నేవి కృషి చేస్తోంది. 1987లో భారత నౌకా దళంలో జలాంతర్గాముల విభాగాన్ని ఏర్పాటు చేశారు. జలాంత ర్గాముల నుండి టర్పీడో అను క్షిపణులను ప్రయోగిస్తారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొట్ట మొదటి సబ్ మెరైన్ - ఐ ఎన్ ఎస్ షల్కి. 8 డిసెంబర్ 1967లో భారత నౌకా దళంలో ప్రవేశ పెట్టబడిన తొలి జలాంతర్గామి - ఐ ఎన్ ఎస్ కల్వరి. జలయుద్ధం చేయాల్సి వచ్చినప్పుడు, భారత నావికా దళానికి ఎంతగానో ఉపకరిస్తుందని భావిస్తున్న ఎలక్ట్రానిక్ టోర్పెడో 'వారుణాస్త్ర' స్వదేశీ పరిజ్ఞానంతో భారత్ అభివృద్ధి చేసిన జలాంతర్గామి విధ్వంసక టార్పెడో. భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థకు చెందిన నేవల్ సైన్స్ అండ్ టెక్నొలాజికల్ లేబొరేటరీ ఈ హెవీవెయిట్ టార్పెడోను అభివృద్ధి చేసింది. సముద్ర గర్భంలో... శత్రు దేశపు సబ్ మెరైన్ ధ్వంసం చేసే టార్పెడో ఇది. ఓడనుండి ప్రయోగించే రకపు వారుణాస్త్రను 2016 జూన్ 26న న భారత నౌకాదళంలో చేర్చుకున్నారు. యుద్ధ నౌక నుంచే ఈ హెవీ వెయిట్ టార్పెడోను సముద్రంలో దాగి ఉన్న శత్రు దేశపు జలాంతర్గామిపై ప్రయోగించవచ్చు. 95 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారైంది. ప్రపంచంలో జీపీఎస్ ఆధారంగా దూసుకుపోయే ఏకైక టార్పెడోగా వారుణాస్త్ర వినుతికెక్కింది. ఐ ఎన్ ఎస్ కల్వరి - 14 డిసెంబర్ 2017న, ఖండేరి సెప్టెంబర్ 2019న, కరంజ్ మార్చి 2021న, వేలా నవంబర్ 2021న, వాగిర్- నవంబర్ 2020లో ప్రారంభించ బడింది. 2023 జనవరి 23న వగీర్ జల ప్రవేశం చేయడంతో, భారత నౌకాదళంలో చేరి, భారతదేశం జలాంతర్గామి నిర్మాణ దేశంగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. వగీర్ అంటే ఇసుక సొరచేప. ఐఎన్ఎస్ వగీర్‌లో ప్రపంచంలోని అత్యుత్తమ సెన్సార్‌లు ఉన్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# చల్లదనం తో కూడిన చైతన్యం...ప్రపంచ శీతలీకరణ దినోత్సవ సందేశం - జూన్ 26...ప్రపంచ శీతలీకరణ దినోత్సవం




ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూన్ 26న ప్రపంచ శీతలీకరణ దినోత్సవంగా నిర్వహించ బడుతోంది. శీతలీకరణ, వాయు సమ శీతలీకరణ, తాప ఉత్పాదక పరికరాల తయారీ, నిర్వహణ వంటి రంగాల్లో పనిచేస్తున్న నిపుణుల సేవలను గుర్తించేందుకు, శీతలీకరణ రంగం ఆధునిక జీవితంలో కలిగించే ప్రాధాన్యతను ప్రజలకు తెలియ జేయాలనే లక్ష్యంతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవాన్ని శీతలీకరణ శాస్త్రానికి పునాదులు వేసిన శాస్త్రవేత్త లార్డ్ కెల్విన్ జన్మదినాన (జూన్ 26, 1824) నిర్వహించడం ప్రత్యేకత. నేటి జీవన విధానంలో శీతలీకరణ వ్యవస్థలు ఒక అవసరంగా మారాయి. ఇది కేవలం నివాస గదులను శీతలంగా ఉంచడానికే కాదు, ఆహార పదార్థాల నిల్వ, ఔషధ భద్రత, పారిశ్రామిక అవసరాలు, ఆసుపత్రుల నందు రోగ నిర్ధారణ పరికరాల సంరక్షణ, లబోరేటరీలలో నిగ్రహిత ఉష్ణోగ్రతల అవసరం వంటి అనేక రంగాల్లో కీలకంగా మారింది. ఆహార భద్రత విషయంలో శీతలీకరణ వ్యవస్థలు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. పండ్లు, కూరగాయలు, మాంసాహార పదార్థాలు, పాల ఉత్పత్తులు మొదలైనవి రైతు నుంచి వినియోగ దారుడికి చేరే వరకు తాజాగా ఉండేలా శీతలీకరణ పరికరాలు కాపాడు తున్నాయి. ఇలా ఉండకపోతే అవి త్వరగా పాడైపోతూ, ఆహార వ్యర్థం పెరిగేది. దీనివల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆహార భద్రతకు హానికరం కలిగేది. ఔషధ రంగంలోనూ శీతలీకరణ అవసరం మరింత కీలకం. వ్యాధి నిరోధక టీకాలు, సంజీవన మందులు, రక్త నిల్వలు తదితర ఔషధ పదార్థాలను నిర్దిష్ట తాపన స్థితిలో ఉంచకపోతే అవి నిష్ప్రభంగా మారుతాయి. ఇది ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, రూరల్ ఆరోగ్య కేంద్రాల్లో శీతలీకరణ వ్యవస్థల అభివృద్ధి ఎంతో అవసరం. వాతావరణ మార్పుల నేపథ్యంలో వేడిమి తీవ్రమవుతున్న ఈ కాలంలో వాయు సమశీతలీకరణ పరికరాలు ప్రజలకు ఉపశమనం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో బాధపడేవారికి ఈ పరికరాలు హీట్ స్ట్రోక్, వాపు వంటి సమస్యల నుంచి రక్షణగా నిలుస్తున్నాయి. పరిశ్రమల విషయానికొస్తే, శీతలీకరణ వ్యవస్థలు ఆవశ్యకతగా మారినవే. రసాయన తయారీ కేంద్రాలు, విద్యుదుత్పత్తి గిడ్డంగులు, గణాంక సమాచార నిల్వ కేంద్రములు, వనరుల నిల్వ కేంద్రాలలో తాపన నియంత్రణ శక్తి లేకపోతే ఉత్పత్తి నాణ్యత తగ్గిపోతుంది. దాంతోపాటు ఉద్యోగుల ఆరోగ్యం, పనితీరు కూడా దెబ్బతింటుంది. ఈ సంవత్సరం ప్రపంచ శీతలీకరణ దినోత్సవం 'ప్రతి ఒక్కరికీ సుస్థిర శీతలీకరణ' అనే అంశంపై దృష్టిపెడుతోంది. అంటే సమాజంలోని అన్ని వర్గాలకూ శీతలీకరణ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చేయాలన్న లక్ష్యం. ఇది నేడు అత్యంత అవసరమైన విషయముగా మారింది. ఎందుకంటే అధిక ఉష్ణోగ్రతల వల్ల కేవలం అసౌకర్యమే కాదు, అనేక అనారోగ్య సమస్యలు, మానవజాతికి ముప్పు వాటిల్లే ప్రమాదం కూడా ఉంది. ఇప్పటివరకు వినియోగించిన శీతలీకరణ పరికరాల్లో ఉపయోగించిన కొన్ని వాయువులు వాతావరణానికి హానికరంగా మారాయి. అవి ఓజోన్ పొరను భంగపరిచే విధంగా పనిచేయడం గ్రీన్ హౌస్ ప్రభావాన్ని తీవ్రతరం చేసింది. దీనిని అరికట్టేందుకు అంతర్జాతీయ ఒప్పందాలుగా మాంట్రియాల్ ఒప్పందం, కిగాలి సవరణ వంటి చర్యలు అమలులోకి వచ్చాయి. ఇప్పుడు పర్యావరణ హిత శీతలీకరణ పద్ధతులను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే విషయాన్ని ఈ దినోత్సవం గుర్తుచేస్తోంది. కొత్త ఆవిష్కరణల ద్వారా శీతలీకరణ రంగంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సూర్యశక్తితో పనిచేసే శీతలీకరణ పరికరాలు, తక్కువ విద్యుత్తుతో ఎక్కువ తాపనను తొలగించే పద్ధతులు, నిర్మాణ శైలిలోనే చల్లదనాన్ని పొందే వాస్తు రూపకల్పన వంటి మార్గాలు పర్యావరణానికి మేలు చేసే దిశగా ఉన్నత సాధనాలు. శీతలీకరణ రంగంలో పనిచేసే శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు సమాజానికి ఎంతో మేలు చేస్తున్నారు. వారి సేవలను గుర్తించడంతో పాటు, యువతను ఈ రంగంలోకి ఆకర్షించి శిక్షణనిచ్చే బాధ్యత ఈ దినోత్సవం మోస్తోంది. ప్రపంచ శీతలీకరణ దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ సరైన మార్గదర్శకత్వం అవసరం. శీతలీకరణ పరికరాలు పర్యావరణ హితంగా ఉండేలా చూసుకోవాలి. అవసరమైనంత మాత్రాన మాత్రమే వినియోగించాలి. పరికరాల్లో గాలి లీకేజీలు లేకుండా చూసుకోవాలి. విద్యుత్తు వినియోగం తక్కువగా ఉండే పరికరాలను ఎంచుకోవాలి. పునః చక్రణ యోగ్య పదార్థాలతో తయారైన పరికరాలను ప్రోత్సహించాలి. ఈ దినోత్సవం ద్వారా శీతలీకరణ కేవలం సౌకర్యం మాత్రమే కాక, భద్రత, ఆరోగ్యం, ఆహార భద్రత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశమని గుర్తించాలి. ఈ రంగానికి సముచిత గౌరవం, సరైన అవగాహన, మరింత సాంకేతిక పురోగతి, అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేయడమే ఈ దినోత్సవం యొక్క సారాంశం. చల్లదనంతో కూడిన సుస్థిర భవిష్యత్తు నిర్మాణానికి ఇది ఒక గొప్ప ప్రారంభం కావాలి. ఈ సందర్భంలో ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యా సంస్థలు, నిపుణులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. శీతలీకరణ రంగాన్ని పర్యావరణ అనుకూల దిశగా దారితీసేందుకు విధానాలను రూపొందించాలి. గ్రామీణ ప్రాంతాల్లోనూ శీతలీకరణ సౌకర్యాలను విస్తరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అవసరం. ఉదాహరణకు, పల్లెప్రాంతాల వైద్య కేంద్రాల్లో టీకా నిల్వ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేసేలా శీతలీకరణ వ్యవస్థలు ఏర్పాటుచేయాలి. అలాగే, విద్యా రంగంలోనూ శీతలీకరణ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రాథమికంగా బోధించాల్సిన అవసరం ఉంది. ఇది ఒక విజ్ఞాన శాస్త్ర శీఘ్రంగా అభివృద్ధి చెందుతున్న శాఖ. యువత ఈ రంగంలో శిక్షణ పొందితే, ఉద్యోగావకాశాలు మాత్రమే కాదు, సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశాలూ మెండుగా ఉంటాయి. ఈ దినోత్సవం ద్వారా ప్రజల్లో శీతలీకరణ పరికరాల వినియోగం పై బాధ్యతా భావం పెరగాలి. శక్తి వినియోగాన్ని తగ్గించే పరికరాలను ఎంపిక చేయడం, పాత పరికరాలను పర్యావరణ హితంగా విసర్జించడం వంటి మార్గాలను అవలంబించాలి. వీటితో పాటు నిర్మాణ రంగంలో తక్కువ శక్తి వినియోగించే శైలి ప్రోత్సహించాలి. ఉదాహరణకు, గాలి వాతావరణం అనుగుణంగా తాపనలో తగ్గుదల కలిగించే నిర్మాణ శిల్పాలు, ప్రాకృతిక కాంతి, గాలి ప్రవాహానికి అనుకూలంగా గదుల విన్యాసం వంటి మార్గాలను ప్రోత్సహించాలి. శీతలీకరణ రంగం పట్ల సమాజం కృతజ్ఞతతో కూడిన దృష్టిని ఏర్పరచుకోవాలి. ఈ రంగం మన ఆరోగ్యానికి, జీవన నాణ్యతకు, భవిష్యత్తు తరాల పర్యావరణానికి పునాది వంటిదిగా మారుతోంది. ప్రపంచ శీతలీకరణ దినోత్సవం ఈ విషయాలన్నింటిని మన ముందుకు తీసుకువచ్చే ప్రేరణాత్మక సందర్భం. ఈ దినోత్సవాన్ని నేడు నాటివరకు పరిమితం చేయకుండా, దీని ద్వారా వచ్చే సందేశాలను జీవనశైలిలో భాగంగా మలచుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానంతో, పర్యావరణ స్పృహతో, సామాజిక బాధ్యతతో కూడిన శీతలీకరణ వ్యవస్థలు మన చుట్టూ ఉండాలంటే మనం తీసుకోవాల్సిన చొరవలు ఎన్నో ఉన్నాయి. అవి ఒక్కొక్కటిగా నెరవేరితే, చల్లదనంతో కూడిన, ఆరోగ్యవంతమైన, సుస్థిరమైన భవిష్యత్తు మనదే **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# మారక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట అనివార్యం - జూన్ 26...అంతర్జాతీయ మారక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

ప్రపంచాన్ని మాదక ద్రవ్యాల ముక్తం చేయాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు సహకారాన్ని, చర్యలను బలోపేతం చేసేందుకు ప్రతి ఏడాది 26 జూన్‌న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ డిసెంబర్ 7, 1987న చేసిన తీర్మానం 42/112 ద్వారా ప్రతి సంవత్సరం జూన్ 26వ తేదీని అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవంగా జరపాలని నిర్ణయించింది. ఈ తీర్మానం 1987 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ డ్రగ్ అబ్యూస్ అండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ నివేదిక ఇతర అంశాల పై మరికొన్ని చర్యల కోసం సిఫార్సు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ది యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ (యూఎన్ఓడిసి) ఈ రోజున మత్తు పదార్థాల వల్ల ఏర్పడే సమస్యల పట్ల చైతన్యం కోసం అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. ప్రతి ఏటా జూన్26న ప్రపంచ వ్యాప్తంగా మాదక ద్రవ్యాలను స్వాధీన పర్చుకుని దేశ దేశాల్లో బహిరంగంగా వాటిని తగులబెట్టడం, బహిరంగ సభలు, ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యపర్చడం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడం వంటి చర్యలను పెద్ద ఎత్తున ఐరాస ప్రోత్సహిస్తోంది. మాదకద్రవ్యాలు మానసికస్థితిపై ప్రభావం చూపడమే కాకుండా శరీరంలోని అన్ని అవయవాలను అస్తవ్యస్తం చేస్తాయి. వాటికి బానిసలై ఒక్కసారిగా దూరమైన వారి ప్రవర్తన చాలా భిన్నంగా ఉంటుంది. వీటికి అలవాటు పడి ప్రాణాలు కోల్పోతున్న వారెందరో. ఇంతకుముందు ఇరవై అయిదేళ్ల వయస్సులో వ్యసనాలకు లోనైన వారు ఇప్పుడు పదహారేళ్లకే ఈ పదార్థాలను వాడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. మత్తు పదార్థాల వాడకం వల్ల మెదడులో కొన్ని రసాయనాలు విడుదలవుతాయి. వాటిని ఎండార్ఫిన్స్ అంటారు. 'మత్తు' ఉంటేనే ఎండార్ఫిన్స్ విడుదలవుతాయి. అవి దొరకని సమయంలో వారు నీరసంగా కనిపిస్తారు. కుటుంబ విలువలు విచ్ఛిన్నం కావడం, కుతూహలం, పిచ్చెక్కిస్తున్న పోటీ, భావోద్వేగ సమస్యలు, నిత్య జీవిత సమస్యల ఒత్తిడులు, చేతిలో డబ్బు బాగా ఆడడం యువకులలో, పెద్దలలో, వృత్తి నిపుణులలో మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతుండడానికి మరికొన్ని కారణాలు.




మహిళలు చాలా మంది కోక్‌కు అలవాటు పడిపోతున్నారు. దానిని ఒకసారి వాసన చూస్తే ఆకలి నశిస్తుంది. చాలా గంటల పాటు శక్తివంతంగా వుండేటట్లుగా చేస్తుంది. మహిళలు అనేక సమస్యల నుంచి తప్పించు కోవడానికి కూడా ఒక మార్గంగా మాదక ద్రవ్యాలను ఆశ్రయిస్తున్నారు. మాదక ద్రవ్యాల మీద ఆధారపడటం వల్ల జీవ రసాయనికంగా, మానసికంగా, సామాజికంగా దెబ్బతినడం, మందులలోని రసాయనిక పదార్థాలు నాడీ వ్యవస్థ మీద దాడి చేయడం, తీవ్రమైన ప్రవర్తనలు, కాలక్రమంలో ఆత్మీయులతో సంబంధాలు విచ్ఛిన్నం కావడం జరుగుతాయి. భారతదేశంలో కొకైన్‌పై వ్యసనపడుతున్న వారి సంఖ్య రానురానూ పెరుగుతోందని అధికారులు నిర్ధారిస్తున్నారు. UNODC వరల్డ్ డ్రగ్ రిపోర్ట్ ప్రకారం, 2020లో 275 మిలియన్ల మంది డ్రగ్స్ వాడారు. 36 మిలియన్ల మంది డ్రగ్స్ వినియోగ రుగ్మతలతో బాధపడుతున్నారు. డ్రగ్స్ ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నాయి మరియు భవిష్యత్తును దొంగిలిస్తున్నాయి, డ్రగ్స్ వాడకం మాత్రమే 2019లో దాదాపు అర మిలియన్ల మందిని చంపింది. గంజాయి చౌకగా దొరకడంతో చాలా మంది దీనికి బానిసలవుతున్నారు. మహారాష్ట్రకు చెందినవారే ఎక్కువగా ఈ పంట సాగుచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో అమాయక గిరిజనులకు మాయమాటలు చెప్పి వారి భూములను తక్కువధరకు కౌలుకు తీసుకుని అందులో నిషేధిత గంజాయి పండించి దొడ్డిదారిన రూ. లక్షలు గడిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రసాయనిక పరమైన మందులతో భారతదేశానికి వచ్చి గంజాయి లాంటి వాటిని తిరిగి తీసుకువెళ్లే విదేశీ పర్యాటకుల నుంచి వీటికి ఎక్కువ గిరాకీ లభిస్తోంది. 25 శాతం మంది శారీరక సమస్యలకు గురవుతారు. 42 శాతం ఒత్తిడికి, మానసిక సమస్యలతో బాధపడతారు. 25 శాతం మంది భార్యల నుండి విడాకులు కోరుతున్నారు. 40 శాతం నేరపూరిత ఆలోచనలతో గడుపుతున్నారు. యువత 45 శాతానికి పైగా సెక్స్ లో విఫలమవుతున్నారు. 24 శాతం మంది స్థూలకాయంలాంటి సమస్యలతో బాధపడుతుంటారు. మద్యం మత్తులోనే 90 శాతం నేరాలు. ఘోరాలు జరుగుతున్నాయి. మాదక ద్రవ్యాలు నల్ల బజారులో అందుబాటులో ఉంటున్నాయి. వివిధ ప్రాంతాలలో సంకేత నామాలతో చెలామణిలో ఉన్నాయి, నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, చరస్, గంజాయి, మారిజువానా, కొకైన్, ఎల్ఎస్‌డీ ఇందులో ముఖ్యమైనవి. వీటిని కొందరు అక్రమ వ్యాపారాలతో దొంగ రవాణాకు పాల్పడుతూ కోట్లాది రూపాయలను గడిస్తుంటే, యువత వానిని వినియోగిస్తూ చెడిపోతున్నారు. వీటికి అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువులు వదిలి సర్వస్వం కోల్పోయి నిర్భాగ్యులవుతున్నారు. ఒకసారి దీనికి బానిసలైన తర్వాత వీటిని సంపాదించడానికి ఎంతటి అకృత్యాలు, నేరాలు చేయడానికైనా వారు వెనుకాడరు. మాదక ద్రవ్యాల నిరోధానికి భారత ప్రభుత్వం నార్కోటిక్స్, డ్రగ్స్ అండ్ సైకోట్రాపిక్ సబ్స్టెన్సస్ చట్టాన్ని చేసింది. ఈ మత్తు మందులు పండించేవారు, వ్యాపారం చేసేవారు, కలిగివున్నవారు చట్టపరంగా కఠినంగా శిక్షార్హులు. మారక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేస్తూ, మాదక ద్రవ్యాలు తీసుకునే వారిని నేరస్థుల్లా చూడటం మానేసి, వారిని డీఅడిక్ట్ చేసేందుకు సహకారం అందించాల్సిన అవసరముంది. దీనికి తల్లి తండ్రులు, డాక్టర్లు, సమాజం, మీడియా కూడా సహకారం అందించాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# పంటల బీమా.. అమలైతేనే ధీమా

కాల్వశ్రీరాంపూర్: అన్నదాతలు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. అయితే ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికందే సమయంలో వడగళ్ల వానలు, గాలి దుమారాలు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. దీంతో జిల్లాలో ఏటా వేలాదిమంది అన్నదాతలు అప్పుల పాలవుతున్నారు. దీని నుంచి కాపాడేందుకు పంట బీమా పథకాన్ని పునరుద్ధరించనున్నట్లు ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించింది. ఈ సీజన్ నుంచే బీమా కల్పించాలన్నది రైతన్న ఆశ.

**ఏటా విపత్తుతో ఆందోళన**

భారాస హయాంలో పంట బీమా పథకం అమలుకాలేదు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం ఫసల్ బీమా యోజనతో పెద్దగా ప్రయోజనం ఉండదని పేర్కొంది. పంట నష్టపోయిన ప్రతిసారి ఇన్‌పుట్ సబ్సిడీ కింద మాత్రం పరిహారం అందించలేకపోయింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. నష్ట పరిహారం ఏటా భారంగా మారకుండా, బీమాను అమల్లోకి తీసుకురావడమే ప్రత్యామ్నాయమని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో పంట బీమా పథకాన్ని వర్తింపజేయనున్నట్లు గతేడాది అక్టోబర్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు.

**యాసంగిలో నష్టాలపాలు**

ఈ ఏడాది యాసంగిలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గాలి



దుమారాలకు వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. వడగళ్ల వానలకు ధాన్యం గింజలు రాలిపోయాయి. మామిడి రైతులు సైతం తీవ్రంగా నష్టపోయారు. సుమారు జిల్లాలో యాబై వేల ఎకరాల్లో నష్టం జరిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రభుత్వ సంస్థలతోనే న్యాయం..**

బ్యాంకులు పంట రుణాలు మంజూరుచేసే సమయంలోనే.. బీమా ప్రీమియంలోని రైతు వాటాను మినహాయించుకొనేవి. మిగతా మొత్తాన్ని నిబంధనల మేరకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు భరించేవి. అయితే సదరు ప్రైవేటు బీమా సంస్థలు లాభాపేక్షతో రైతు పరిహారం చెల్లించే పరిస్థితులు ఉండటం లేదని వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. పథకం నిర్వహణ బాధ్యతను ప్రభుత్వ రంగ బీమా సంస్థలకు అప్పగించి న్యాయం చేయాలని వారు స్పష్టం చేస్తున్నారు. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి స్పందిస్తూ.. పథకం అమలుపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే తగిన కార్యాచరణ చేపడతామని తెలిపారు. గ్రామాల వారీగా ఏ పంటకు ప్రాధాన్యం ఉందో ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

వానాకాలం సీజన్ వివరాలు

సాగుదారులు: 1.61 లక్షల మంది

విస్తీర్ణం: 2.76 లక్షల ఎకరాలు

ప్రధాన పంటలు: వరి, మొక్కజొన్న

# సౌర వెలుగులపై అస్పష్టత.. అన్నదాత కలత

కరీంనగర్ : పర్యావరణ పరిరక్షణ, రైతుల ఆదాయం పెంపు లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎం-కుసుమ్ (ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా ఏవం ఉత్థాన్ మహాభియాన్) పథకాన్ని తీసుకొచ్చింది. రైతులు, రైతు సంఘాలు, సహకార, మహిళా సంఘాలు సౌర విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడానికి ఈ పథకం అవకాశం కల్పిస్తోంది. యూనిట్ల ఏర్పాటుకు కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 465 దరఖాస్తులు రాగా, వీరిలో 131 మంది 170.9 మెగావాట్లకు మెగావాట్‌కు రూ.లక్ష చొప్పున ఈఎండీలు చెల్లించారు. గత నెల 10వ తేదీతో డిపాజిట్ గడువు ముగిసింది.

**ఫలించిన ఎదురుచూపులు**

పొలాల్లో సౌరవిద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు ఈఎండీలు చెల్లించిన రైతుల ఎదురుచూపులు ఎట్టకేలకు ఫలించాయి. యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి మార్గదర్శకాలు వెలువడ్డాయి. కొత్త డబ్బు డిపాజిట్ (ఈఎండీ) చెల్లించిన అన్నదాతలతో విద్యుత్తు సంస్థలు విద్యుత్తు విక్రయ ఒప్పందం జరుగుతోంది.

**తీరని అయోమయం**

ప్రాజెక్ట్ ఖర్చు పెరిగిందని, రుణాల విషయంలో బ్యాంకులు ఆసక్తి చూపడంలేదని రైతులు కలత చెందుతున్నారు. వర్షాలు బాగా కురిసే అవకాశం ఉండటంతో వ్యవసాయ పనులు ప్రారంభించాలా.. లేక ప్లాంట్లు ఏర్పాటు చేయాలా? అనే సందిగ్ధంలో పడ్డారు. డిసెంబరు



15 వరకు ప్లాంట్లు ఏర్పాటు చేయాలని అధికారులు చెబుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**రుణాల సంగతి ఏమిటి?**

ఒక్క మెగావాట్ విద్యుదుత్పత్తి సామర్థ్యం గల సౌర ప్లాంట్‌కు నాలుగు ఎకరాల భూమి, రూ.3.50 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. దీనిలో బ్యాంకులు 70 శాతం రుణంగా ఇవ్వనుండగా, 30 శాతం లబ్ధిదారు వాటాగా చెల్లించాల్సి ఉంటుందని సమాచారం. ఈ విషయంలో స్పష్టత రాలేదు. మొదట్లో బ్యాంకులు 90 శాతం రుణాలు ఇస్తాయని, లబ్ధిదారుడు కేవలం 10 శాతం చెల్లిస్తే సరిపోతుందని అధికారులు చెప్పినట్లు పలువురు తెలిపారు.

ఒప్పందాలు జరుగుతున్నాయి- అజయ్, మేనేజర్, రెడ్కో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 131 దరఖాస్తులకు సంబంధించి 170.9 మెగావాట్లకు ఈఎండీలు చెల్లించారు. వీటికి సంబంధించి ప్రస్తుతం విద్యుత్తు విక్రయ ఒప్పందాలు జరుగుతున్నాయి. ఆ తర్వాత ప్లాంట్ పనులు ప్రారంభించే వీలుంటుంది. రుణాల విషయం బ్యాంకులు చూసుకుంటాయి. ఎంతమంది ఒప్పందం చేసుకున్నారో వివరాలు లేవు.

# ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాల సందడి



హైదరాబాద్ : ప్రభుత్వ ఇంటర్ కళాశాలలు కొత్త విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 41 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా ప్రవేశానికి వందల సంఖ్యలో విద్యార్థులు వస్తున్నారు. కొన్ని కళాశాలల్లో ఖాళీలు లేవని ప్రిన్సిపాళు చెబుతున్నా... ప్రజాప్రతినిధులు, అధికారుల సిఫార్సు లేఖలు తీసుకొస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, జిల్లాల్లోని ప్రభుత్వ కళాశాలల్లో గతేడాదితో పోలిస్తే ప్రవేశాల సంఖ్య భారీగా పెరిగింది. హైదరాబాద్ జిల్లాలో 22 ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో గతేడాది 7వేల మందికి పైగా విద్యార్థులు చేరగా.. ఈ ఏడాది జూన్ మొదటివారంలోనే 6వేల మందికి పైగా దరఖాస్తులు సమర్పించారు. మూడేళ్ల నుంచి ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని హైదరాబాద్ జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈవో) దాసరి ఒడ్డెన్న తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటం, ప్రయోగశాలలు ఏర్పాటు చేయడం విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు దోహదం చేస్తోందన్నారు.

**భారం భరించలేక... :** ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదివించాలంటే ఏటా రూ.లక్ష నుంచి రూ.1.6లక్షలు ఖర్చు కావటం పేద, మధ్యతరగతి వారికి భారమవుతోంది. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరాలంటే గ్రేడ్‌ల వారీగా రూ.1.2లక్షల నుంచి రూ.1.6లక్షల ఫీజు చెల్లించాలి. స్టడీ మెటీరియల్‌కు మరో రూ.15వేలు ఇవ్వాలి. రెసిడెన్షియల్ పద్ధతిలో చదివితే... రూ.2.4లక్షల నుంచి రూ.2.6లక్షల వరకు కట్టాలి. హైదరాబాద్‌లో కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు సుమారు 300 ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో జీపీఏ 10 పాయింట్లు సాధించిన వారిలో చాలామంది ప్రైవేటులో చేరుతున్నారు. రెండేళ్ల నుంచి వారూ ప్రభుత్వ కళాశాలల వైపు మొగ్గుచూపుతున్నారు.

**సదుపాయాల కల్పన.. :** ప్రభుత్వ కళాశాలల్లో చదివేందుకు విద్యార్థులు ముందుకు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం మెరుగైన విద్యా బోధనపై దృష్టి సారిస్తోంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని జూనియర్ కళాశాలల్లో ఇటీవల అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేసింది. సమస్యలను ఇంటర్ బోర్డు అధికారులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల దృష్టికి తీసుకెళ్లటంతో కొన్నింటిని పరిష్కరించారు. త్వరలో కళాశాలల్లో అవసరమైన సదుపాయాలు కల్పనకు సీఎం హామీ ఇచ్చారు.

# ఏఐ.. విద్యార్థినులు సై



హైదరాబాద్ : ఇంజినీరింగ్‌ను ఎంచుకుంటున్న విద్యార్థినుల్లో ఎక్కువమంది కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ (ఎంఎల్) సబ్జెకులపైనే మొగ్గుచూపుతున్నారు. గతంలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, సివిల్ బ్రాంచుల్లో చేరేందుకు ఆసక్తి ప్రదర్శించిన వీరు.. క్రమంగా ఏఐ, ఎంఎల్‌పై దృష్టి పెడుతున్నారు. జూన్ 23న అంతర్జాతీయ మహిళా ఇంజినీరింగ్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న ఎడ్‌టెక్ కంపెనీ బైటెక్సెల్ నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. దేశవ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాల్లోని పన్నెండు ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో సర్వే చేశారు. 35 విద్యాసంస్థల్లో 38వేల మంది విద్యార్థుల అభిప్రాయాలను బైటెక్సెల్ ప్రతినిధులు సేకరించారు. కృత్రిమ మేధ, మిషన్ లాంగ్వేజ్‌లను ప్రధాన సబ్జెక్టులుగా వ్యవహరిస్తున్న ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్‌ఐటీలకు భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం లభించనుందని విద్యార్థినులు వివరించారు.

**వెల్లడైన అంశాలు..**

బైటెక్సెల్ సంస్థ ప్రతినిధులు హైదరాబాద్, విజయవాడ, ఒంగోలు, తిరుపతి, జలంధర్, డెహ్రాడున్, చండీగఢ్, వడోదర, నాగ్‌పూర్, పుణె, మధుర, కోయంబత్తూరులలో పర్యటించారు. వృత్తిపరంగా ఎదిగేందుకు, నైపుణ్యం పెంచుకునేందుకు ఏఐ/ఎంఎల్‌లకు ప్రాధాన్యం ఇస్తున్నామని 49శాతం మంది విద్యార్థినులు తెలిపారు. నైపుణ్యాలున్న వారికే వేగంగా ఉద్యోగాలు లభిస్తున్నాయని, సృజనాత్మకత ఉన్నవారు అంకుర సంస్థలు ప్రారంభిస్తున్నారని అందుకే... కృత్రిమమేధ, చాట్‌జీపీటీ, మిషన్ లెర్నింగ్‌లను నేర్చుకోవడంతో పాటు అత్యుత్తమ నైపుణ్యాలు సాధించాలని వివరించారు.

కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ సబ్జెక్టులు భవిష్యత్తులో పరిశ్రమల రంగానికి ఉపయోగపడనున్నాయని, సృజనాత్మకతకు, విజ్ఞాన పరివర్తనకు ప్రయోజనకరంగా ఉంటుందని వడోదరలోని ఓ ప్రైవేటు వర్సిటీ విద్యార్థినులు తమ మనోగతాన్ని పంచుకున్నారు.

ప్రథమశ్రేణి నగరాలు, పట్టణాల్లో ఇంజినీరింగ్ విద్యార్థినుల్లో 37.9శాతం మంది ఏఐ/ఎంఎల్‌ను ఎంచుకోగా.. హైదరాబాద్, పుణె, నగరాల్లో ఇంజినీరింగ్ అమ్మాయిల్లో 53.9శాతం కృత్రిమ మేధపై మొగ్గు చూపారు. ఇంజినీరింగ్ విద్యలో వస్తున్న మార్పులు, విద్యాసం స్థలు, పరిశ్రమలకు అనుసంధానంగా ప్రభుత్వాలు చేపడుతున్న చర్యల ప్రభావం విద్యార్థినులపై ఏ మేరకు ఉందని తెలుసుకునేందుకు ఈ సర్వే నిర్వహించామని బైటెక్సెల్ సీఈవో కరుణ్ తాడేపల్లి తెలిపారు.

# నిర్లక్ష్యం అధికారులది.. ఇక్కట్లు సామాన్యులవి



కోరుట్ల: కల్లూర్‌రోడ్‌లోని భవనంపైనున్న 33 కేవీ విద్యుత్తు తీగలు తగిలి జనవరి 15, 2024న ఇద్దరు ఇద్దరు బాలురు తీవ్రగాయాలపాలయ్యారు. ఓ భవనంపై గాలి పటాలు ఎగురవేస్తుండగా పక్క భవనంపై గాలిపటం పడటంతో దానిని తెచ్చుకునేందుకు అక్కడికి వెళ్లారు. దానిపైనున్న 33 కేవీ విద్యుత్తు తీగలను గమనించక విద్యుదాఘాతానికి గురయ్యారు. అప్పటి నుంచి భవనం ఎక్కేందుకు యజమానులు జంకుతున్నారు. ప్రకాశంరోడ్‌లోని ఓ భవనాన్ని ఆనుకొని 33 కేవీ ప్రధాన తీగలున్నాయి. రెండేళ్ల కిందట భవనంపై ఆడుకునేందుకు ఎక్కిన ఓ బాలికకు విద్యుత్తు తీగలు తగలడంతో తీవ్రంగా గాయపడింది. తర్వాత విద్యుత్తు తీగలు తగలకుండా ఉండేందుకు భవనంపై ప్రత్యేక కంచెను ఏర్పాటు చేసుకొని బిక్కుబిక్కుమని జీవనం సాగిస్తున్నారు..

కోరుట్ల పట్టణంలో ఇళ్లపైనుంచి ఉన్న 33 కేవీ విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వెళ్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారు.. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్తుశాఖ, పురపాలక సంఘం అధికారులు చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోరుట్ల శివారులోని వ్యవసాయక్షేత్రాల నుంచి సుమారు 60 ఏళ్ల కిందట 33 కేవీ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేశారు. ఈలైను పెద్దగుండు వద్దనున్న 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి కల్లూర్‌రోడ్‌లో ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ వరకు సుమారు 4 కి.మీల పొడవున ఉంది. కల్లూర్‌రోడ్, ఝాన్సీరోడ్, ప్రకాశంరోడ్, అయిలాపూర్‌రోడ్‌ల మీదుగా 33 కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయి. గతంలో వ్యవసాయ భూములుండగా పట్టణం విస్తరించి నివాస ప్రాంతాలుగా మారాయి. ప్రజలు ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. సుమారు రెండేళ్ల కిందట 33 కేవీ విద్యుత్తు లైన్‌ను మార్చేందుకు అప్పటి విద్యుత్తుశాఖ అధికారులు సర్వేలు చేపట్టారు. లైన్ పైభాగంలో రైల్వేస్టేషన్ భూములు ఉండటంతో అందులో వేయడం కుదరదని విడిచి పెట్టారు. గతేడాది కల్లూర్‌రోడ్‌లో ప్రమాదం జరిగినచోట్ల నూతన స్తంభాలను ఏర్పాటు చేసి కొంతమేర విద్యుత్తు తీగలను ఇళ్ల మీది నుంచి తొలగించి వేరేచోట ఏర్పాటు చేసేందుకు రూ.58 లక్షలతో విద్యుత్తుశాఖ అధికారులు అంచనాలు తయారు చేసి మున్సిపల్ అధికారులకు నివేదించారు. మున్సిపల్ అధికారులు నిధులు చెల్లిస్తే వెంటనే నూతన లైన్ ఏర్పాటు చేస్తుండేవారు. బల్దియా అధికారులు ఏడాది గడిచినా నిధులు చెల్లించకపోవడంతో అది అటుకెక్కింది.

నిబంధనల ప్రకారం 33 కేవీ విద్యుత్తు ప్రధాన తీగల కింద ఎలాంటి ఇళ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టకూడదు. అనుమతి లేని ఇళ్లకు మున్సిపల్ నుంచి ఇంటి నంబర్లు కేటాయించి ఏటా పన్నులు వసూలు చేస్తున్నారు. విద్యుత్తుశాఖ అధికారులు మీటర్లను ఏర్పాటు చేశారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు మేల్కోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఈవిషయమై ఏఈ రఘుపతిని వివరణ కోరగా కల్లూర్‌రోడ్‌లో 33 కేవీ విద్యుత్తు తీగలను మార్చేందుకు మున్సిపల్‌కు రూ.58 లక్షల డిమాండ్ నోటీసును జారీ చేశామన్నారు. డబ్బులు చెల్లిస్తే వెంటనే పనులు చేస్తామన్నారు.

# భువన్ సర్వే సక్రమంగా సాగేనా?

ఆదిలాబాద్ : బల్దియాలో నివాస, వ్యాపార, వాణిజ్య భవన సముదాయాల ఆస్తి పన్ను మదింపు చేసేందుకు భువన్ సర్వే ప్రారంభమైంది. రెండో విడత భువన్ సర్వేలో మ్యాపింగ్ చేయకుండా మిగిలిపోయిన ఆస్తులకు తాజాగా రెవెన్యూ సిబ్బంది కొలతలు తీసే పనిలో పడ్డారు. రెండో విడత భువన్ సర్వే 2020లో ప్రారంభమైంది. అప్పటికి 40 వేలకు పైగా ఆస్తులు ఉండగా కరోనా వ్యాప్తి, లాక్‌డౌన్ కారణంగా 30 వేల అసెస్‌మెంట్లను మాత్రమే సర్వే చేశారు. మిగిలిన ఆస్తులను సర్వే చేయలేదు. తాజాగా మిగిలిన ఆస్తులను, కొత్తగా నమోదైన 18వేల అసెస్‌మెంట్లను సర్వే చేసి వివరాలను నమోదు చేయనున్నారు. బల్దియాలో అన్ని రకాల ఆస్తులకు సంబంధించి 48 వేలకు పైగా అసెస్‌మెంట్లు ఉండగా రూ.14కోట్ల ఆస్తి పన్ను డిమాండ్ ఉంది. గతంలో ఇంటి విస్తీర్ణానికి సంబంధించిన కొలతలు, అంతస్తులను సరిగా నమోదు చేయక ఆస్తి పన్ను తక్కువగా వస్తోంది. దీంతో బల్దియాలో ప్రస్తుతం 18 వేల ఆస్తులు సర్వే చేయాల్సి ఉంది. 15 మంది రెవెన్యూ సిబ్బందికి శిక్షణ ఇచ్చి, ట్యాబ్‌లను అందజేసి సర్వే చేయిస్తున్నారు. తాజా సర్వేతో ఆస్తి పన్ను డిమాండ్ మరింత పెరిగే అవకాశముంది.

**తప్పుల తడకగా..**

రాష్ట్ర ప్రభుత్వం పురపాలికల్లో ఆస్తుల లెక్కను తేల్చేందుకు 2017లో తొలివిడత భువన్ సర్వే నిర్వహించింది. రెండో విడత 2020లో



చేపట్టింది. నివాస, వ్యాపార, వాణిజ్య భవన సముదాయాల కొలతలు తీసుకుని, ట్యాబ్‌లో చిత్రాలను తీసి జియోట్యాగింగ్ చేశారు. రెండో విడతలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇళ్లు లేకున్నా ఉన్నట్లుగా ఖాళీ ప్లాట్లకు ఇంటి నెంబర్లు వేసి భువన్ సర్వేలో నమోదు చేశారు. వాస్తవానికి ఖాళీ ప్లాట్లకు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ విధించాలి. ఇంటి నెంబర్లు ఉన్న ఆస్తులనే భువన్ సర్వేలో నమోదు చేయాలి. అప్పట్లో కొంతమంది సిబ్బంది చేతివాటం ప్రదర్శించి ఇష్టానుసారంగా సర్వేలో నమోదు చేశారు. కేఆర్కే కాలనీ, బంగారుగూడ, జీఎస్ ఎస్టేట్ కాలనీ, ఖానాపూర్, అంబేద్కర్‌నగర్, 170 కాలనీల్లో ఇప్పటికీ ఆ వివరాలు ఆస్తి పన్నుల జాబితాలోనే కొనసాగుతున్నాయి. ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు ఇవ్వడంతో అక్రమార్కులు లింకు డాక్యుమెంట్లు పొంది రిజిస్ట్రేషన్లు చేసుకుని క్రయవిక్రయాలు సాగించారు.

**సీడీఎంఏకు లేఖ రాస్తాం**

కల్యాణ్, ఆర్ఓ, బల్దియా

బల్దియాలో రెండో విడత చేసిన సర్వేలో మిగిలిపోయిన 18వేల ఆస్తులకు సిబ్బంది భువన్ సర్వే చేస్తున్నారు. ఆస్తుల కొలతలు పక్కాగా నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో లేని ఇళ్లకు జియోట్యాగింగ్ చేసిన అసెస్‌మెంట్ల వివరాలను సేకరించి బల్దియా కమిషనర్ ద్వారా సీడీఎంఏకు లేఖ రాస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

# అందరి దృష్టి రిజర్వేషన్లపైనే..

ఆదిలాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయనే ప్రచారం జరుగుతుండటంతో ఆశావహుల్లో ఉత్కంఠ మొదలైంది. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు ఉండటంతో పాతస్థానంలో కొత్త రిజర్వేషన్ రానుంది. ఏమొస్తుందనేది నేతల్లో ఆసక్తి నెలకొంది. జడ్పీ ఛైర్మన్ పదవి నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచి అన్ని స్థానాల్లో ఈ రొటేషన్ పద్ధతి అమలు కానుండటంతో అందరి దృష్టి రిజర్వేషన్లపైనే నెలకొంది.

గ్రామపంచాయతీ, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తులకు గత ప్రభుత్వం రెండు దఫాలకు వర్తించేలా పంచాయతీరాజ్ చట్టం(2018) తీసుకొచ్చింది. పదేళ్లపాటు అదే రిజర్వేషన్ ఉంటుందని భావించినా డిసెంబరులో నిర్వహించిన శాసనసభ సమావేశాల్లో పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు-2024కు ఆమోదం లభించడంతో ఒకే దఫా మాత్రమే రిజర్వేషన్ వర్తిస్తుంది. తద్వారా ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ మారనుండటంతో పోటీకి ఆసక్తి ఉన్న వారిలో కొత్త రిజర్వేషన్‌పై ఉత్కంఠనెలకొంది. రిజర్వేషన్ల కేటాయింపుల్లో తొలుత ఎస్టీలకు రిజర్వు స్థానాలు కేటాయిస్తారు. ఎస్టీ తరువాత ఆ స్థానం రొటేషన్ పద్ధతిలో ఎస్సీ, అనంతరం బీసీకి రిజర్వు చేస్తారు. ఒకవేళ ఎస్సీ స్థానాలు ఇతరచోట సర్దుబాటు జరిగితే ఆ స్థానం రొటేషన్ పద్ధతిలో బీసీలకు కేటాయిస్తారు. ఆదిలాబాద్ జిల్లా పరిషత్ పదవి ఎస్టీకి రిజర్వు అయి పదవీకాలం ముగియడంతో మళ్లీ ఎస్టీకి కేటాయించే అవకాశం లేదు. జడ్పీ స్థానాల్లోనూ ఇదివరకు ఉన్న రిజర్వేషన్లు మారనున్నాయి. ఎంపీటీసీ, సర్పంచి పదవుల్లోనూ ఇదే పద్ధతిని అనుసరించనున్నారు.

ఏజెన్సీ మండలాలైన ఇంద్రవెల్లి, ఉట్నూరు, నార్నూరు, గాదిగూడల్లో



ఎంపీపీలు, సగం ఎంపీటీసీలు, 473 పంచాయతీల్లోని 251 నోటిఫైడ్(ఏజెన్సీ) గ్రామపంచాయతీల్లో సర్పంచి పదవులు మాత్రం ఎస్టీలకే రిజర్వు అయి ఉంటాయి. మహిళా రిజర్వు ఉంటే అది ఎస్టీ జనరల్ కిందకు మారుతుంది. ఇంతకుముందు 17 మండలాల్లో జడ్పీటీసీలకు 8 స్థానాలు రిజర్వేషన్ కింద కేటాయించారు. ఆ 8 రిజర్వేషన్ స్థానాలను జనరల్ కింద ఉన్న మిగతా 9 జడ్పీటీసీ స్థానాల్లో సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఒకటి తిరిగి జనరల్‌గా మిగిలే అవకాశం ఉందని తెలుస్తోంది. కొత్తగా భోరజ్, సాత్నాల, సొనాల మూడు మండలాలు ఏర్పడడంతో అక్కడ మాత్రం జడ్పీటీసీకి కొత్తగా రిజర్వేషన్ స్థానాల సంఖ్య రానుంది. ప్రస్తుతం జిల్లా 20 మండలాలుగా ముఖచిత్రం మారడంతో సగం రిజర్వేషన్ లెక్కన 10 స్థానాలు రిజర్వుచేయాలి. ఈ మేరకు 8 నుంచి 10కి రావాలంటే మరో రెండు జడ్పీటీసీ రిజర్వేషన్‌లు పెరగనున్నాయి. కొత్తగా ఏర్పడిన మూడు మండలాలకు ఈ రెండు రిజర్వేషన్లు వస్తాయని తెలుస్తోంది. మొత్తానికి 10 రిజర్వేషన్, మరో 10 జనరల్ కింద కేటాయిస్తారు.

**మూడు మండలాల్లో ఎంపీటీసీలకు** కొత్తగా ఏర్పడిన మూడు మండలాల్లోని ఎంపీటీసీ స్థానాలకు మాత్రం కొత్త రిజర్వేషన్ అమలు చేయనున్నారు. ఎంపీపీ కొత్త రిజర్వేషన్ రానుంది. కొత్తగా ఏర్పడిన పంచాయతీలు పూనగూడ, ఎల్లమ్మగూడ, ఏసాపూర్, అత్నంగూడ, వడెగల్‌పూర్‌లకు ఇదే పద్ధతిలో కొత్త రిజర్వేషన్ అమలు చేయనున్నారు.

# తప్పులు సరిదిద్ది.. హద్దులు సవరించి

హైదరాబాద్ : నగరంలో పోలింగ్ కేంద్రాల హద్దులను చక్కదిద్దేందుకు జీహెచ్ఎంసీ రంగంలోకి దిగింది. ఎన్నికల విభాగం డివిజన్ల వారీగా డిజిటల్ సర్వే చేపట్టింది. ఒక ఇంటి ఓటర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయాల్సిన పరిస్థితులు, నివాసం ఓ చోట.. పోలింగ్ కేంద్రం మరోచోట ఉన్న కాలనీలను గుర్తించి పోలింగ్ కేంద్రాల హద్దులతో డిజిటల్ పటాలను రూపొందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. త్వరలోనే ప్రక్రియ పూర్తవనుందని అధికారులు చెబుతున్నారు.

**జనగణన నేపథ్యంలో..:** హైదరాబాద్ జిల్లాలో 46 లక్షల మంది ఓటర్లుండగా.. అసెంబ్లీ నియోజకవర్గాలు 15, జీహెచ్ఎంసీ డివిజన్లు 84 ఉన్నాయి. ఆయా స్థానాలకు సుమారు నాలుగు వేల పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికలు జరుగుతుంటాయి. ఇటీవల కేంద్రం జనాభా లెక్కల సర్వేను త్వరలో ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడంతో.. జిల్లాకు సంబంధించిన ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల హద్దులు సరిగా లేవంటూ భాజపా, ఎంఐఎం పార్టీలు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాయి. జనగణన పూర్తయితే నియోజకవర్గాలు పెరుగుతాయని, డివిజన్ల వారీగా పోలింగ్ కేంద్రాల



హద్దులను చక్కదిద్దాలని డిమాండ్ చేశాయి. నగరీ నక్షాలో(నగర పటం) ఉన్న తప్పులను సవరించాలని కోరడంతో.. జీహెచ్ఎంసీ ఎన్నికల విభాగం ఇటీవల సర్కిళ్ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసింది. డివిజన్ల ఓటరు జాబితాను పరిశీలించాలని, ఇంటి నంబర్లు, చిరునామా ఆధారంగా ఓటర్లను సంబంధిత పోలింగ్ కేంద్రాల పరిధిలో చేర్చాలని సూచించారు. వివరాలు సరిగా లేకపోతే జాబితా రూపొందించుకొని ఇంటింటి తనిఖీ చేయాలన్నారు. నకిలీ ఓటరు అయితే కార్డును రద్దు చేయడం, ఓటరు ఆ ఇంట్లో నివాసం ఉంటున్నట్లయితే సంబంధిత పోలింగ్ కేంద్రానికి మార్చాలని కేంద్ర కార్యాలయం సిబ్బందికి మార్గదర్శనం చేసింది. డివిజన్ల వారీగా పోలింగ్ కేంద్రాల డిజిటల్ పటాలను పక్కాగా రూపొందిస్తే.. జనాభా లెక్కలు పూర్తయ్యాక జరిగే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను సులువుగా చేపట్టవచ్చని సూచించారు.

## కాలుష్య కాసారంలా హుస్సేన్‌సాగర్

హైదరాబాద్: హుస్సేన్‌సాగర్‌లో కాలుష్య ఉద్గారాల స్థాయి నానాటికీ పెరుగుతోంది. నిత్యం సుమారు 450 ఎంఎల్‌డీలకు పైగా వ్యర్థజలాలు నేరుగా కలుస్తుండటంతో నీటిలో కరిగిన ఆక్సిజన్ పరిమాణం తగ్గుతోంది. డిజాల్వ్‌డ్ ఆక్సిజన్ (డీవో) పరిమాణం 4 మిల్లీగ్రాముల కంటే ఎక్కువగా ఉండాలని, బీవోడీ (బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్) 3 మిల్లీగ్రాములకు మించరాదంటూ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సూచిస్తుండగా అనేక చోట్ల పరిమితులకు మించి నమోదవుతోంది. తాజాగా జలాశయాల్లో నీటి నాణ్యత నివేదికను కాలుష్య నియంత్రణ మండలి విడుదల చేసింది. లీటర్ నీటిలో డీవో 0.3 మిల్లీగ్రాములు, బీవోడి 10 మిల్లీగ్రాములుగా ఉందని నివేదిక స్పష్టం చేసింది. జీహెచ్ఎంసీ కార్యాలయం అవుట్‌లెట్, మారియట్ హోటల్



అవుట్‌లెట్, ఖైరతాబాద్ ఎస్టీపీ జాయినింగ్ అవుట్‌లెట్, సంజీవయ్య పార్కు, బుద్ధ విగ్రహం, నెక్లెస్‌రోడ్, ఎన్టీఆర్ గార్డెన్, లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్స్, హుస్సేన్‌సాగర్ సెయిలింగ్ క్లబ్ వద్ద పీసీబీ శాంపిళ్లను సేకరిస్తోంది. ల్యాబ్‌కు పంపిన అనంతరం ఫలితాలను వెల్లడిస్తోంది. నదుల్లో లీటరు నీటిలో బీవోడీ 0 నుంచి 5 ఎంజీ ఉండాలి. కాలుష్యమయమైన జలాశయాల్లో 5 నుంచి 60 ఎంజీ వరకు ఉంటుందని సీపీసీబీ పేర్కొంది. శాంపిళ్లు సేకరించినప్పుడల్లా ఖైరతాబాద్ ఎస్టీపీ వద్ద 86, సంజీవయ్య పార్కు వద్ద సగటున 92గా నమోదవుతోంది. సీవోడీ 60 నుంచి 120 ఎంజీ వరకు ఉండాలి. ఏడు ప్రాంతాల్లో పరిమితికి మించి నమోదవుతోంది.

## ముక్కుపుటాలదురుతున్నాయ్

హైదరాబాద్: మెట్రోరైలు స్టేషన్ల పరిసరాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం దుర్గంధం రాని, నీరు అవసరం లేని మూత్రశాలలు ఏర్పాటు చేశారు. ప్రైవేటు సంస్థతో కలిసి హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ పలుచోట్ల వీటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. నిర్వహణ కొరవడి పరిసరాలు అపరిశుభ్రంగా మారటంతో కొన్నిచోట్ల మూత్రశాలలను వాడలేని పరిస్థితి ఏర్పడింది.

**ఏడేళ్ల క్రితం ప్రయత్నం..** నీరు లేక ప్రజా మరుగుదొడ్లు దుర్గంధభరితంగా మారుతుండటం తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఈ పరిస్థితిని మార్చేందుకు హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ ఏడేళ్ల క్రితం వినూత్న ప్రయత్నం చేసింది. ఒక అంకుర సంస్థతో కలిసి నీటితో పనిలేకుండా, దుర్వాసన రాకుండా పర్యావరణహితమైన మూత్రశాలలు ప్రారంభించింది. మియాపూర్, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ, అమీర్‌పేట, రసూల్‌పురా వంటి స్టేషన్ల పాదబాటల్లో ఏర్పాటు చేసింది. తర్వాత ఇతర స్టేషన్ల పరిసరాల్లోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏకకాలంలో ముగ్గురు వినియోగించుకునేలా వీటిని డిజైన్ చేశారు.

**నీటిని వేరు చేసి..** మూత్రశాలల ప్రధాన సమస్య దుర్వాసన.. దీనికి కారణమయ్యే అమ్మోనియా, యూరియాను బయోఫిల్టరైజేషన్ ప్రక్రియ ద్వారా విచ్ఛిన్నం చేసేలా వీటిని రూపొందించారు. మూత్రం నుంచి వేరుచేసిన నీటిని ప్రత్యేకమైన ట్యాంకులోకి సేకరించి అక్కడే ఉన్న మొక్కలకు వాడటం లేదా భూమిలోకి ఇంకించేవారు. మూత్రాన్ని వాయురహిత డైజెస్టరులోకి సేకరించి., అక్కడ సూక్ష్మజీవులు మూత్రాన్ని క్షీణింపచేసేలా సాంకేతికతను వినియోగించారు.

# భద్రత.. భరోసా.. భవిత



హైదరాబాద్ : పద్నాలుగేళ్ల ప్రాయంలోనే ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు, చిన్నతనంలోనే ఫోన్ల వినియోగం.. లైంగిక వేధింపులు.. పెరుగుతున్న సైబర్ నేరాలు, మరోవైపు డ్రగ్స్.. ఇలా పాఠశాల విద్యార్థులు అనేక రుగ్మతలు, ముప్పును ఎదుర్కొంటున్నారు. వీటి నుంచి బయటపడేసి.. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడానికి సైబరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. పాఠశాలల్లో ఇప్పటికే ఉన్న సేఫ్టీ క్లబ్‌లను గాడిన పెట్టాలని భావిస్తున్నారు. ప్రధానంగా లైంగిక వేధింపులు, మానసిక ఒత్తిడి, రహదారి భద్రత, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు దరి చేరకుండా చర్యలు చేపట్టనున్నారు. ఇప్పటికే తరగతులు ప్రారంభమైన దృష్ట్యా పాఠశాలల వారీగా కొత్తగా క్లబ్‌లు ఏర్పాటయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. విద్యార్థులు, బడి యాజమాన్యం, తల్లిదండ్రులు, పోలీసులు, తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఇలా అన్ని విభాగాల సమన్వయంతో ఈ క్లబ్‌లు చురుకైన పాత్ర పోషించేలా చర్యలు తీసుకోనున్నారు.

**ఏం చేస్తాయంటే..?:** ప్రధానంగా ఈ కింది నాలుగు అంశాలపై క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు.

లైంగిక వేధింపులు ఎదురైతే ఏం చేయాలి.. ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ అంటే ఏమిటో చెబుతున్నారు. మత్తు పదార్థాలతో జరిగే అనర్థాలు, ఒకవేళ తోటి విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలకు అలవాటుపడితే ఎవరికి చెప్పాలో నేర్పిస్తారు. ఆన్‌లైన్‌లో అపరిచితులు, లైంగిక వేధింపుల బారినపడకుండా జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు.

డిజిటల్ ముప్పు, వ్యక్తిగత గోప్యత పాటించడంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అంతర్జాలం వినియోగించేప్పుడు బాధ్యతగా ఉండాల్సిన తీరును వివరిస్తారు.

సమస్యలు ఎదురైనప్పుడు మానసిక ఒత్తిడికిలోనవకుండా.. ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పిస్తారు. పరిష్కార వేదికల్ని ఏర్పాటు చేస్తారు.

తోటి విద్యార్థులు, నిత్య జీవితంలో పరిచయమయ్యే వ్యక్తులతో వ్యవహరించాల్సిన తీరును వివరిస్తారు.

రహదారులపై వెళ్లినప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించడంపై శిక్షణ ఇస్తారు.

పాఠశాల ఆవరణలో ప్రమాదకరమైన వస్తువులు, ఇతరత్రా ఏది కనిపించినా రిపోర్టు చేసేలా ప్రోత్సహిస్తారు.

**స్వరూపం ఇలా..**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ప్రతి పాఠశాలలో సేఫ్టీ క్లబ్‌లు ఏర్పాటు చేస్తారు.

అన్ని తరగతుల్లోని గ్రేడ్ల నుంచి ఇద్దరు విద్యార్థులు సేఫ్టీ మార్షల్స్‌గా, తల్లిదండ్రుల సంఘం, పోలీసుల నుంచి ఒకరు చొప్పున సభ్యులుగా ఉంటారు.

ప్రధానోపాధ్యాయుడు లేదా ఉపాధ్యాయుడు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారు.

సభ్యులకు సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ శిక్షణ ఇస్తుంది. ఏం చేయాలో మార్గనిర్దేశనం చేస్తారు.

సమస్యలు చెప్పడానికి సుశిక్షితులైన బాలమిత్ర ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారు.

విద్యార్థులకు అండగా : వినీత్, మాదాపూర్ డీసీపీ

"మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో విద్యార్థులపై అనేక అంశాలు ప్రభావం చూపుతున్నాయి. వ్యసనాల బారిన పడుతున్నారు. వీటి ఉచ్చులో పడకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. సేఫ్టీ క్లబ్‌లు విద్యార్థులకు అండగా ఉంటాయి."

# నిధులకు పాతర.. వసూళ్ల జాతర



హైదరాబాద్ : ఏటా జరిగే ఉత్సవాలను కొందరు పోలీసులు తమకు అనువుగా మలుచుకుంటున్నారు. అదనపు సిబ్బందికి అవసరమైన భోజన, వసతి కోసం నిధులు మంజూరు చేస్తున్నా.. కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు తీరు మార్చుకోమని పలుమార్లు హెచ్చరించినా పాతపద్ధతినే అనుసరిస్తున్నారు. భిన్న మతాలు, కులాలున్న మహానగరిలో ఏ కార్యక్రమం నిర్వహించినా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తుంది. ఉన్నతాధికారులు రంగంలోకి దిగి స్వయంగా పర్యవేక్షిస్తుంటారు. ఇటువంటి చోట ఉత్సవాలు, ఊరేగింపు, బందోబస్తు పేరిట కొందరు అధికారుల అక్రమాల పర్వం.. వ్యవస్థకే చెడ్డపేరు తీసుకొస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**హద్దుమీరితే వేటు ఖాయం**

మహానగరం బోనాలకు ముస్తాబవుతోంది. ఇంతటి ప్రతిష్ఠాత్మక సంబరాలను సొమ్ము చేసుకునేందుకు కొందరు పోలీసులు సిద్ధమైనట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన ఆలయాలున్న చోట కొందరు అడ్మిన్ ఎస్సైలు దుకాణదారులు, హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్టు సమాచారం. ఉన్నతాధికారులు బదిలీ ఉత్తర్వులు జారీచేసి రోజులు గడుస్తున్నా కొందరు ఎస్సైలు అవే ఠాణాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. కేసుల దర్యాప్తు, ఠాణా నిర్వహణ కోసం ఎస్‌హెచ్‌వో ఒత్తిడితో ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. నగరంలో ప్రధాన ఆలయం.. లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. ఆ ఆలయ పరిధిలోని ఠాణాకు చెందిన అడ్మిన్ ఎస్సై రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఉత్సవాలు పూర్తయ్యే వరకు తానే ఉంటానంటూ వ్యాపారులను బెదిరించి ఎంత చెల్లించాలనేది ముందుగానే చెప్పినట్లు సమాచారం. ఇదే తరహాలో మరో ఠాణాకు చెందిన ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లు 4 రోజులుగా వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నట్లు డీసీపీ దృష్టికి వెళ్లిందని తెలుస్తోంది. వసూళ్ల వ్యవహారం ఉన్నతాధికారులకు తెలియడంతో కొందర్ని హెచ్చరించినట్లు సమాచారం.

**ఎందుకిలా..?**

పండుగలు.. ఉత్సవాలు.. ఊరేగింపులు.. ఏదైనా బందోబస్తు.. శాంతిభద్రతల నిర్వహణకు అదనపు బలగాలు తప్పనిసరి. వీరికి భోజన, వసతి కల్పించాలి. గతేడాది నగరంలో 26 కార్యక్రమాలకు పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం నిర్వహణ ఖర్చులకు నిధులు మంజూరు చేస్తున్నా.. కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నట్టు పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.

# దడ పుట్టిస్తున్న డెంగీ



హైదరాబాద్ : నగరంలో డెంగీ జ్వరాలు పడగ విప్పాయి. దోమకాటుతో.. బస్తీలు, కాలనీల్లో జ్వరం బాధితులు పెరుగుతున్నారు. చికిత్స కోసం ఆస్పత్రులకు వెళ్లినా దోమల సమస్య తప్పడం లేదు. కాలనీలతోపాటు దవాఖానాల్లోనూ దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ముఖ్యంగా.. నిరుపేదలు నివసించే బస్తీల్లో దోమలను మొదటి ప్రాధాన్యం కింద నియంత్రించాల్సి ఉంది. బస్తీల్లో నమోదయ్యే జ్వరాల గురించి గతేడాది కూడా జీహెచ్ఎంసీ దృష్టిపెట్టలేదు. మూసాపేటలో ఓ చిన్నారి డెంగీ జ్వరం వల్ల చనిపోయినట్టు పత్రికల్లో వచ్చాక కూడా.. బాధితురాలి ఇంటిలో, ఆ బస్తీలో బల్దియా నివారణ చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

**సమాచారం ఇవ్వకుండా**

గ్రేటర్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 700 దవాఖానాలు ఉన్నాయి. కాలనీల్లో అనధికారికంగా, గుర్తింపు పొందిన వైద్యులతో నడిచే క్లినిక్‌లు కూడా దాదాపు అంతే సంఖ్యలో ఉంటాయి. వాటిలో వైద్య పరీక్షలు కూడా జరుగుతుంటాయి. అవి కాకుండా.. రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రాలు మరో వెయ్యి వరకు ఉంటాయని అంచనా. వాటిలో చేపట్టే డెంగీ ఎలీసా ఐజీజీ ఐజీఎం పరీక్షల్లో.. డెంగీ జ్వరం ఉన్నట్టు తేలితే.. వివరాలు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా జీహెచ్ఎంసీకి అందాలి. 24గంటల్లో.. ఎంటమాలజీ సిబ్బంది బాధితుల ఇంటికి వెళ్లి.. దోమలను అంతం చేసే రసాయనాలను పిచికారీ చేయాలి. బాధితుల సమాచారం ఎక్కడికక్కడ నిలుస్తుండటంతో.. త్వరగా చేపట్టాల్సిన నివారణ చర్యల్లో జాప్యం జరుగుతోంది.

**ఒకే రోజు..**

గత 3 రోజుల్లో హైదరాబాద్ జిల్లాలో 27 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుంది. వైద్య ఆరోగ్యశాఖ, ఎంటమాలజీ అధికారులు ఉమ్మడి కార్యాచరణ రూపొందించుకుని.. ప్రజలను జ్వరాల నుంచి బయటపడేయాల్సిన ఆవశ్యకత కనిపిస్తోంది.

**గుర్రపుడెక్క తీయట్లేదు..**

చెరువులు, నాలాల చుట్టుపక్కలున్న కాలనీల్లో దోమల సమస్య విపరీతంగా ఉంది. మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఏడాదంతా ఉంటుంది. చెరువులు, మూసీలోని గుర్రపుడెక్కతోనే ఈ సమస్య. రెండు, మూడు నెలలకోసారి పొక్లెయిన్‌లతో గుర్రపుడెక్కను తొలగించి అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు.

గతంలో మాదిరి ఇంటింటి తనిఖీలు, ఇళ్లలోని నీటి నిల్వలను తొలగించడం, ప్రజలు, విద్యార్థులకు దోమల నివారణ అవగాహన కల్పించాలి. మూడేళ్లుగా చెరువుల్లో గంబూసియా చేపలను వదిలే కార్యక్రమం జరగట్లేదు. వాటిని వదిలితే.. చెరువుల్లోని దోమల లార్వాను తింటాయి.

# చిన్న కమతాలే అధికం

జగిత్యాల : జిల్లాలో భూకమతాలు, రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీనికి కుటుంబాలు విడిపోవటం, భూముల విక్రయాలు, వారసత్వంగా భూముల బదిలీతో పాటు రైతుబంధు పథకం ప్రధాన కారణంగా నిలుస్తోంది. రాష్ట్రప్రభుత్వం 2018లో రైతుబంధు పథకాన్ని ప్రారంభించి ఒక పంటకు ఎకరాకు 4 వేల చొప్పున వానాకాలం, యాసంగిల్లో ఏడాదికి రూ.8 వేలు అందించింది. తదుపరి ఈ మొత్తాన్ని పంటకు రూ.5 వేల చొప్పున ఏడాదికి రూ.10 వేలకు పెంచి అమలు చేసింది. గత సర్కారు ఒక సీజన్‌లో రైతుబంధు నిధులను పూర్తిగా ఇవ్వకపోగా మరో సీజన్‌లో 5 ఎకరాల వరకే పరిమితం చేసింది. ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతుబంధు పథకాన్ని రైతుభరోసాగా మార్చి భూపరిమితి విధించనున్నట్లు పేర్కొని



వ్యవసాయేతర భూముల గుర్తింపు సర్వే చేపట్టింది. ఈ ప్రభుత్వం ఒక సీజన్‌లో పూర్తిగా రైతుభరోసా నిధులను ఇవ్వకపోగా గడచిన యాసంగిలో కేవలం 4 ఎకరాల వరకే రైతుభరోసా నిధులను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో అధిక భూమి ఉంటే రైతుభరోసా నిధులు రావనే ఉద్దేశంతో చాలామంది పెద్దరైతులు తమ పేరిటగల భూములను కుటుంబీకుల పేర్లమీదకు బదిలీచేస్తూ వచ్చారు. భూముల బదిలీ ఐదేళ్లుగా కొనసాగటంతో పెద్దకమతాల సంఖ్య తగ్గి చిన్నకమతాలు, రైతులసంఖ్య గణనీయంగా పెరిగింది. రైతుబంధు పథకాన్ని ప్రారంభించినపుడు జగిత్యాల జిల్లాలో రైతులసంఖ్య 1,76,194 ఉండగా ప్రస్తుతం 2,48,550కి చేరింది. ఇదివరకు 4.34 లక్షల ఎకరాల్లో సాగుభూములకు రైతుబంధు నిధులివ్వగా ప్రస్తుతం వ్యవసాయేతర అవసరాలకు పోగా గుర్తించిన 4.18 లక్షల ఎకరాలకు నిధులను అందిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం ఈ సీజనుకు భూ పరిమితి లేకుండా నిధులను బదిలీ చేస్తామని పేర్కొన్నా ముమ్ముందు భూ పరిమితి ఉండవచ్చని అనుమానిస్తూ మెజారిటీ రైతులు చిన్నచిన్న భూ కమతాలకే మొగ్గుచూపుతున్నారు.

# బీడీ కార్మికులు.. అందని వైద్య సేవలు

సిరిసిల్ల : ఉత్తర తెలంగాణ జిల్లాల్లో విస్తరించి ఉన్న బీడీ పరిశ్రమలో పని చేసే కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన బీడీ కార్మికుల ఆసుపత్రులు అలంకారప్రాయంగా మారాయి. అనారోగ్యాల బారిన పడే కార్మికులకు ఆధునిక వైద్య సేవలందించాలనే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేసినా ఆశించిన మేర ఫలితాలు అందడం లేదు. కార్మికులు శ్వాసకోస, ఊపిరితిత్తులు, కీళ్ల నొప్పులు, వెన్నునొప్పి, దగ్గు వంటి సమస్యలతో బాధపడేవారికి ఇక్కడ వైద్యం అందని ద్రాక్షగానే మారింది. వైద్య పరీక్షలు నిర్వహించే వసతులు లేవని.. సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చి సరిపెడుతున్నట్లు కార్మికులు పేర్కొంటున్నారు. సమస్యలను అధిగమించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని బీడీ కార్మికులు కోరుతున్నారు.

**13 ఏళ్లుగా అలంకార ప్రాయమే..**

తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లిలో 2012లో బీడీ కార్మిక సంక్షేమ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని సంకల్పించారు. అక్కడ వసతులు లేకపోవడంతో వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి శివారు శాబాష్‌పల్లి ఆర్అండ్ఆర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో పదిహేను పడకలతో ప్రారంభించినా ఏనాడు పూర్తి స్థాయిలో వైద్యం అందించిన దాఖలాలు లేవు. పాఠశాలలోని ఓ గదిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. బడి కోసం గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఓ గది, పై అంతస్తులో రెండు గదులు వినియోగిస్తుండగా ఆసుపత్రికి మూడు గదులు వినియోగిస్తున్నారు. ఒక వైద్యురాలు, నర్సుతో కొనసాగుతున్నప్పటికీ పూర్తి స్థాయి సిబ్బందిని నియమించలేదు. ఆంధ్రా, తెలంగాణ రీజియన్‌లో బీడీ కార్మిక సంక్షేమ ఆసుపత్రి కేవలం ఇదొక్కటే కావడం గమనార్హం.

**సిబ్బంది కొరత**

ముస్తాబాద్‌లో బీడీ కార్మిక సంక్షేమ నిధి స్థానిక, సంచార దవాఖానాను



పదిహేనేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఈ మండలంలో దాదాపు 15 వేలకుపైగా బీడీ కార్మికులు ఉన్నారు. ఆసుపత్రి అద్దె భవనంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పనిచేస్తోంది. వైద్యాధికారి, స్టాఫ్‌నర్సు, ఏఎన్ఎం, ఫార్మాసిస్టు, వాహన డ్రైవర్, డ్రెసర్, స్వీపర్ ఉండి సేవలు అందించాలి కానీ కేవలం డ్రెసర్, ఫార్మాసిస్టు మాత్రమే ఉన్నారు. కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం ఏకలవ్య ప్రధాన కార్యదర్శి కుర్ర సావిత్రి తదితరులు కోరుతున్నారు.

**వసతులు కల్పించాలి**

సిరిసిల్లలోని బీడీ కార్మిక సంక్షేమ నిధి స్థానిక, సంచార దవాఖానా. గతంలో బీవై నగర్‌లో అందుబాటులో ఉండేది. ప్రస్తుతం సినారె కళామందిర్ వద్ద ఏర్పాటు చేసినా కార్మికులకు అవగాహన లేమి, ఆసుపత్రిలో వసతులు లేకపోవడం కారణంగా సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. ఎప్పుడూ మూతపడే ఉంటుందని.. సిబ్బంది ఎప్పుడు వస్తారో తెలియదని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఎల్లవేళలా వైద్యుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని.. మౌలిక వసతులు మెరుగుపరిచి, కార్మికులకు ఆసుపత్రి సేవలపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

# సమస్యలు అధిగమించి.. అగ్రస్థానంలో నిలిచి!

ధర్మపురి: ప్రభుత్వ బడుల్లో పీఎం పోషణ్ (మధ్యాహ్న భోజన) పథకం అమలులో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఓ వైపు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, మరోవైపు పెండింగ్ బిల్లులతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చిత్తశుద్ధితో జరిగేది కాదు. కానీ జిల్లాలో ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణతో పాటు, నిరంతర పర్యవేక్షణ, పెండింగ్ బిల్లుల చెల్లింపుతో ఈ సమస్యను అధిగమించారు. అధికారులు సమావేశాలు నిర్వహించటం, ప్రత్యేక యాప్‌లో విద్యార్థుల సంఖ్య నమోదు చేయించటం, వెంటవెంటనే బిల్లుల చెల్లింపులు చేపట్టారు. ఫలితంగా జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం అమలులో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి. కలెక్టర్ సత్యప్రసాద్, డీఈవో రామునాయక్‌లు బిల్లుల చెల్లింపులలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మండల స్థాయి రెవెన్యూ, నోడల్ అధికారులతో పథకం అమలు తీరుపై నిఘా పెట్టారు. దీంతో జగిత్యాల జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో పీఎం పోషణ్ అమలు



సమర్థవంతంగా పూర్తవటంతో పాటు కేంద్ర ప్రభుత్వం అధికారుల బృందం సర్వేలో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. ధర్మపురి, మగ్గిడి ఆదర్శ పాఠశాలలను కేంద్ర బృందం పరిశీలించింది.

మధ్యాహ్న భోజనం మెనూ

సోమవారం : కిచిడీ, కూరగాయలు, గుడ్డు
మంగళవారం : అన్నం, కూరగాయలు, సాంబార్
బుధవారం : అన్నం, కూరగాయలు, ఆకుకూర పప్పు, గుడ్డు
గురువారం : వెజిటెబుల్ బిర్యాని, కూరగాయలు
శుక్రవారం : అన్నం, కూరగాయలు, సాంబార్, గుడ్డు
శనివారం : అన్నం, కూరగాయలు, ఆకుకూర పప్పు.


గతేడాది నుంచి సమస్యలు పరిష్కారం

గతంలో నెలల తరబడి మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఉండేవి. గత ఏడాది నుంచి సమస్యలు పరిష్కారమయ్యాయి. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం పాఠశాలల్లో భోజనం పెడుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. కొన్నిచోట్ల వంటగదులు, సిలిండర్లు ప్రభుత్వం కేటాయించాలి. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింప జేయాలి. గంగాధర్, మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు

# బస్వాపురం.. స్వాహాపర్వం

నల్గొండ : కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన నరసింహ(బస్వాపురం) రిజర్వాయర్ నిర్మాణ సంస్థ అక్రమా లకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దృష్టి సారించింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని పది మండలాల్లో 1.88 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే బస్వాపురం రిజర్వాయర్ కాళేశ్వరం ప్రాజెక్టు-16వ ప్యాకేజీలో భాగంగా నిర్మిస్తున్నారు. 11.38 టీఎంసీల సామర్థ్యంతో మొత్తం రూ.1,610 కోట్ల అంచనా వ్యయంతో రూపుదిద్దుకున్న ఈ జలాశయం డ్యాం నిర్మాణం 85 శాతం పూర్తికాగా ఇంకా 15 శాతం పనులు మిగిలి ఉన్నాయి. చివరి దశలో ఉన్న పనులు పూర్తయితే ప్రాజెక్టుకు ఎగువ ఉన్న కొండపోచమ్మసాగర్ నుంచి 8 టీఎంసీల వరకు నీటిని నింపి కాల్వలకు నీరందించేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు.

60 కిలోమీటర్ల మేర పొడవున నిర్మిస్తున్న కాల్వల నిర్మాణంలో ఇప్పటికే 40 కిలోమీటర్ల మేర తవ్వి లైనింగ్ పనులు పూర్తి చేశారు. మరో 20 కిలోమీటర్ల మేర కాల్వలను తవ్వాల్సి ఉంది. ఈ రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో గుత్తేదారు సంస్థ అక్రమాలకు పాల్పడినట్లు పేర్కొంటూ 30 రకాల సమాచారాన్ని నీటిపారుదల శాఖ నుంచి సంబంధిత విభాగాధికారులు కోరారు. గుత్తేదారు సంస్థ నుంచి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్), నిర్వాసితులకు భూ పరిహారం, నీటిలభ్యత అనుమతి, ఆమోదించిన డిజైన్లు, ఒప్పందం వివరాలు, ఎంబీ రికార్డులు, నోట్ ఫైల్స్, నాణ్యత ధ్రువీకరణ(క్యూసీ)పత్రాలు, రిజర్వాయర్, కాల్వల డిజైన్లు,



గతంలో వచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు వంటి వివరాల ను సైతం వివరంగా సమర్పించాలని నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులను ఎన్‌ఫోర్స్‌మెంట్ కోరింది.

జలాశయ నిర్మాణ సమయం నుంచి బిల్లుల మంజూరు వరకు కొన్ని అక్రమాలు జరిగినట్లు విజి'లెన్స్' ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు ఫిర్యాదులు వెల్లువెత్తిన నేపథ్యంలో ఇవీ నిజమని తేలితే ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టనుంది. **పరిహారం పంపిణీలో...** 8,601 ఎకరాల భూ సేకరణ అవసరముండగా 4,758 ఎకరాలు ప్యాకేజీ-16 కింద సేకరించి ఆ భూముల్లో పనులు పూర్తి చేశారు. గతంలో ఈ జలాశయంలో 40 చెరువుల ద్వారా నీళ్లు నింపి దిగువ ప్రాంతాలకు 0.5 టీఎంసీల మేర విడుదల చేశారు. రిజర్వాయర్‌లో ఒకటిన్నర టీఎంసీల నీళ్లు నింపితే బీఎన్ తిమ్మాపురం గ్రామం మొత్తం ముంపుకు గురై మునిగిపోతుంది. ఇందుకోసం పరిహారం ఇచ్చేందుకు గత ప్రభుత్వం అంగీకరించింది. 14 కిలోమీటర్ల మేర పొడవైన కట్ట పనులు పూర్తయినప్పటికీ పునరావాస సమస్యలు, అనర్హులకు పరిహారం పంపిణీ చేయడం, ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

బీఎన్ తిమ్మాపూర్, తుర్కపల్లి మండలం లప్పనాయక్ తండా, చోక్లా తండా ముంపునకు గురవుతున్నాయి. రూ.500 కోట్లతో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించగా ఇందులోనూ పదుల సంఖ్యలో అనర్హులైన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించినట్లు గతంలో అధికారులకు ఫిర్యాదులు వచ్చినప్పటికి ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోకపో వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే గరిష్ఠంగా రూ.1,200 కోట్ల వరకు ఖర్చులు చూపెడుతున్న అధికారులు వీటికి సంబంధించిన అన్ని 'లెక్కలు' విజి'లెన్స్'కు సమర్పించాల్సి ఉంటుంది. 'లెక్కలు' సరిగా లేకపోవడంతో సంబంధిత అధికారులు 'నీళ్లు' నములుతున్నారు.

# పూడికతీత.. సజావుగా సాగేనా?



కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన వరద, అంతర్గత కాలువలను శుభ్రం చేసేందుకు సోమపూ డికతీత.. సజావుగా సాగేనా?వారం నుంచి పనులు ప్రారంభించారు. ముందస్తుగా వర్షాకాలం ముంచుకొస్తుండటంతో ఆలోపు కాలువల్లోని మట్టి, వ్యర్థాలు, పూడికతీత పనులు చేసేలా అధికార యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. నగర వ్యాప్తంగా 11 పనులు చేపట్టడానికి రూ.49.03 లక్షలతో టెండర్లు పిలిచి ఆ పనులు అప్పగించారు. వారం రోజుల్లో పూడికతీత పనులు పూర్తి చేసేలా అధికారులు కార్యాచరణ తీసుకున్నారు. గతంలో మాదిరిగా పైపైనే శుభ్రం చేయకుండా ఈసారి క్యూబిక్ మీటర్ల లెక్కన పొడవు, వెడల్పు, లోతును పరిగణనలోకి తీసుకుంటున్నారు. మంకమ్మతోట రెండో పోలీసుస్టేషన్ పక్కన ఉన్న కాలువల్లోంచి నాలుగైదు ఫీట్ల లోతుల్లోంచి పూడిక తొలగించాలని నిర్ణయించారు.

**అధ్వానంగా అంతర్గత కాలువలు**

అంతర్గత వీధుల్లోని కాలువల్లో మట్టి పేరుకుపోయింది. ఎక్కడ పడితే అక్కడ కట్టలు కట్టి వదిలేశారు. శివారు ప్రాంతాల్లోని డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోయింది. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేయకుండా వదిలేయడంతో అవి మూసుకుపోయేలా తయారయ్యాయి. ఈసారి పారిశుద్ధ్య పనుల నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. కొద్ది నెలల పాటు పర్యవేక్షణ లేకపోవడం సమస్యలకు కారణంగా మారింది.

**మూసుకుపోయిన పైపుల రంధ్రాలు**

కొత్తగా రహదారులు నిర్మించిన చోట ఓపెన్ డ్రైనేజీలు కనిపించడం లేదు. వాటిని పైపులైనుతో నిర్మించారు. ప్రతి వంద మీటర్లకు ఒక ఛాంబర్ ఇస్తుండగా దాని పక్కనే పైపులతో రంధ్రాలు వదిలేశారు. వర్షం నీరంతా ఇందుల్లోంచే వెళ్లాల్సి ఉండగా అవి మూసుకుపోయాయి. డివిజన్ల వారీగా వీటన్నింటిని పరిశీలించి చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేయిస్తే నీరంతా డ్రైనేజీల్లోకి వెళ్లే అవకాశముంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**పనులు ఇక్కడే..**

సాయిబాబా ఆలయం నుంచి బొమ్మ వెంకన్న చౌరస్తా వరకు
శ్రీదేవి ఆసుపత్రి నుంచి శ్రీకృష్ణమందిర్ నుంచి బొమ్మ వెంకన్న వయా వరహస్వామి టెంపుల్ కల్యాణి గార్డెన్
డివిజన్ నంబర్లు 6,7,8,9,10,30,31,32
గౌతమినగర్, సాయికృష్ణ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు
36వ డివిజన్ జయరాం ఆసుపత్రి నుంచి పవన్ ట్రేడర్స్ ఆర్‌అండ్‌బీ కల్వర్టు37వ డివిజన్ వాసర ఆసుపత్రి నుంచి మార్క్‌ఫెడ్ ఎదురుగా, చేపల మార్కెట్ రోడ్డు, సిద్ధార్థ స్కూల్ రోడ్డు, పారమిత స్కూల్ రోడ్డు వాణినికేతన్ స్కూల్ వెనుకాల నుంచి టు టౌన్ పోలీసుస్టేషన్, ఆర్‌అండ్‌బీ క్రాస్ కల్వర్టు
మల్కాపూర్ చౌరస్తా నుంచి సెంట్ అల్ఫోన్స్ జ్యోతినగర్ వరకు
ఇందిరానగర్ జంక్షన్ నుంచి మంచిర్యాల చౌరస్తా వరకు
22వ డివిజన్‌లోని ఇం.నం.10-4-220/ఎ/2 మహాలక్ష్మి లేడీస్ టేలర్ నుంచి తేజ స్కూల్ రోడ్డు వరకు
40వ డివిజన్ గుండు హనుమాన్ టెంపుల్ నుంచి ఎస్టీ కాలనీ తేజ స్కూల్ వరకు.

# ఆపరేటర్ల ఆగడాలకు అడ్డుకట్ట



హైదరాబాద్: జలమండలి నీటి సరఫరాలో కీలకంగా వ్యవహరించే పంపు ఆపరేటర్ల ఆగడాలకు అడ్డుకట్ట పడనుంది. కొందరు నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తుండటంతో ఒకే ప్రాంతంలో ఎక్కువ నీటి సరఫరా జరుగుతోందని గుర్తించారు. దీనిపై ఫిర్యాదులు వస్తున్నా.. ఎలా ముందుకు వెళ్లాలనేదానిపై యంత్రాంగం తర్జనభర్జన పడి చివరికి అడుగు ముందుకేసింది. ఆపరేటింగ్ వాల్వ్‌ల్లో ఆపరేటర్ల విచక్షణకు అవకాశం ఉండటంతో నీటి సరఫరాలో తేడాలు ఉన్నట్లు గుర్తించింది.

**క్షేత్రస్థాయి పరిశీలనతో వెలుగులోకి**

ఈ ఏడాది వేసవిలో నీటి సరఫరాపై ప్రభావం పడకుండా కనెక్షన్ల వారీగా విశ్లేషించింది. సుమారు 500 కనెక్షన్లను పరిశీలించారు. ఒక నెలలో సరఫరా ఎలా జరిగిందని గమనించగా.. వాల్వ్ ఆపరేటర్ల నిర్వాకం ఆధారాలతో సహా వెలుగు చూసింది. నీటి సరఫరా వేళల్లో అక్రమాలకు పాల్పడటంతో కొందరికి నిర్దేశించిన పరిమాణం కంటే రెట్టింపు, మరికొన్ని నివాసాలకు తక్కువ నీరు సరఫరా అయినట్లు తేలింది.

**పక్కా విధానం దిశగా...**

వాల్వ్ ఆపరేటర్లు నిబంధనల ప్రకారం వ్యవహరించేలా పక్కా విధానం అమలు చేసే దిశగా జలమండలి దృష్టిసారిస్తోంది. నీటి సరఫరా వేళలు, పరిమాణం, ప్రెషర్‌ను పక్కాగా నమోదు చేయనున్నారు. వాల్వ్‌ల వారీగా రికార్డులు నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నారు. ప్రస్తుతం జలమండలి పరిధిలో రోజుకు 550 ఎంజీడీల నీరు సరఫరా అవుతోంది. నగరంలో రెండు రోజులకోసారి నీటి సరఫరా జరుగుతుండగా శివారు ప్రాంతాల్లో రెండు, మూడు రోజులకోసారి ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో పక్కా లెక్కలు ఉండాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డి జనరల్ మేనేజర్లు, ఇతర జలమండలి అధికారులకు స్పష్టం చేశారు.

**వాల్వ్‌ల మ్యాపింగ్**

నీటిని సరఫరా చేసే వాల్వ్‌లు ఎక్కడెక్కడ ఉన్నాయనేది ఆపరేటర్లు చెప్పాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆపరేటింగ్ వాల్వ్‌లు, కంట్రోల్ వాల్వ్‌లను మ్యాపింగ్ చేసి నీరు ఎక్కడెక్కడికి సరఫరా అవుతుందో నమోదు చేయనున్నారు. కొందరు ఒక ప్రాంతంలో ఉంటూ మరోచోట విధులు నిర్వహిస్తున్నారు. ఇంకొందరు పది కిలోమీటర్లు అంతకంటే ఎక్కువ దూరంలో ఉండటంతో దాని ప్రభావం సరఫరాపై పడుతోందా? అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. జూన్ మొదటి వారం నుంచి వాల్వ్‌లు, పంపు ఆపరేటర్ల విధానంలో సంస్కరణలు తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

# నిక్షేపం.. అక్రమార్కుల పరం!

తాండూరు : సర్కారు భూముల్లోని నిక్షేపాలు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. ప్రభుత్వ భూముల్లోని సహజ సంపదను యథేచ్ఛగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల అడపాదడపా చర్యలతో తాత్కాలికంగా నిలువరిస్తున్నారు. అనంతరం అటువైపు వెళ్లకపోవడంతో పరిస్థితి యథాతథంగా మారుతోంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

జిల్లాలోని ఇరవై మండలాల్లో 5,993 ఎకరాల్లో ఖనిజ సంపద నేలలు విస్తరించి ఉన్నాయి. ప్రధానంగా నాపరాయి, సుద్ద, ఇసుక, ఎర్రమట్టి, సన్నకంకర, పలుగురాళ్లు, నల్లరాయి, తెల్లరాయి వంటి నిక్షేపాలున్నాయి. ప్రభుత్వ, పట్టా భూముల్లోని ఖనిజాలను తవ్వకాలతో వెలికి తీసేందుకు గనులు, రెవెన్యూ, పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి, నీటి పారుదల, అటవీ, వ్యవసాయ శాఖల ద్వారా అనుమతి పొందాల్సి ఉంది. వీటి ద్వారా నిరభ్యంతర పత్రాలను పొంది గనుల శాఖ నిర్దేశించిన రుసుం, సుంకాన్ని ప్రభుత్వానికి జమ చేయాలి. అయితే క్షేత్రస్థాయిలో కొంతమంది అనుమతి పొందకుండా నేరుగా ప్రభుత్వ భూముల్లో, పట్టా భూములను ఆనుకుని ఉన్న సర్కారు భూముల్లో నాపరాయి నిక్షేపాల తవ్వకాలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా తాండూరు మండలం ఓగీపూర్, కరణ్‌కోట, మల్కాపూర్‌లో ఈ పరిస్థితి నెలకొంది. ఇక్కడ నాపరాయి నిక్షేపాలతో ఎకరం రూ.80 లక్షలు పలుకుతోంది. ఇదే అదునుగా అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లో పాగా వేసి దర్జాగా ఖనిజ సంపదను తవ్వుకుపోతున్నారు. ఏడాదిలో ఎకరంలో తవ్వకాలు, విక్రయంతో రూ.కోటి ఆర్జిస్తున్నారు.

**విద్యుత్ సరఫరా నిలిపివేసి..:** ఫిర్యాదులు వస్తే గనులు భూగర్భ శాఖ ఏడీ సత్యనారాయణ, ఆర్ఐ నిర్మల ఆధ్వర్యంలో సిబ్బంది, ట్రాన్స్‌కో లైన్‌మెన్‌లు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తున్నారు. అక్రమమని నిర్ధారించాక విద్యుత్తు కనెక్షన్ తొలగించడంతో సరిపెడుతున్నారు.



వాస్తవానికి నిబంధనల ప్రకారం తవ్వకాలు జరిపిన ప్రదేశంలో కొలతలు వేసి తరలించిన నిక్షేపాల లెక్కతేల్చి దానికి పదింతల అపరాధ రుసుం విధించాల్సి ఉన్నా, వసూలు చేయడం లేదు. నెలకిందట కరణ్‌కోట సర్వే సంఖ్య 2లో కొందరు అక్రమంగా గనుల తవ్వకాలు జరపగా విద్యుత్తు కనెక్షన్ తొలగించి వదిలేశారు. శుక్రవారం ఓగీపూర్‌లో నాలుగు గనులు అక్రమంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించిన ఏడీ బృందం కనెక్షన్ తొలగించి వెనుదిరిగారు. కొన్నాళ్లు గడిచాక ట్రాన్స్‌కో సిబ్బందికి నచ్చజెప్పి తిరిగి కనెక్షన్ పొంది అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. కఠిన చర్యలు తీసుకుంటేనే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**రాజకీయ ముసుగులో..**

చాలావరకు రాజకీయ పార్టీల్లో కొనసాగుతున్న వారే అక్రమ తవ్వకాలకు తెరలేపుతున్నారు. రూ.లక్షల్లో ఆదాయం ఆర్జిస్తూ రాజకీయ నాయకులుగా చెలామణి అవుతున్నారు. నియోజకవర్గ స్థాయి నేతల అండదండలతో అక్రమంగా గనుల నిర్వహణ చేపడుతున్నారు. స్థానికులు ఫిర్యాదు చేస్తే అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.

# ఆమెకు అక్షర వెలుగు

సూర్యాపేట : అతివల్లో అక్షరాస్యత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఏటా నిరక్షరాస్యుల గుర్తింపునకు సన్నద్ధమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో చదవడం, రాయడం రాని వారిని గుర్తించి వారికి పాఠాలు చెప్పించడమే ప్రధాన లక్ష్యం. కాగా ఈసారి ప్రధానంగా మహిళా సంఘాల సభ్యులపై దృష్టి సారించింది. 18 ఏళ్లు నిండిన వారిని అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా నిర్దేశించారు. ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆన్ ఇన్ సొసైటీ) పేరిట ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మహిళా స్వయం సహాయక సంఘాల్లో(ఎస్‌హెచ్‌జీ) నిరక్షరాస్యులను గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. జిల్లా విద్యాశాఖ, డీఆర్డీవో అధికారులు ఈ ఉల్లాస్‌ను సంయుక్తంగా చేపడుతున్నారు.

**27,158 మంది నిరక్షరాస్యుల గుర్తింపు**

జిల్లాలోని స్వయం సహాయ సంఘాల్లో 27,158 మంది నిరక్షరాస్యు



లను గుర్తించారు. వారి వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. సర్వే వివరాలను, వారు చదివిన తరగతుల వారీగా పొందుపర్చారు. పదో తరగతి లోపు మానేసిన వారిని సార్వత్రిక పది, పదో తరగతితో ఆపేస్తే సార్వత్రిక ఇంటర్ చేసేలా ప్రోత్సహిస్తారు. ఇంటర్ ఉత్తీర్ణత ఉంటే డిగ్రీ చేయించాలని నిర్ణయించారు. పూర్తిగా నిరక్షరాస్యులు ఉంటే సంఘంలోనే చదువు వచ్చిన వారిని వాలంటీరుగా నియమించి అక్షరాలు నేర్పిస్తారు. ఒకవేళ సంఘాల్లో ఎవరూ చదువుకోకుంటే పిల్లలతో ఈ ప్రక్రియను కొనసాగించాలని నిర్ణయించారు. తద్వారా మహిళా సంఘాల సభ్యులు పూర్తిగా అక్షరాస్యత పెరిగి భవిష్యత్తులో ఉపాధి పొందొచ్చు

**'ఉల్లాస్'లో తీర్చిదిద్దేందుకు కృషి**

జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమాన్ని డీఆర్డీవో, విద్యాశాఖల సమన్వయంతో పకడ్బందీగా చేపట్టాం. నిరక్షరాస్యుల సంఖ్యను తగ్గించేందుకు కేంద్రం ఈసారి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోంది. తొలుత మహిళా సంఘాల సభ్యుల నుంచే మొదలుపెట్టింది. కాగా ఇప్పటికే నిరక్షరాస్యులను గుర్తించి ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌లో పొందుపరిచాం. త్వరలో వారు ఓపెన్ స్కూల్, కళాశాలలో చేర్పించేలా చర్యలు తీసుకుంటాం. అప్పారావు, డీఆర్డీవో, సూర్యాపేట

# వేగంగా కొనుగోళ్లు

గరిడేపల్లి : యాసంగి ధాన్యం కొనుగోళ్లకు మరో వారం పట్టవచ్చని అధికారుల అంచనా. ఇప్పటికే 95 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయి. మిగిలిన ధాన్యం ఈ వారం రోజుల్లో పూర్తి చేయాలని సంకల్పించారు. వర్షాల వల్ల తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేస్తుండటంతో పాటు రవాణాలో కొంత జాప్యం ఏర్పడటంతో ఈనెల 25లోగా పూర్తికాలేదు. గతేడాది కంటే ఈసారి ఎక్కువ కొనుగోలు చేసిన అధికారులు అందుకు అనుగుణంగా ముందుగానే కొనుగోళు పూర్తి చేస్తున్నారు. ఇప్పటి వరకు 3,04,721 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. వీటిలో 49,735 మెట్రిక్ టన్నులు సన్న ధాన్యమే. 336 కేంద్రాలకుగానూ 221 కేంద్రాలలో కొనుగోళ్లు పూర్తయ్యాయి. 115 కేంద్రాలలో సుమారు 15 వేల మెట్రిక్ టన్నులు మిగిలి ఉన్నాయి. ఇందులో సైతం 10 వేల మెట్రిక్ టన్నులు కాంటాలు వేసి రవాణా జరుగుతుంది. మరో 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



**యాసంగిలో అదనంగా..**

ఈ ఏడాది యాసంగిలో అదనంగా కొనుగోళ్లు జరిగాయి. గత యాసంగిలో 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఈసారి తక్కువ సమయంలో 3.04 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు గత ఏడాది కంటే 64 వేల మెట్రిక్ టన్నులు అదనంగా కొనుగోలు చేసినట్లు పేర్కొంటున్నారు.

**సమస్యలివీ..** ధాన్యం కాంటా వేసినందుకు హమాలీ ఖర్చు ముందుగా రైతులు భరిస్తున్నారు. నిధులు వచ్చిన తర్వాత రైతులకు వీటిని తిరిగి చెల్లిస్తారు. ముందుగా రైతులపై భారం పడుతుంది. దాంతో పాటు రవాణా సమయంలో వాహనం(లారీ, ట్రాక్టర్)కు ఏదైనా అయితే పూర్తి బాధ్యత నిర్వాహకులదే. అయినా చాలా చోట్ల లారీ నుంచి మరో లారీ లేదా ట్రాక్టర్లలోకి మార్చినందుకు హమాలీ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యం తూకంలో అదనంగా తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. రోజుల తరబడి ఎండ, వానలో ఉండి అమ్ముకుంటే ఈ ఖర్చులన్నీ భరించడం భారమేనని పేర్కొంటున్నారు.

**తరుగు తీయరు**

ధాన్యం మిల్లుకు చేరిన తర్వాత తరుగు తీయరు. తడిసిన ధాన్యం వెళ్తే కాంటా వేసిన సమయంలో కంటే అదనంగా (తడిసిన బరువు) బరువు ఉంటే అంతమేరకే తీసేస్తారు. రైతుకు నష్టం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కలెక్టర్ నిత్యం పర్యవేక్షిస్తూ ఈసారి వేగంగా కొనుగోళ్లు పూర్తి చేయిస్తున్నారు. లారీలలో బస్తాల మార్పిడి బాధ్యత నిర్వాహకులదే. ప్రసాద్, డీఎం, సివిల్ సప్లయ్

## చిత్రావతిలో ఇసుక దొంగలు

పుట్టపర్తి : సత్యసాయి నడయాడిన చిత్రావతి నదిలో దొంగలు పడ్డారు. నిత్యం యంత్రాలతో ఇసుకను తవ్వేస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా పట్టణాలకు తరలించి ఒక ట్రిప్పు రూ.1,500 నుంచి రూ.2 వేలకు విక్రయిస్తున్నారు. ఇలా.. రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. కొంత కాలంగా ఈ దందా సాగుతోంది. అధికారులకు తెలిసినా కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. పవిత్రమైన చిత్రావతినది పరిసరాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయిస్తుండగా, కొందరు స్వార్థం కోసం ఇసుకను తవ్వుతున్నారు.

**ఉచితం మాటున దోపిడీ:** ఉచిత ఇసుక విధానంలో ప్రజాప్రతినిధులు, నాయకులు జోక్యం చేసుకోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే సూచిస్తున్నా.. ఆచరణలో మాత్రం పాటించడం లేదు. ధనార్జనే



ధ్యేయంగా ఉచితం మాటున కొందరు పొక్లెయిన్లతో పుట్టపర్తి చిత్రావతి నది, కొత్తచెరువు వంగపేరు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. నదులను తవ్వేయడం వల్ల వరద వచ్చినప్పుడు భూములు కోతకు గురవుతాయని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని కోరుతున్నారు. దీనిపై జేత సుధాకర్‌రాజు వివరణ కోరగా చిత్రావతినదిలో ఇసుక తరలించకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

## నాణ్యత దిగువకే

ఆలూరు : సాగు, తాగునీటికి ఆధారమైన తుంగభద్ర దిగువ కాలువ ఆధునీకరణ పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. పనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నా బోర్డు అధికారులు తమకేమీ పట్టనట్లు ఉ ంటున్నారు. ఫలితంగా గుత్తేదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా రు. ఆంధ్ర, కర్ణాటక ప్రజల జీవనాడైన తుంగభద్ర దిగువ కాలువ వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. చివరి ఆయకట్టుకు సైతం నీరు అందించాలన్న ఉద్దేశంతో తుంగభద్ర బోర్డు పరిధిలోని 0 నుంచి 250 కి.మీ. వరకు ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.

**రూ.448 కోట్లు వెచ్చించి..**

దిగువ కాలువలో రూ.448 కోట్లతో లైనింగ్ పనులు చేపట్టారు. దీనిని తొమ్మిది ప్యాకేజీలుగా విభజించి ప్రారంభించారు. జిల్లా పరిధిలోని 135 కి.మీ. నుంచి 205 వరకు పనులు దక్కించుకున్న గుత్తేదారులు 2022 జూన్‌లో హడావుడిగా చేపట్టారు. ఆ తర్వాత 2022-2023, 2023-24లో కొంతమేర పనులు చేపట్టారు. ప్రస్తుతం 136 కి.మీ. నుంచి 138 కి.మీ. వరకు, 155-156, 220 కి.మీ నుంచి 222 కి.మీ. వరకు పనులు జరుగుతున్నాయి.



**ఎక్కడెక్కడ ఎలా చేస్తున్నారంటే...**

155 కి.మీ. నుంచి 156 కి.మీ. వద్ద కాలువ చిన్నదిగా.. లోతుగా ఉండేది. ప్రస్తుతం అక్కడ వెడల్పు చేయడంతోపాటు లోతు తగ్గించి లైనింగ్ చేపట్టాలి. గట్టుకు, లైనింగ్‌కు మధ్యలో గుత్తేదారుడు రాళ్లేసి దానిపై మట్టిని పోశారు. వర్షం పడితే లైనింగ్‌పై ఒత్తిడి పెరిగి కొట్టుకుపోయే ప్రమాదముంది. బెడ్డింగ్ కింద మట్టి బస్తాలు వేసి లైనింగ్ చేపట్టడం గమనార్హం. 136 కి.మీ. నుంచి 138 కి.మీ. వరకు జరిగే పనుల్లో కాలువ లైనింగ్ కోసం ముందుగా ఎర్రమట్టి వేయాలి. అలాకాక పొలంలో లభించే మట్టి పోశారు. ఈ మట్టిలో గట్టితనం ఉండదు. త్వరగా చెదిరిపోయే ప్రమాదం ఉంటుంది. 202 కి.మీ. నుంచి 222 కి.మీ. పరిధిలో లైనింగ్ పనులు జరుగుతున్నాయి. చాలాచోట్ల సిమెంటు తేలిపోయి కంకర కనిపిస్తోంది. ఇప్పుడే ఇలా ఉంటే జులై చివర్లో లేదా ఆగస్టు మొదట్లో కాల్వకు నీటిని వదిలినప్పుడు ఏమాత్రం నిలుస్తుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సరిగమపద.. కళాశాల పిలుస్తోంది..!

విజయనగరం : మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల.. కళలకు కాణాచీగా నిలిచిన విజయనగరానికి మరింత గుర్తింపు తీసుకొచ్చింది. పూసపాటి రాజ వంశీయుల సహకారంతో ఎందరో ఔత్సాహికులను సంగీత సరస్వతులుగా తీర్చిదిద్దింది. శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన ఈ విద్యాలయంలో సంగీత విద్య అభ్యసించి తమ ప్రతిభతో ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారెందరో ఉన్నారు. ప్రముఖ సంగీత దర్శకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, సాలూరు రాజేశ్వరరావులు ఓనమాలు దిద్దింది ఇక్కడే. ఆదిభట్ల నారాయణదాసు, నేదునూరి కృష్ణమూర్తి, నూకల చినసత్యం ప్రధానాచార్యులుగా సేవలందించారు. ప్రస్తుతం 505 మందితో నడుస్తోంది. కళాశాలలో ఉన్న కోర్సులు, సౌకర్యాలు ఓ సారి పరిశీలిస్తే...

**చేరేందుకు అర్హతలు..**

ఈ కళాశాలలో చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ అర్హతలు నిర్ణయించింది. అభ్యర్థులు 10 ఏళ్ల వయస్సు నిండి ఉండాలి. వయోపరిమితి 60 ఏళ్లు. డిప్లొమా కోర్సులో ప్రవేశానికి సంబంధిత డిసిప్లిన్‌లో సర్టిఫికేట్ కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు.

**ఇవీ కోర్సులు...**సంగీత కళాశాలలో పలు కోర్సులకు ఆదరణ పెరుగుతోంది. గాత్రం, వీణ, వయోలిన్, నాదస్వరం, మృదంగం, డోలు, భరతనాట్యం కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో కోర్సులో 50 నుంచి 60 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి 12 తరగతి గదులు ఉన్నాయి. అన్నింట్లో సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఉన్నాయి. ప్రిన్సిపల్, 8 మంది అధ్యాపకులు, 8 మంది ఇతర సిబ్బంది పని చేస్తున్నారు.

**ఫీజులు ఇలా..**కళాశాలలో సర్టిఫికేట్, డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు అవకాశం ఉంది.

ముందుగా సర్టిఫికేట్ కోర్సులో ప్రవేశానికి విద్యార్థులు ఏడాదికి రూ.1600 చెల్లించాలి. దీనికి నాలుగేళ్ల కాలపరిమితి.

డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఏడాదికి రూ.2100 చెల్లించాల్సి ఉంటుంది. ఇది రెండేళ్ల కోర్సు. జులై 1వ తేదీ నుంచి 31వ తేదీ మధ్య చేరే విద్యార్థులకు పైన తెలిపిన ఫీజు నిర్ణయించారు. తర్వాత అపరాధ రుసుము చెల్లించి చేరవచ్చు.

తరగతుల వేళలు..ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు నిర్వహిస్తున్నారు. గృహిణులు, ఉద్యోగులకు అనుకూల సమయంగా విద్యార్థులకు సాధారణ విద్యకు ఆటంకం లేకుండా ఈ సమయాలను ప్రభుత్వం నిర్ణయించింది.

సదుపాయాలు ఇవీ..విద్యార్థులకు సరిపడా సదుపాయాలు సమకూర్చారు. ఆరేళ్ల కిందట సుమారు రూ.కోటితో కళాశాలలో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించారు. ప్రాంగణంలోని తరగతి గదులు బాగుచేయించి, పంకాలు, ఇతర స్టేషనరీ సమకూర్చారు.

# అరుణమ్మా.. ఇదేమిటమ్మా..?




చిత్తూరు : చిత్తూరు నగరపాలక సంస్థలో ప్రజాధనం హారతి కర్పూరంగా మారింది. చట్టవిరుద్ధంగా ఇష్టానుసారం ఖర్చుచేసి ఆడిందే ఆట.. పాడిందే పాటగా పాలన సాగించారు.. పట్టణ ప్రణాళిక, రెవెన్యూ విభాగాలకు సంబంధించి ఆడిట్ అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవడం మరిచారు.. గత వైకాపా ప్రభుత్వానికి వీరవిధేయరాలుగా గుర్తింపు పొంది నాటి నాయకుల కనుసన్నల్లో కొనసాగిన కమిషనర్ అరుణ పలు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. నిధుల మళ్లింపు, పన్ను వసూళ్లలో తీవ్ర నిర్లక్ష్యం, అసంబద్ధంగా రికార్డుల నిర్వహణ ఇలా పలు ఆసక్తికరమైన అంశాలు ఆడిట్‌లో వెలుగుచూస్తున్నాయి.. 2023-24లోనే ఎన్నడూ లేనంతగా 93 అభ్యంతరాలకు సంబంధించి రూ.157.53 కోట్లకు లెక్కల్లేవంటూ ఆడిట్ శాఖ ఆర్‌డీడీ గోవిందప్ప ఇటీవల ధ్రువీకరించారు.

**ఆస్తిపన్ను వసూళ్లలో తీవ్ర నిర్లక్ష్యం..**

నగరపాలక సంస్థకు ఆస్తి పన్ను ప్రధాన ఆర్థిక వనరు. పేద, మధ్య తరగతి కుటుంబాలను తీవ్ర ఒత్తిడికి గురిచేసి వాటిని వసూలు చేస్తారు. అదే రాజకీయ పలుకుబడి, పెద్ద నాయకుల నుంచి ఆస్తిపన్ను వసూళ్ల జోలికి వెళ్లరు. అధికారుల నిర్లక్ష్యంతో వాణిజ్య పన్నుల అద్దె బకాయిలు రూ.1.23 కోట్లు, ఆస్తి పన్ను బకాయిలు రూ.41.34 కోట్ల వసూళు విస్మరించారు. గడువు ముగిసినప్పటికీ ఇద్దరు ఉద్యోగులకు నిబంధనలకు విరుద్ధంగా నగరపాలక ఖాతా నుంచి రూ.4.80 లక్షలు చెల్లించారు. జగనన్న మాల్‌కు సబ్బులు, సరకులు కొనుగోలు చేసినట్లు రూ.13.83 లక్షలు చెల్లించారు. దీనికి ఎలాంటి ఓచర్లు, బిల్లులు లేవు. మెప్మాలో లెక్కలు లేవు. జగనన్న సురక్ష కింద రూ.27.01 లక్షలు ఖర్చుచేసినా రికార్డులు లేవు. రూ.13.50 కోట్ల పనులకు ఎం.బుక్‌ల్లేవు. పలు అభివృద్ధి పనులకు రూ.11.70 కోట్లు చెల్లించారు. వాటికి సంబంధించి ఎం.బుక్‌లు, ఓచర్‌లు, బిల్లులు, రికార్డులే లేవు.

**అమృత్ పథకం ఖాతాకు లెక్కల్లేవు..**

అమృత్ పథకం కింద రూ.44.98 లక్షలు చెల్లించారు. వీటికి ఓచర్లు, ఎం.బుక్‌ల ఊసేలేదు. వాణిజ్య దుకాణాలు నిర్మించినట్లు రూ.49.43 లక్షలు చెల్లించారు. రికార్డులు లేవు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు నగరపాలక నిధులు రూ.24.19 లక్షలు ఖర్చు చేశారు. మళ్లీ ఆయా నిధులు నగరపాలక పద్దుకు జమ చేయలేదు. ఓచర్లు, బిల్లులు సమర్పించలేదు. అద్దెల రూపం లో వసూలైన రూ.1.56 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు బిల్లులు చెల్లించారు. వాటి ఓచర్లు, రికార్డులు పత్తాలేవు. ఈపీఎఫ్ నుంచి వివిధ అభివృద్ధి పనులకు రూ.97.58 లక్షలు చెల్లించారే తప్ప బిల్లులు లేవు.

**అస్తవ్యస్తంగా రికార్డుల నిర్వహణ..**

నగరపాలక సంస్థలో ఏ విభాగాన్ని చూసినా రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు ఆడిట్ అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని విభాగాల్లో నిధులు జమ, ఖర్చులకు సంబంధించి ఎం.బుక్‌లు, ఓచర్లు, రికార్డులు లేవు. గ్రాంట్లు, రుణాల రిజిస్టర్లు సమర్పించలేదు.

**పత్తాలేని 15వ ఆర్థిక సంఘం నిధులు**

15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4.25 కోట్లు చట్ట విరుద్ధంగా ఖర్చుచేశారు. వీటికి రికార్డులు, ఓచర్లు, బిల్లులు, టెండర్లు లేవు. క్లాప్ అకౌంట్ నిధులు రూ.78.58 లక్షలు ఖర్చుచేశారు. బిల్లులు, ఓచర్లు లేవు. చట్టవిరుద్ధంగా ట్రెజరీ నుంచి రూ.81.83 లక్షలు డ్రా చేశారేగానీ క్యాష్ బుక్‌లో నమోదు చేయలేదు.

**రూ.1.15 కోట్ల రికవరీకి చర్యలు** అక్రమంగా రూ.1.15 కోట్లు డ్రాచేసి ఖర్చు చేశారు. ఈ ఉదంతానికి బాధ్యులైన ఉద్యోగుల నుంచి నగదు రికవరీ చేసి జనరల్ ఫండ్‌కు జమ చేయాలని ఆడిట్ అధికారులు ఆదేశించారు. -వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి జీఎస్టీ, ఆదాయపన్ను రూపంలో వసూలైన రూ.23.31 లక్షలు నగరపాలిక ఖాతాకు జమచేయలేదు.-పబ్లిక్ హెల్త్‌కు సంబంధించి డీఅండ్ ఓ ట్రేడర్స్ వివరాలు లేవు. రికార్డులు ఇవ్వలేదు. ఇతర పనుల ఓచర్లు లేవు. వీటి విలువ రూ.1.18 కోట్లు.

**నాటి కమిషనర్‌కు నోటీసులిచ్చాం..**నగరపాలక సంస్థ 2023-24 ఆడిట్ అభ్యంతరాలు నాలుగు నెలల్లో పరిష్కరించుకోవాలని అప్పటి కమిషనర్, అధికారులకు నోటీసులిచ్చాం. పరిష్కరించుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవు. గోవిందప్ప, ఆర్‌డీడీ, ఆడిట్ శాఖ

# ఉద్యాన తోటల సాగుపై ఆసక్తి



అనకాపల్లి : జిల్లాలో రైతులు ఉద్యాన తోటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వమూ రాయితీలు ఇస్తూ ప్రోత్సహిస్తోంది. వరి, చెరకు, మినుము, పెసర తదితర పంటలు సాగు చేసినా కలిసి రావడంలేదని రైతులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో కొబ్బరి, మామిడి, జీడిమామిడి తోటల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు కూరగాయల సాగు చేస్తున్నారు. ఉద్యాన పంటల సాగుకు ఇదే సరైన సమయం. జిల్లాలో 57,250 హెక్టార్లలో ఈ పంటలను సాగు చేస్తున్నారు. అనకాపల్లిలో ఉద్యాన పరిశోధన క్షేత్రం ఉంది. ఇక్కడ మామిడి 15 వేలు, కొబ్బరి 45 వేలు, జీడి మామిడి 8 వేల మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఎం.ఎ.రహీమ్ పేర్కొన్నారు.జిల్లాలో 9,500 హెక్టార్లలో కొబ్బరి సాగవుతోంది. ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. సముద్రతీర ప్రాంతాల్లో ఎక్కువ మంది కొబ్బరి తోటలు వేస్తున్నారు. ప్రైవేటు నర్సరీల్లో ఒక్కో మొక్క రూ. 200 నుంచి రూ.400 చొప్పున విక్రయిస్తున్నారు. హైబ్రీడ్ రకమని మూడేళ్లలోనే కాయలు వస్తాయని చెబుతున్నా.. నాటిన తర్వాత ఐదేళ్లు అవుతున్నా.. పంట చేతికి రావడం లేదని రైతులు వాపోతున్నారు. వ్యాపారులు చెప్పే రకం ఒకటి, ఇచ్చే మొక్కలు మరో రకంగా ఉన్నాయని రైతులు రాంబాబు, మహేశ్ చెబుతున్నారు. ఉద్యాన శాఖ నర్సరీల్లో బుట్టతో ఒక్కో మొక్క రూ.90 కి లభిస్తోంది. ఈస్ట్‌కోస్ట్ స్టాల్ రకం మొక్కలు అందుబాటులో ఉన్నాయని రహీమ్ చెప్పారు.మెట్ట ప్రాంతాల్లో జీడి మామిడి 27,900 హెక్టార్లలో సాగవుతోంది. అన్ని పంటల కంటే దీని విస్తీర్ణమే ఎక్కువ. ప్రైవేటు వ్యాపారులు మొక్కను రూ.100 చొప్పున విక్రయిస్తుండగా, ఉద్యాన శాఖ రూ.40కి ఇస్తోంది. ప్రస్తుతం వి-3, 4 రకాల మొక్కలు ఉన్నాయి. మామిడి తోటలు జిల్లాలో 10,900 హెక్టార్లలో సాగవుతున్నాయి. ప్రైవేటు నర్సరీల్లో మొక్క వయసును బట్టి రూ.200 నుంచి రూ.800 చొప్పున విక్రయిస్తున్నారు. ఉద్యాన శాఖ నిర్వహిస్తున్న నర్సరీల్లో రూ.45కే అందిస్తున్నారు. బంగినపల్లి, తోతాపురి, చిన్నరసాలు, పెద్ద రసాలు, సువర్ణరేఖ, పందూరి వంటి రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

# నిర్లక్ష్యం.. గూడు 'గట్టు'కొని

కోవెలకుంట్ల: గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎస్సార్బీసీ ఆయకట్టు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఉప కాలువల నిర్వహణ కోసం ఒక్క పైసా కూడా కేటాయించలేదు. ఫలితంగా లైనింగ్ దెబ్బతింది. జిల్లా పరిధిలో ఎస్సార్బీసీ 1.53 లక్షల ఆయకట్టు ఉంది. దీని పరిధిలో గోరుకల్లు, అవుకు జలాశయాలు ఉన్నాయి. ఈ మధ్యలో 11 డిస్ట్రిబ్యూటరీలు పనిచేస్తున్నాయి. అవుకు వద్ద 116 కి.మీ. నుంచి 142 కి.మీ. వరకు 12 నుంచి 16 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. వీటి కింద అవుకు, సంజామల, ఉయ్యాలవాడ, వైఎస్సార్ కడప జిల్లాలోని జమ్మలమడుగు వద్ద పెద్దముడియం వరకు 39 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. బనగానపల్లి ఎస్సార్బీసీ డివిజన్ పరిధిలో 8, 9, 10, 11, 11ఎ బ్లాకులు ఉండగా 47 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతోంది.

**తెదేపా హయాంలోనే పనులు..**

ఎస్సార్బీసీ ఉప కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. 2017-18లో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో మాత్రమే మరమ్మతు పనులు జరిగాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా ఉప కాలువలు రూపుకోల్పోయాయి. లైనింగ్ దెబ్బతింది. కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయి నీరు ముందుకు ప్రవహించని పరిస్థితి ఏర్పడింది. గట్లు బలహీనంగా మారాయి. తరచూ గండ్లు పడుతూ పొలాలను ముంచెత్తుతున్నాయి. గతేడాది అక్టోబరులో అవుకు మండల పరిధిలో 111 కి.మీ. వద్ద ప్రధాన కట్ట కుంగి ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అదే నెలలో 23వ తేదీన కోవెలకుంట్ల, గుంజలపాడు గ్రామాల



మధ్య 10వ బ్లాక్ వద్ద గండి పడింది.

**ఐదెకరాల్లో పంట కోల్పోయా: నాగేశ్వరరెడ్డి, రైతు**

ఎస్సార్బీసీ పదో బ్లాక్ పరిధిలోని 14ఎల్ కాలువ కింద గతేడాది ఐదెకరాల్లో శనగ సాగు చేశా. ఎకరాకు రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టా. కోత పనులు చేపట్టాలనుకున్న సమయంలో కాలువకు నీరు ఎక్కువగా వదలడంతో పొంగి పంటంతా దెబ్బతింది.

**రూ.1.16 కోట్లు మంజూరు: సురేంద్ర, ఎస్సార్బీసీ ఏఈ**

ఎస్సార్బీసీ మరమ్మతులు, లైనింగ్ పనులు, కాలువ కట్ట బలోపేతానికిగాను బనగానపల్లి డివిజన్‌లో రూ.1.16 కోట్లతో 13 పనులు మంజూరయ్యాయి. తొమ్మిదో బ్లాక్‌కు 2 పనులు, 5, 8, 10, 11, 11ఏ బ్లాక్‌లకు ఒకటి చొప్పున, ప్రధాన కాలువకు 3 పనులు మంజూరయ్యాయి.

# సర్వజన కష్టాలే

నంద్యాల : నంద్యాల జిల్లా ఆసుపత్రిని సర్వజన ఆస్పత్రిగా మార్చి మూడేళ్లవుతున్నా ఆ స్థాయిలో వైద్యులను నియమించలేదు. గతంలో 200 ఉన్న పడకల సంఖ్య 650కు పెరిగింది. సేవలు మాత్రం అధ్వానంగా ఉంది. సూపర్ స్పెషాలిటీ వైద్యం అందిస్తామని అధికారులు పదేపదే చెబుతున్నా సాధారణ సేవలు కూడా అందడం లేదు. వైద్యుల కొరతతో సమస్యలు ఎదురవుతున్నాయి. ఉన్న వైద్యులు సెలవు పెడితే ఆరోజు ఓపీ సేవలు పూర్తిగా ఆపేయాల్సిన దుస్థితి నెలకొంది.

**అన్ని విభాగాల్లోనూ అంతే..**

ఆసుపత్రిలో చిన్నపిల్లల విభాగం, డెర్మటాలజీ, అనస్థీషియా, పల్మనాలజీ, డెంటల్, రేడియాలజీ, ఆర్థో విభాగాల్లో ఒక ప్రొఫెసర్, ఒక అసిస్టెంట్ ప్రొఫెసరు చొప్పున తక్కువగా ఉన్నారు. వీరితో పాటు ప్రతి విభాగంలో ఇద్దరు, ముగ్గురు సీనియర్ రెసిడెన్సీ వైద్యుల కొరత ఉంది. ఉన్నవారితోనే మూడేళ్ల నుంచి నెట్టుకొస్తున్నారు.

డెంటల్ విభాగంలో ఒక ప్రొఫెసరు, ఒక అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. వారు సెలవు తీసుకుంటే ఓపీలో వైద్యుల్లేక రోగులు వెనుదిరగాల్సి వస్తోంది. పల్మనాలజిస్టు, రేడియాలజిస్టుల కొరత ఉంది. ఆర్థో విభాగంలో ఉన్న వైద్యులు సదరం శిబిరాల నిర్వహణకే సరిపోతున్నారు.




ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్‌తో పాటు మూడు ఎస్ఆర్ పోస్టులు తక్కువగా ఉన్నాయి.

**గైనకాలజీ వార్డులో..**

ఆసుపత్రిలోని గైనకాలజీ విభాగానికి రోజుకు 50 నుంచి 80 మంది వరకు వస్తుంటారు. ఇక్కడ ఇద్దరు ప్రొఫెసర్లు, సహాయ వైద్యులు ఉన్నప్పటికీ సీనియర్ రెసిడెన్సీ (ఎస్ఆర్)లు ముగ్గురు తక్కువగా ఉన్నారు. సీనియర్ వైద్యులు అందుబాటులో లేకపోతే గర్భిణులను అత్యవసర వైద్యం నిమిత్తం కర్నూలుకు రెఫర్ చేయాల్సి వస్తోంది.

**సాయం చేసేవారు కరవు**ఆసుపత్రిలోని ప్రతి విభాగంలో సహాయ సిబ్బంది కొరత ఉంది. ఒప్పంద, పొరుగు సేవల కింద పనిచేసే సిబ్బంది పోస్టులు తక్కువగా ఉన్నాయి. దీంతో నడవలేని రోగులను స్ట్రెచర్లు, చక్రాల కుర్చీలపై తీసుకెళ్లేవారు కరవయ్యారు. రోగుల సహాయకులు, కుటుంబ సభ్యులే అవస్థలు పడుతూ వారిని ఓపీకి, వైద్యుల వద్దకు తీసుకెళ్లాల్సి వస్తోంది.**బదిలీల్లో ఖాళీలు చూపాం: డా.మల్లీశ్వరి, జీజీహెచ్ సూపరింటెండెంటు**ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో ఆసుపత్రిలోని ప్రొఫెసర్ల ఖాళీలను చూపించాం. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ద్వారా డీఎంఈకి నివేదిక అందించాం. ప్రస్తుత బదిలీల్లో కొంతమంది వైద్యులు వచ్చే అవకాశం ఉంది. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

# వసతి లేక.. వలస బాట

నంద్యాల : ఉమ్మడి జిల్లాలో పశ్చిమాన కరవు పరిస్థితులు ప్రజా జీవనాన్ని చిదిమివేస్తున్నాయి. ఉపాధి, ఉద్యోగావకాశాలు లేకపోవడంతో చాలామంది వలస వెళుతున్నారు. పిల్లలు సైతం తల్లిదండ్రులతో కలిసి ఉపాధి బాట పడుతున్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన పిల్లల విద్యాభివృద్ధిలో కీలకమైన ప్రభుత్వ వసతిగృహాలు ఈ ప్రాంతంలో పెరగాల్సిందిపోయి క్రమంగా మూతపడుతున్నాయి. కొన్ని మండలాల్లో వసతిగృహాలే కానరావడం లేదు.

కర్నూలు జిల్లాలో బీసీ ప్రీమెట్రిక్ వసతి గృహాలు 31 ఉండగా ఇందులో 22 బాలురు, 9 బాలికలకు చెందినవి ఉన్నాయి. వీటిలో 6,967 మంది చదువుతున్నారు. సాంఘిక సంక్షేమ వసతిగృహాలు 29 ఉండగా 18 బాలురకు, 11 బాలికలకు ఉన్నాయి. వీటిల్లో 5,348 మంది విద్యనభ్యసిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో మూడు ఆశ్రమ పాఠశాలలు, మరో మూడు రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 66 వివిధ **రకాల వసతిగృహాలు ఉండగా..** గత పదేళ్లలో కొన్ని మూతపడ్డాయి. ఫలితంగా వేలాది మంది పేద విద్యార్థులు నష్టపోయారు.

ఆదోని ప్రాంతంలో సుమారు 15 మండలాల్లోని కొన్ని జడ్పీ పాఠశాలల్లో గత పదేళ్ల కాలంలో 'పది' ఫలితాలను పరిశీలిస్తే 60 శాతం మించడం లేదు. బడి మధ్యలో మానేస్తున్నవారి సంఖ్య ఈ మండలాల్లో ఎక్కువగా ఉంటోంది. హాస్టళ్లు అసలు లేని కౌతాళం, చిప్పగిరి, హొళగుంద మండలాల్లో గత మూడేళ్లలో పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నట్లు విద్యాశాఖ గణాంకాలే చెబుతున్నాయి.

**కానరాని సీజనల్ వసతి గృహాలు**



పశ్చిమ ప్రాంతంలో ప్రత్యేకించి ఆదోని డివిజన్‌లో 245 పాఠశాలలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో కరవు ఉంటుంది. రైతులు కాడి వదిలేసి వలస వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం 71 వరకు సీజన్ వసతి గృహాలు ఏర్పాటు చేసేది. విద్యార్థులు సుగ్గి బాట పట్టకుండా వీటిల్లో ఉండేవారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ వసతిగృహాలను పట్టించుకోలేదు.

**20 ఎస్సీ హాస్టళ్ల మూసివేత**

జిల్లాలో 2016లో సుమారు 20 ఎస్సీ వసతిగృహాలను మూసేశారు. ఇందులో ఎక్కువభాగం పత్తికొండ, డోన్, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆలూరు నియోజకవర్గాల్లోనే ఉన్నాయి. అప్పటి ఉమ్మడి జిల్లాలో 50 ఎస్సీ వసతిగృహాలను మూసివేయగా ఇందులో కర్నూలు జిల్లాలో 20 వరకు ఉన్నాయి. ప్రత్యేకించి వీటికి సొంత భవనాలు లేకపోవడంతో మూతపడ్డాయి.

**ప్రయత్నించినా సీటు దొరకలేదు: రాజేశ్వరి, ఏడో తరగతి, పొదలకుంట**

న్యూస్‌టుడే, కౌతాళం: మా అమ్మానాన్న ఏటా వలస వెళ్తుంటారు. నన్ను హాస్టల్‌లో చేర్చాలని ప్రయత్నించినా సీటు రాలేదు. పక్కనున్న మదిరె గ్రామంలోని పాఠశాలలో చేరా. అమ్మానాన్న వలస వెళ్తే వారి వెంట వెళ్లాల్సిందే.

# రెండు కి.మీ. దూరం..
# నిత్యం ప్రాణసంకటం..

పెందుర్తి : అనకాపల్లి-ఆనందపురం ఆరు వరుసల జాతీయ రహదారి ప్రమాదకరంగా మారింది. దీన్ని 2014-19 మధ్య కాలంలో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం నిర్మించింది. అప్పట్లో పలుచోట్ల భూ వివాదాలు తలెత్తాయి. వాటన్నింటినీ పరిష్కరించినా.. పెందుర్తి మండలం సరిపల్లి సమీపంలో నెలకొన్న వివాదం నేటికీ అపరిష్కృతంగానే ఉండిపోయింది. దీంతో రాంపురం సమీపం నుంచి పాత పెందుర్తి వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర జాతీయ రహదారి పనులు పూర్తికాలేదు. ముఖ్యంగా రింగు రోడ్డు నిర్మాణం జరగకపోవడంతో నగరంలోకి వచ్చే వాహన చోదకులు కిలోమీటర్ల దూరం ముందుకెళ్లి.. తిరిగి వెనక్కి రావాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఎందరో ప్రమాదాలకు గురవుతున్నారు.
ఈ సమస్య పరిష్కారానికి గత వైకాపా ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదు. పరిహారం విషయమై రైతులు కోర్టును ఆశ్రయించడంతో ఎక్కడి పనులు అక్కడే స్తంభించిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఈ సమస్యను పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**సంఘటన-1**



రెండేళ్ల క్రితం రాంపురం సమీపంలో ఓ కారు ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందారు. ఇదే ప్రదేశంలో గతంలోనూ రెండు వేర్వేరు ప్రమాదాల్లో రోడ్డు దాటుతున్న ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల అక్కడే ఇసుక లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది.

**సంఘటన-2**

ఈ నెల 1న పెందుర్తి పెద్ద చెరువు సమీపంలో ద్విచక్ర వాహన ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. గతంలో ఒక అంబులెన్సు బోల్తా పడి రోగి సహా నలుగురు గాయాల పాలయ్యారు. ఇటీవల ఓ లారీ కాలిబాటపైకి దూసుకెళ్లడంతో రెయిలింగ్ ధ్వంసమైంది.

**ఆ రోడ్డు మలుపు.. ప్రమాదాలకు పిలుపు..**

పెందుర్తి పెద్ద చెరువు సమీపంలో నిలిచిపోయిన పనుల వద్ద రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ పల్లంగా ఉన్న మలుపు వద్ద వాహనాలు వేగంగా వెళుతూ అదుపు తప్పుతున్నాయి. అదే విధంగా అసంపూర్తి రహదారిలో పలువురు యువకులు ద్విచక్ర వాహనాలతో ఫీట్లు చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఈ పనులు పూర్తయ్యేందుకు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

# ఫార్మాసిటీలో రసాయన జలాల కలకలం

పరవాడ : జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో ఫార్మా వ్యర్థ జలాలు కలకలం రేపుతున్నాయి. రాంకీ కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (సీఈటీపీ) ప్రహరీ ఆనుకుని ఉన్న వరద నీటి కాలువల్లో ఆదివారం నలుపు రంగులో ఉన్న ఫార్మా వ్యర్థ జలాలు ప్రవహించడం స్థానికుల్లో ఆందోళన కలిగిచింది. వీటిని శుద్ధి చేయకుండా బయటికి వదిలేస్తుండడంతో ఈ ప్రాంతం కాలుష్య కాసారంగా మారుతోందని వాపోతున్నారు. గత నెలలో వర్షాల సమయంలో రెండు పర్యాయాలు రాంకీ ఫార్మా రసాయన జలాలను బయటికి విడిచిపెట్టడంతో అవి భరణికం మెల్లోడు గెడ్డవాగులోకి చేరి దుర్గంధం వ్యాపించింది. అప్పట్లో స్థానికులు, రైతులు ఆందోళనలు చేయడంతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గతనెల 18, 19 తేదీల్లో మెల్లోడు గెడ్డ వాగులో నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్‌లో జరిపిన పరీక్షల్లో



గెడ్డవాగులో ఫార్మా రసాయనాలు కలిశాయని, సీటీవో అండ్ హెచ్‌డబ్ల్యూఏ నిబంధనలు పాటించలేదని నిర్ధారించారు. దీనిపై కొద్దిరోజుల క్రితం రాంకీ సంస్థకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నోటీసులు జారీ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర పీసీబీ ప్రధాన కార్యాలయానికి నివేదిక పంపారు. ఇప్పుడు మళ్లీ రాంకీ సంస్థ ఫార్మా రసాయనాలను బయటికి విడిచిపెట్టడంపై రాష్ట్ర పీసీబీ బోర్డు ఛైర్మన్ కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.
ఫార్మాసిటీలో సీఈటీపీ ప్రహరీని ఆనుకుని వరద నీటి కాలువల్లోకి చేరుకున్న రసాయన జలాలు వర్షాలు పడితే మెల్లోడు గెడ్డ వాగులోకి ప్రవహిస్తాయని, దీంతో చెరువులు, గెడ్డవాగులు కాలుష్య కాసారంగా మారుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పీసీబీ ఈఈ ముకుందరావును సంప్రదించగా కాలువల్లోని ఫార్మా వ్యర్థ జలాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# నాడు వదిలేస్తే.. నేడు నిధులిస్తే..!

కుప్పం : క్రీడలంటే మక్కువ ఉన్నా సరైన క్రీడా స్థలం లేదు.. నియోజకవర్గం మొత్తానికి ఉన్నది ఒకేఒక మైదానం.. దానినీ ఐదేళ్ల వైకాపా పాలనలో పట్టించుకునే వారు కరవయ్యారు. దీంతో క్రీడలకు దూరమై.. తమలో ప్రతిభను వెలికితీసే పరిస్థితి క్రీడాకారులకు లేకపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం పురపాలిక పరిధిలోని వడ్డిపల్లె వద్ద గత తెదేపా హయాంలో ఎన్టీఆర్ క్రీడా మైదానం పేరుతో.. ఓపెన్ స్టేడియం, ఇండోర్ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేశారు. వైకాపా పాలనలో పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా చర్యలు చేపట్టడంతో క్రీడాకారుల్లో ఆశలు చిగురించాయి.
**మైదానం అభివృద్ధికి రూ.22 కోట్లు..** కుప్పం ఎన్టీఆర్ క్రీడా మైదానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.22 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతోపాటు నాలుగు మండలాల పరిధిలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు.

# ఎండకు ఎండుతూ.. నేలకు వాలుతూ



నర్సీపట్నం : ఏటా లక్షల్లో మొక్కలు నాటుతున్నా కొన్నిచోట్ల సంరక్షణను గాలికొదిలేస్తున్నారు. వన మహోత్సవాన్ని సందడిగా నిర్వహించిన అధికారులు వర్షాలు ముమ్మరం కాగానే మరిన్ని నాటేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది అటవీ శాఖ, సామాజిక అటవీ విభాగం దాదాపు 40 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. వచ్చే ఏడాది రెట్టింపు లక్ష్యాన్ని ప్రభుత్వం ఇప్పటికే నిర్దేశించింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ లక్షల్లో మొక్కలు నాటిస్తోంది. ఈ ఏడాదైనా సంరక్షణపై శ్రద్ధ చూపితే జిల్లాలో పచ్చదనం పెరిగి పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసిన వారమవుతాం. నాతవరం మండలం తాండవ కూడలి నుంచి నాతవరం వెళ్లే మార్గంలో కొన్ని మొక్కలను గత ఏడాది నరికేస్తే ఉపాధిహామీ పథకం సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వీలైనంత వరకు విద్యుత్తు తీగల కింద నాటకపోవడం మేలు. రైతులకు సరఫరా చేసినవి మొక్కలను వారు పెంచుకుంటున్నారు. ఎకరాకు 80 శాతం నుంచి 90 శాతం వరకు మొక్కలు మూడేళ్లపాటు బతికిస్తే ఉపాధిహామీ పథకం నుంచి ఎకరాకు 1.5 లక్షలు వరకు ఇస్తున్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో గ్రామాల్లో చెరువు గట్లపై నాటిన కొబ్బరి మొక్కలు ఆయా పంచాయతీలకు ఆదాయ వనరుగా మారాయి. పట్టణాలకు సమీపంలోని చెరువు గట్లపై నాటిన వాటిలో కొన్నింటిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. కంచె లేనిచోట పశువులు పాడు చేస్తున్నాయి. రోడ్డు పక్క వేసిన ఎవెన్యూ ప్లాంటేషన్లలో వేసిన మొక్కలు ఏపుగా ఎదిగిన తర్వాత కొన్ని ప్రాంతాల్లో విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్నాయని నరికేస్తున్నారు.
నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, కోటవురట్ల, రోలుగుంట, మాకవరపాలెం మండలాల్లో సగటున ఐదు వందల ఎకరాలకు తగ్గకుండా రైతులు మొక్కలు నాటారు. పల్లె వనాల పేరిట సామాజిక స్థలాల్లో నాటిన మొక్కల్లో కొన్ని సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో పశువులకు ఆహారంగా మారాయి. ‘పేపరు మిల్లుల యాజమాన్యాలు ఏటా 40 లక్షల వరకు సరుగుడు మొక్కలను రైతులకు ఇస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే 12 లక్షల వరకు పంపిణీ చేశారు. వరుణుడు కరుణిస్తే మొక్కలన్నీ నిక్షేపంలా ఎదుగుతాయి. మొక్కలను సంరక్షించడం అందరూ బాధ్యతగా భావించాల’ని సామాజిక అటవీ విభాగం డీఎఫ్‌వో జి.లక్ష్మణ్ కోరారు. ‘అమ్మ పేరుతో మొక్క నాటండి’ (ఏక్ పేడ్ మా కే నామ్). మన్‌కీ బాత్ కార్యక్రమంలో గత ఏడాది జూన్ నెలాఖరున ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు పిలుపు ఇచ్చారు. వన మహోత్సవానికి ఊతమివ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ మొక్క నాటాలన్న ప్రధాని విజ్ఞప్తిని అందరూ పాటిస్తే జిల్లాలో ప్రస్తుతం 20 శాతంగా ఉన్న అడవుల విస్తీర్ణం 33 శాతానికి పెరుగుతుంది.
సామాజిక అటవీ విభాగం ద్వారా 1.5 మీటర్ల ఎత్తులో ఉన్న మొక్కలను ఎవెన్యూ ప్లాంటేషన్లలో నాటుతున్నారు. పశువులు తినడానికి వీల్లేని విధంగా ఆకుపచ్చని మ్యాట్‌తో కంచె వేస్తున్నారు. వీటిలోనూ కొన్నిచోట్ల మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు విరిచేయడమో, నీళ్లు లేక కొన్ని ఎండిపోవడమో జరుగుతోంది. నర్సీపట్నం కొత్తవీధి రోడ్డులో గత ఏడాది నాటిని కొన్ని మొక్కలు ఎండిపోయాయి.

# మహిళల ఉపాధికి డిజిలక్ష్మి ఊతం



అనంతపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే పొదుపు సంఘాల మహిళలకు సంబంధించిన పలు పథకాలు చేరువ చేసి వారికి దన్నుగా నిలుస్తోంది. ప్రస్తుతం ఏ తరహా సేవలు పొందాలన్నా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలన్నా, రేషన్ కార్డు పొందాలన్నా తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయా పథకాలు వర్తించాయా లేదా? అని సరి చూసుకోవాలన్నా కచ్చితంగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నగర, పట్టణాల్లోని పేదల ముంగిట్లోనే సేవలు అందించేందుకు ఆయా ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ‘డిజిలక్ష్మి’ ద్వారా సేవలు అందివ్వడానికి కియోస్క్ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి సరికొత్త పథకాన్ని మహిళలకు చేరువ చేసింది. ఉమ్మడి జిల్లాలో అర్హులైన, ఆసక్తి ఉన్న మహిళలను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఎంపిక ప్రక్రియ అనంతరం వీరికి అందివ్వాల్సిన శిక్షణపై దృష్టిసారిస్తారు.

**ఎంపికకు ప్రామాణికం**

మీ సేవా కేంద్రాల్లో అందించే వివిధ రకాల డిజిటల్ సేవలన్నీ.. డిజిలక్ష్మి పథకానికి ఎంపికైన స్వయం సహాయక సంఘాలు అందిస్తాయి.
సంఘం ఏర్పాటు చేసుకొని మూడేళ్లు పొదుపు చేసి ఉండాలి.
డిగ్రీ పూర్తి చేసి, కంప్యూటర్‌లో నైపుణ్యం ఉండాలి.
21 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలి.
ఎంపికైన మహిళలకు రూ.2 లక్షల రుణం అందజేస్తారు. ఆ రుణంతో కంప్యూటర్, ప్రింటర్, టేబుళ్లు ఇతరత్రాలు కొనుగోలు చేసుకోవాలి. ఒక్కో కేంద్రం నుంచి ఇద్దరు, ముగ్గురు మహిళలకు ఉపాధి లభించడంతో పాటు నెలకు రూ.40 నుంచి రూ.50 వేలు ఆదాయం వస్తుందని అంచనా.
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పలు సేవల్ని సర్వీసు కేంద్రాల ద్వారా డిజిలక్ష్మి అందించేందుకు అనుసంధానం చేస్తారు.

**సేవలు త్వరలో అందుబాటులోకి**
**– విశ్వజ్యోతి, మెప్మా పీడీ**

డిజిలక్ష్మి ద్వారా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం అయింది. ఆసక్తి ఉన్న వారితో కేంద్రాలు ఏర్పాటు చేయిస్తాం. త్వరలోనే సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. ఆయా ప్రాంతాల అవసరం మేరకు కేంద్రాలకు అనుమతి ఇస్తాం.

# పనులు నాసిరకం.. నిధులు దుర్వినియోగం

గుత్తి : గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గాల్లో ఎంపీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. పదేళ్లల్లో రూ.కోట్లను ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారు. ప్రధానంగా వైకాపా ప్రభుత్వ హయాంలో ఎంపీ నిధుల కింద శ్మశాన వాటికల్లో సౌకర్యాలు, వసతులకు భారీగా నిధులు ఇచ్చారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా శ్మశానాలకు నిధులు వెచ్చించారు. ఆయా పనులు నాయకులు ఇష్టానుసారంగా చేసి బిల్లులు దండుకున్నారు.

**గ్రామాల్లో ఇదీ పరిస్థితి..**

గుత్తిలో 5 ఏళ్ల కిందట పలుకాలనీల్లో సిమెంట్‌రోడ్లు నిర్మించారు. అనంతపురం రోడ్డులో నిర్మించిన సిమెంట్‌రోడ్లు నాసిరకంగా ఉండటంతో పంచాయతీరాజ్ ఇంజినీర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. లచ్చానిపల్లిలో పీర్లమకానం కట్టించి సామాజిక భవనం నిర్మించినట్లు బిల్లులు తీసుకున్నారు. అలాగే శ్రీపురంలో ఓ నాయకుడు ఆలయాన్ని విస్తరించాడు. ఆ విస్తరించిన నిర్మాణాలను సామాజిక భవనం అని చూపిస్తూ బిల్లులు తీసుకున్నాడు. బేతాపల్లిలో ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఇంటివద్ద సామాజిక భవనాన్ని నిర్మించగా అది ఆయన ఆధీనంలోనే ఉండిపోయింది. తాడిపత్రిలో రూ.2 కోట్లతో రింగురోడ్డు నిర్మించారు. పనులు నాసిరకంగా ఉండటంతో కంకర తేలింది. రోడ్డు గుంతలమయంగా మారింది. నాయకులు మిగులుబాటు కోసం నాసిరకం పనులు చేపట్టి నిధులు దండుకున్నారు. గుత్తి మండలంలోని ఊబిచర్ల, తొండపాడు గ్రామాల్లో నాలుగు శ్మశానాల్లో పనులకు రూ.40



లక్షలు వెచ్చించారు. పనులు ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రహరీలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నీటి సౌకర్యం కోసం బోర్లు వేశారు. ట్యాంకులను ఏర్పాటు చేసినా కనెక్షన్ ఇవ్వలేదు. వైకాపాకు చెందిన ఓ బలమైన సామాజిక వర్గానికి చెందిన గ్రామ నాయకుడి ప్రయోజనం కోసం నిధులు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఊబిచర్లలో శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించారు. తొండపాడులో మూడు శ్మశాన వాటికలకు నిధులు ఇవ్వగా ప్రహరీలు నిర్మించారు. ఇక్కడా నీటి సౌకర్యం లేదు. గుంతకల్లు మండలంలోని ఓబుళాపురంలో శ్మశాన వాటికు ప్రహరీ నిర్మించారు. అలాగే నీటి తొట్టె ఏర్పాటు చేయగా, నీటి తొట్టి శిథిలమవుతోంది.

# సచివాలయాల బదిలీల్లో సిఫార్సుల యత్నం

పుత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం వార్డు, గ్రామసచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు సంబంధించి జీవో జారీ చేసింది. నెలాఖరులోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఉన్నతాధికారులు బదిలీలకు సంబంధించి ఇప్పటికే మార్గదర్శకాలను విడుదల చేశారు. 2025 మే 31 నాటికి ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు విధిగా బదిలీ కావాల్సిందేననే నిబంధన పెట్టారు. భారీగా బదిలీలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే పలువురు బదిలీల కోసం సిఫార్సు లేఖల కోసం రాజకీయ నాయకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారం చేపట్టాక వార్డు, గ్రామ సచివాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. తద్వారా నగరాలు, పురపాలక సంఘాల్లో వార్డు సచివాలయాలు, పంచాయతీల్లో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. తద్వారా సేవలను ప్రజలకు చేరువ చేశారు. ఒక్కో సచివాలయంలో 8 నుంచి 11 మంది సిబ్బంది



ఉండేలా నియామకాలు చేపట్టారు. అయితే సచివాలయాల్లో పనిచేసే వారిలో కొందరికే పనిభారం మరి కొందరు చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారనే విమర్శలున్నాయి. మరికొన్ని సచివాలయాల్లో అయితే సిబ్బంది అరకొరగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థపై దృష్టి సారించింది. వాటి స్థానంలో క్లస్టర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికలు తీసుకున్న ప్రభుత్వం సిబ్బందిని హేతుబద్ధీకరణ చేయాలని తలచింది.
**క్లస్టర్ వ్యవస్థతో సేవలు..:** చిత్తూరు జిల్లాలో చిత్తూరు నగరపాలక సంస్థతో పాటు నగరి, కుప్పం, పలమనేరు, పుంగనూరు పురపాలక సంఘాలు, 34 మండలాలున్నాయి. అందులో 612 గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన సచివాలయ సిబ్బందిని హేతుబద్ధీకరణ చేశారు. సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజించారు. అందులో 2500 లోపు జనాభా ఒక కేటగిరీగా, 2500నుంచి 3500 రెండవ కేటగిరీగా, 3500పైన ఉన్న జనాభా ప్రాతిపదికన విభజన చేశారు. ఈ మేరకు క్లస్టర్లు విభజన చేపట్టనుండడం గమనార్హం. దీంతో రెండు, మూడు సచివాలయాలు కూడా ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయడం జరిగింది.
**కొందరికి వెసులుబాటు..:** సచివాలయాల్లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులకు ప్రభుత్వం వెలుసుబాటు కల్పించింది. ఎవరైనా దృష్టిలోపం, అనారోగ్య సమస్యలు ఉన్న వారికి నిబంధనలు అనుసరించి తాము కోరుకున్న చోటుకు బదిలీ చేస్తారు. భార్యభర్తలు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులయితే వారికి దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో బదిలీపై వెళ్లే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.
నియామకం ఇలా: ఏ కేటగిరి సచివాలయంలో ఆరుగురు సిబ్బంది, బీ కేటగిరిలో 7 మంది, సి కేటరిగిలో 8 మంది ఉద్యోగులు ఉండేలా ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలను విడుదల చేశారు. మిగిలిన ఉద్యోగులను బదిలీల అనంతరం ఇతర శాఖల్లో సర్దుబాటు చేసే ప్రక్రియ కొనసాగనుంది. జిల్లా వివరాలు వార్డు, గ్రామ సచివాలయాలు: 612 పనిచేసే ఉద్యోగులు: 4,400 మంది కొత్తగా క్లస్టర్లు: 300

# చెత్త చెంతనే చదువులెలా?

అనకాపల్లి : విద్యా సంవత్సరం ప్రారంభమైంది. విద్యార్థులంతా ఉల్లాసంగా పాఠశాలకు వచ్చారు. ఎప్పటిలాగే డంపింగ్ యార్డు నుంచి వస్తున్న దుర్గంధంతో ఇబ్బందులు తప్పలేదు. నగరపాలక ఉన్నత పాఠశాల సమీపంలోనే జీవీఎంసీ అనకాపల్లి జోన్‌కు చెందిన ఖాళీ స్థలంలో డంపింగ్ యార్డు ఉంది. పట్టణంలో సేకరించిన చెత్తను ఇక్కడ నిల్వ ఉంచి లారీల్లో కాపులుప్పాడ తరలిస్తున్నారు. రోజూ తరలించాల్సి ఉండగా ఆదివారం లారీలు కదలడం లేదు. సోమవారం ఉదయాన్నే పాఠశాలకు వస్తే దుర్వాసన భరించలేక విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించాలని ఏళ్ల తరబడి వేడుకుంటున్నా ఫలితం ఉండటం లేదు. ఎన్నికల సమయంలో యార్డును తరలించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా అతీగతి లేదు. ఈ విద్యా సంవత్సరం నుంచి డంపింగ్ యార్డు సమస్య ఉండదని విద్యార్థులు భావించినా.. ఇబ్బందులు తప్పేలా లేవని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 316 మంది విద్యార్థులున్నారు.



పట్టణం నడిబొడ్డున ఉన్న డంపింగ్ యార్డు వల్ల విద్యార్థులతోపాటు చుట్టుపక్కల నివాసం ఉండే వారంతా ఇక్కట్లకు గురవుతున్నారు.

**చదువుకోలేక పోతున్నాం**

డంపింగ్ యార్డు నుంచి వచ్చే దుర్వాసనతో పాఠశాలలో చదువుకోవడానికి ఇబ్బందిగా ఉంటోంది. ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రం చేయడం లేదు. గదిలో కిటికీలు మూసుకుని చదువుకుంటున్నాం. ఆరో తరగతి నుంచి ఇక్కడే చదువుతున్నా. పదో తరగతికి వచ్చినా సమస్యకు పరిష్కారం చూపలేదు. ఆర్.సుమంత్, విద్యార్థి

**వర్షం వస్తే తీవ్ర దుర్గంధం**

వర్షం కురిస్తే డంపింగ్ యార్డు నుంచి వచ్చే దుర్గంధంతో చాలామందికి వాంతులు అవుతున్నాయి. ఒక్కోసారి అస్వస్థతకు గురవుతున్నారు. పట్టణం నడిబొడ్డున ఉన్న డంపింగ్ యార్డు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. వి.మహేష్, విద్యార్థి

# గోదాముల్లోనే నిధులు.. గాల్లోనే పనులు!

బొబ్బిలి : రైతులు ఖరీఫ్, రబీలో పండించిన పంటలకు అన్ని వేళలా గిట్టుబాటు ధర ఉండటం లేదు. ఒక్కోసారి నిల్వ ఉ ంచుకునే సౌకర్యం లేక దళారులు చెప్పిన ధరకే ఇచ్చేయాల్సి వస్తుంది. మరికొందరు చేసేది లేక కల్లాల్లో ఉంచుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా, ప్రాథమిక సహకార పరపతి సంఘాలను(పీఏసీఎస్) బలోపేతం చేసేందుకు తలపెట్టిన గోదాంల నిర్మాణం మూడేళ్లుగా నత్తనడకన సాగుతోంది. వీటి పూర్తికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని, అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఆదిలోనే ఆలస్యం గత వైకాపా ప్రభుత్వం**
గోదాముల నిర్మాణానికి స్థల సేకరణలో తొలుత జాప్యం చేసింది. ఆపై పనులు చేసిన గుత్తేదారులకు బిల్లులు చెల్లించక మధ్యలోనే ఆపేశారు. కొన్నిచోట్ల నిర్మాణం పూర్తయినా అధికారులకు అప్పగించ లేదు. వాస్తవానికి 2024 ఖరీఫ్ నాటికి తొలి విడత పనులు పూర్తయితే మలి విడత చేయాల్సి ఉంది. కానీ ఆదిలోనే ఆలస్యం జరగడంతో లక్ష్యం అటకెక్కింది. ఫలితంగా రైతు దళారుల వలలో పడుతున్నారు.



**లక్ష్యం ఇదీ**
రైతులు నుంచి సేకరించిన పంటలను నిల్వ చేసుకోవడమే కాకుండా.. గోదాంలను అద్దెకు కేటాయించి.. పీఏసీఎస్‌లను బలోపేతం చేయాల న్నది లక్ష్యం. అందుకే సొసైటీలకు రుణం అందించి, వాటితో నిర్మాణాలు చేపట్టారు. మరికొన్ని నెలల్లో ఖరీఫ్ వరి పంట రైతు చేతికి రాబోతోంది. ఆ లోపు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

**మలివిడత ఎప్పటికో!**
రెండో విడతలో మరో 45 గోదాంలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అవి ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి. ఆప్కాబ్, డీసీసీబీలు గోదాంల నిర్మాణానికి రుణ సాయం అందిస్తున్నా యి. నిర్మాణాలు పూర్తయితే అద్దెకు కేటాయించి, రుణ వాయిదాలు చెల్లించుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు రుణం చెల్లింపు తప్పకపోగా.. మరోవైపు సొసైటీల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు.

**పూర్తికి చర్యలు..**ప్రస్తుతం జిల్లాలో సగానికి పైగా గోదాములు పూర్తి చేశాం. కొన్నిరోజుల్లో మిగిలినవి పూర్తి చేయిస్తాం. ఆపై కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేటు వ్యక్తులకైనా అద్దెకు కేటాయిస్తాం. ఇప్పటికే పనులు పూర్తి చేయాలని గుత్తేదార్లను కోరాం.డి.రమేష్, జిల్లా సహకార అధికారి, విజయనగరం

# సర్కారీ కార్యాలయాలకు 'సౌర వెలుగులు'

విజయనగరం : ప్రభుత్వ కార్యాలయాల్లో ఇక సౌర వెలుగులు ప్రసరించనున్నాయి. పాలన కార్యకలాపాలకు అధిక విద్యుత్తు వినియోగం అవుతోంది. ఛార్జీల భారం తడిచి మోపెడవుతోంది. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈఏపీఈపీడీసీ ఎల్)కు సకాలంలో బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంటోంది. బడ్జెట్ నిధులు చాలక దాదాపు అన్ని కార్యాలయాలూ పెద్ద మొత్తంలో బకాయిపడుతున్నాయి. ఈ భారాన్ని తగ్గించుకునేందుకు సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. అధిక ఉత్పత్తి చేస్తే డిస్కమ్‌కు తిరిగి విక్రయించుకోవచ్చు. ఈ మేరకు రెండు జిల్లాల్లోని కార్యాలయాల భవనాలపై వీటి ఏర్పాటుకు సంబంధించి సర్వే చేపట్టారు.

**భారం తగ్గించేలా.. ఆదా చేసేలా..**
ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగించే విద్యుత్తు యూనిట్‌కు రూ.6 నుంచి రూ.8 వరకు చెల్లించాల్సి వస్తోంది. చాలా కార్యాలయాల్లో వృథా అవుతోంది. సిబ్బంది లేకపోయినా పంకాలు, లైట్లు పనిచేస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. అదే సొంతంగా సౌర పలకలు ఏర్పాటు చేసుకుని విద్యుదుత్పత్తి చేసుకుని వినియోగిస్తే భారం సగానికి తగ్గుతుందని అంచనా. ఇప్పటికే ఈ ప్రాజెక్టు అమలుకు



ప్రభుత్వ రంగ విద్యుత్తు సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుంది. దీని వల్ల యూనిట్ విద్యుత్తు సుమారు రూ.4 లోపే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో విద్యుత్తు ఆదాతోపాటు, సెలవురోజుల్లో ఉత్పత్తిని సర్దుబాటు చేసే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**
మన్యం జిల్లాలోని మొత్తం కార్యాలయాలు: 8,423
ప్రస్తుతం విద్యుత్తు కనెక్షన్లు ఉన్నవి: 7,917
ప్రభుత్వ కార్యాలయాల కనెక్షన్లు: 4,610
స్థానిక సంస్థల భవనాల కనెక్షన్లు: 3,804
సౌర పలకల ఏర్పాటుకు అవకాశం లేనివి: 4598
3825 భవనాలపై ఏర్పాటుకు అవకాశమున్న విస్తీర్ణం: 32,37,571 చ.అ.

**ప్రభుత్వానికి నివేదిస్తాం..** ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు సర్వే చేపట్టాం. డిస్కమ్ ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తాం. అందుబాటులో ఉన్న కార్యాలయాలపై సౌర ఫలకల ఏర్పాటుకు రూ.కోట్లలో వెచ్చించాల్సి వస్తోంది.
లక్ష్మణరావు, చలపతిరావు, ఉభయ జిల్లాల డిస్కమ్ ఎస్‌ఈలు

# అడుగడుగునా తప్పులు.. భక్తులకు తిప్పలు



విశాఖపట్నం: గత నెల 30న చందనోత్సవం రోజు సింహాచలంలో గోడ కూలిన ఘటనలో ఏడుగురు భక్తులు మృతిచెం దారు. ఈ నిర్మాణాన్ని ఏ స్థాయిలోనూ అధికారులు పట్టించుకోలేదు. తనిఖీలు చేయాల్సిన ఇంజినీరింగ్ విభాగం గాలికొదిలేసింది. పర్యవేక్షిం చాల్సిన ఈవో చూసీచూడనట్లు వదిలేశారు. పనులు చేయించిన ఇంజినీర్లు అది ఎంతవరకు నిలుస్తుందో ఆరా తీయలేదు. ఫలితంగా ఏడుగురి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఆ తర్వాత బాధ్యులను కూటమి ప్రభుత్వం సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేసింది. అంతకు ముందు.. 2023 చందనోత్సవం నిర్వహణలోనూ అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. నాటి ప్రభుత్వం విచారణకు ఆదేశించగా దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విచారణాధికారి సిఫార్సు చేస్తే దాన్ని అప్పటి ప్రభుత్వం తొక్కిపెట్టింది. ఆ రోజే క్రమశిక్షణచర్యలు తీసుకొని ఉండుంటే ఈ ఏడాది దుర్ఘటన జరిగి ఉండేది కాదంటున్నారు. తప్పులు జరిగినా ఎవరూ పట్టించుకోరు, తప్పించుకోవచ్చన్న ధోరణే ఇంతటి ప్రమాదానికి కారణమైంది. నాటి విచారణ నివేదిక తాజాగా బయటపడగా అందులోని వివరాలిలా ఉ న్నాయి. 2023 చందనోత్సవం సమయంలో సింహాచలం దేవస్థానం ఈవోగా త్రినాథరావు ఉన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో ఈఈగా శ్రీనివాసరాజు, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులే కొనసాగుతున్నారు. నాడు చందనోత్సవం పూర్తిగా విఫలమవడంలో ఈవో పాత్ర ఉన్నట్లు విచారణలో తేల్చారు. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం ఉందని స్పష్టం చేశారు. అప్పుడే వారి మీద చర్యలకు సిఫార్సు చేసుంటే బాధ్యతగా పనిచేసేవారు. అప్పట్లో ఆ నివేదిక అమలు కాకుండా కీలక నేతలతో ఒత్తిడి చేయించి తొక్కిపెట్టినట్లు విమర్శలొస్తున్నాయి. ముఖ్య ఉత్సవాల నిర్వహణలో ఘోరంగా విఫలమైన అదే అధికారిని తిరిగి దేవస్థానం ఈవోగా నియమించడం గమనార్హం. అయితే..కీలక సమయంలో మూడు నెలల పాటు సెలవుపై వెళ్లిపోవడం విమర్శలకు దారి తీసింది. భక్తులకు తాగునీటి సౌకర్యం, మజ్జిగ పంపిణీ చేయించడం, క్యూలైన్ల నిర్వహణలో ఈఈ, ఈవో ఘోరంగా విఫలమయ్యారు. వీవీఐపీ లైన్లలోనూ వీటిని ఏర్పాటు చేయలేదు. ఎక్కువ సమయం నిరీక్షించేలా క్యూలైన్లు ఏర్పాటు చేయడం ప్రణాళిక లోపంగా గుర్తించారు.

**ఎన్నో తప్పిదాలు** ఉత్సవానికి అప్పట్లో సీఎఫ్‌వోగా వ్యవహరించిన చంద్రశేఖర్ ఆజాద్, ఈవోగా ఉన్న త్రినాథరావు, ఏఈవో ఆనందకు మార్, ఈఈలు శ్రీని వాసరావు, రాంబాబులు నాటి తప్పిదాలకు కారణమని విచారణ నివేది కలో పేర్కొన్నారు. అదనపు టికెట్ల మంజూరులో ఈవో, ఏఈవోలు జిల్లా కలెక్టరు అనుమతి తీసుకోలేదు. పోలీసులు అదనంగా వాహనాల కు పాసులు తీసుకోవడాన్ని తప్పుబట్టారు. టికెట్ల తనిఖీ చేసి భక్తులను క్యూలైన్లలోకి పంపాలి. ఆ ప్రక్రియ ఎక్కడా సక్రమంగా జరగనట్లు గుర్తించారు. తనిఖీలకు ప్రత్యేక ంగా దేవాదాయశాఖ సిబ్బందిని నియమించారు. చాలా మందిని పోలీసులు వారి పాయింట్లకు వెళ్లకుండా ఆపేశారు. వీవీఐపీ టికెట్ల తనిఖీకి ఉపయోగించిన స్కానర్ అరగంటకే మూలకు చేరింది.షిఫ్టు విధుల్లో పనిచేయాల్సిన ఉద్యోగులు వచ్చారా లేదా అనేది ఉన్నతాధి కారులు తనిఖీ చేయాలి. అదెక్కడా పకడ్బందీగా జరగలేదు.

# పండగలా సరకుల పంపిణీ



నర్సీపట్నం : చౌక ధరల దుకాణాల ద్వారా పండగ వాతావ రణంలో నిత్యావసర సరకుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా వీధి చివరో, రోడ్డు పక్కనో నిత్యావసర సరకులు పంపిణీ చేసేది. కూటమి ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసి గతంలో మాదిరి చౌకధరల దుకాణాల ద్వారా జూన్ ఒకటి నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గోదాముల నుంచి దుకాణాలకు సరకులను చేరవేస్తున్నారు. ప్రస్తుతం బియ్యం, పంచదార నిల్వలను దుకాణాలకు తరలిస్తున్నారు.

**ఖర్చు తగ్గించుకునేలా మార్పు..** పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో పౌర సరఫరాల గోదాం ఉంది. ఇప్పటివరకు నర్సీపట్నం, గొలుగొండ మండలాల్లోని 84 దుకాణాలకు ఇక్కడి నుంచి సరకులు సరఫరా చేసేవారు. తాజాగా మాకవరపాలెం మండలంలో 20, రోలుగుంట మండలంలో 16, కోటవురట్ల మండలంలో రెండు దుకాణాలను ఈ గోదాము పరిధిలోకి తీసుకువచ్చారు. సమీప ప్రాంతాల్లోని డిపోలను పెదబొడ్డేపల్లి గోదాము పరిధిలోకి తీసుకురావడం వల్ల జిల్లా కేంద్రం నుంచి సరకు రవాణా ఖర్చులు ఆదా అవుతాయని చెబుతున్నారు. ఈ గోదాము పరిధిలో 59,057 రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ-పోస్, తూకం పరికరాలను సిద్ధం చేసుకోవాలని అధికారుల నుంచి డీలర్లకు ఆదేశాలొచ్చాయి. ధరలు, నిల్వల పట్టిక అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని, అధికారులను సంప్రదించేందుకు ఫోన్ నంబర్లను ప్రదర్శించాలని సూచనలొచ్చాయి. దుకాణాలను శుభ్రంగా ఉంచాలని, జూన్ 1న పూలతో అలంకరించాలని, ప్రజా ప్రతినిధులు, వయోవృ ద్ధులను ప్రారంభ కార్యక్రమానికి ఆహ్వానించాలని పేర్కొన్నారు. తాగునీరు, కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయనున్నారు. 65 ఏళు దాటిన వారు, దివ్యాంగులకు ఇళ్లకు ప్రతినెలా ఐదో తేదీలోగా సరకులు తీసుకువెళ్లి అందజేయాలన్నది మార్గదర్శకం. వీరందరినీ వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పాటు చేసి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నెల 29న ప్రయోగాత్మకంగా ట్రయల్ రన్ వేయనున్నారు. సాంకేతిక లోపాలుంటే వెంటనే సరిచేస్తారు. వినియోగదారులు సామాజిక దూరం పాటించేలా, మాస్కులు ధరించేలా చైతన్యం చేయాలని సూచనలొచ్చా యి. బియ్యం మినహా ఇతర సరకులకు నిర్ణీత నగదు యూపీఐ, డిజిటల్ విధానంలో చెల్లించేలా ప్రోత్సహించాల్సి ఉంటుంది.


**దివ్యాంగులకు, వృద్ధులకు ఇంటివద్దనే..**
కలెక్టరేట్: జూన్ 1 నుంచి రేషన్ డిపోల ద్వారా సరకులు పంపిణీ చేపడుతున్నామని జిల్లా పౌరసరఫరాల అధికారి కె.మూర్తి పేర్కొన్నారు. సోమవారం పౌరసరఫరాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాహనాల ద్వారా ఇంటింటికీ సరకులు పంపిణీ వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. జిల్లాలో 1,069 రేషన్ డిపోల ద్వారా ఇకపై ప్రతి నెల 1 నుంచి 15 వరకు సరకుల పంపిణీ ఉంటుందన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు డిపోలు అందుబాటులో ఉంటాయన్నారు. 65 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు 5వ తేదీ వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటి వద్దకు సరకులు అందిస్తామన్నారు. లబ్ధిదారులు రాష్ట్రంలో ఏ చౌక దుకాణం వద్ద నుంచైనా సరకులు పొందవచ్చన్నారు. రేషన్ కార్డుల్లో 7 సేవలకు సంబంధించి 21 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు.

# ఇంటింటా యోగా సాధన

మామిడికుదురు : యోగాంధ్ర-2025 పేరుతో పదకొండో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అన్ని మండలాల్లోనూ ప్రణాళికా యుతంగా అమలు చేసేందుకు యంత్రాంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆయుర్వేద, హోమియో వైద్యులకు బాధ్యతలు అప్పగించారు ఆరంభమైన ఈ కార్యక్రమం జూన్ 21 వరకు నిరాటంకంగా జరిపేందుకు ఉపక్రమించారు. స్థానికంగా శిక్షకులు, సాధకులను సమాయత్తం చేసి వారితో ప్రతిరోజూ వివిధ విభాగాల్లో ఉన్నవారికి ఆసనాలు నేర్పిస్తారు.

**ఆసనాలు.. విభిన్న పోటీలు**
ప్రతిరోజూ అభ్యాసకులు, శిక్షకులు ఆసనాలు వేసేలా, వాటిని చూసి అంతా నేర్చుకునేలా అవగాహన కల్పిస్తారు. దీనిపై వ్యాసరచన, పాటలు, చిత్రలేఖనం, క్విజ్, ఛాయాచిత్రం, రంగోలి, చక్కని నినాదం, లఘు చిత్రాల పోటీలు ఉంటాయి. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి యోగాపై కరపత్రాలతో ప్రచారం చేయడం, ర్యాలీలతో చైతన్యం తీసుకొస్తారు. శిక్షకులు, సాధకులు విడివిడిగా ఆసనాలు వేయడంతో పాటు సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం తదితర వాటిపై వివరిస్తారు. మండలాల వారీగా నియమితులైన ఆయుష్ వైద్యాధికారులు స్థానికంగా అధికారులను కలిసి కార్యక్రమాల అమలుపై చర్చించి కార్యాచరణ దిశగా అడుగులు వేస్తున్నారు. జూన్ 21న యోగా దినోత్సవాన్ని సాధకులతో భారీగా నిర్వహిస్తారు. మే 26 నుంచి 30 వరకు గ్రామస్థాయి, జూన్ 2 నుంచి 7వరకు మండల స్థాయి, జూన్ 9 నుంచి 14వరకు జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు.

**ఇవీ కీలక కార్యక్రమాలు**



ఈనెల 27: మలికిపురం మండలం దిండిలో ఉన్న హరిత కోకోనట్ రిసార్ట్స్ వద్ద వశిష్ట గోదావరి నది ఒడ్డున ప్రశాంత వాతావరణంలో యోగా శిబిరం నిర్వహిస్తారు.
29: కోనసీమలోని రైతులతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు.
జూన్ 3: సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలోని సముద్ర తీరంలో పర్యాటకులకు ఆసనాలపై అవగాహన.
9న: ద్రాక్షారామ భీమేశ్వరాలయం వద్ద స్థానికులు, పర్యాటకుల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమం.
16న: ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ సమీప లొల్ల లాకుల వద్ద ప్రత్యేక శిబిరాలు.

# అక్రమాలకు ఇక చెల్లు

బొబ్బిలి : పొదుపు సంఘాల సభ్యులు స్త్రీనిధి పథకంలో బ్యాంకు నుంచి తీసుకున్న రుణాల చెల్లింపుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డిజిటల్ పద్ధతిలో చెల్లించేలా కొత్త యాప్‌ను రూపొందించింది. మూడు రోజుల కిందట మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో యాప్‌ను ప్రారంభించారు.

**వెంటనే సంక్షిప్త సమాచారం**
సభ్యులు తీసుకున్న రుణాలు బ్యాంకులకు తిరిగి చెల్లించడంలో చేతివాటం ప్రదర్శించడం, రుణాల మంజూరులోనూ అక్రమాలు జరగడంతో తొలుత వీవోఏలకు పేటీఎం యంత్రాలను ఇచ్చారు. అవి అందరికీ ఇవ్వడానికి సాధ్యం కాలేదు. మండలానికి పది యంత్రా లు మాత్రమే రావడంతో ఇబ్బందిగా మారింది. దీన్ని అధిగమిస్తూ



యాప్ ద్వారా నేరుగా చెల్లించుకునే వెసులుబాటు కల్పించారు. ఎంత చెల్లించారనేది చరవాణికి సంక్షిప్త సమాచారం వెంటనే వచ్చేస్తుంది. జిల్లాలోని 27 మండలాల్లో 40,396 పొదుపు సంఘాలున్నాయి. వాటిలో 4,39,212 మంది సభ్యులున్నారు. వారంతా బ్యాంకు లింకేజీ రుణాలతోపాటు స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకొని వివిధ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 21,220 మంది సభ్యులకు లక్ష్యానికి మించి రూ.167 కోట్లు రుణంగా ఇచ్చారు. రూ.పది వేలు నుంచి రూ.లక్ష వరకు ఒక్కో సభ్యురాలికి ఇస్తున్నారు. 2025-26లో 28,287 మంది సభ్యులకు రూ.282 కోట్లు రుణంగా ఇవ్వాలని లక్ష్యం విధించుకున్నారు. ఇప్పటివరకు రూ.5 కోట్లకుపైగా ఇచ్చారు.**అక్రమాలకు తావుండదు** కొత్తగా రూపొందించిన యాప్ అమల్లోకి వస్తే రుణాల చెల్లింపుల్లో అక్రమాలకు తావుండదు. సభ్యులు ఎవరికీ ఇవ్వకుండా యాప్ ద్వారా నేరుగా చెల్లించుకునే అవకాశము ంటుంది. విధి విధానాలు వచ్చిన వెంటనే జిల్లాలో అమలు చేస్తాం.
వై.చిట్టిబాబు, ఏజీఎం స్త్రీనిధి పథకం, విజయనగరం

# రెండడుగుల గొయ్యితో సరి..!

భీమవరం : ఈ చిత్రంలో కనిపిస్తున్న చోటే కార్గో పోర్టు నిర్మాణం చేస్తామంటూ రెండడుగుల గొయ్యి తవ్వి వైకాపా సర్కారు హడావుడిగా శంకుస్థాపన చేసింది. ప్రస్తుతం అక్కడ ఆ ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. మత్స్యకారుల జీవనోపాధికి ఉపయుక్తంగా ఉండే ఫిష్ ల్యాండింగ్ కేంద్రం ప్రాజెక్టును వైకాపా సర్కారు నిర్వీర్యం చేసింది. మత్స్య ఉత్పత్తుల ఎగుమతులకు ఫిషింగ్ హార్బర్, కార్గో పోర్టు నిర్మాణం ఎంతగానో ఉపయోగపడతాయని మభ్యపెట్టింది. తీరా అటు హార్బర్ కాని, ఇటు కార్గో పోర్టుగాని నిర్మాణాలు పూర్తిచేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఫిష్ ల్యాండింగ్ కేంద్రం నిర్మాణంపై గంగపుత్రుల ఆశలు చిగురిస్తున్నాయి. నీ జిల్లాలో 19 కి.మీ. మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. వేలమంది మత్స్యకారులకు గోదావరితోపాటు సముద్రంలో వేటే జీవనాధారం. అయితే బోట్లు నిలిపేందుకు అనువైన స్థలం, మత్స్యసంపదను నిల్వ చేసుకునేందుకు గిడ్డంగులు, విశ్రాంతి సౌకర్యాలు లేక గంగపుత్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నరసాపురం మండలం బియ్యపుతిప్ప వద్ద ఫిష్ ల్యాండింగ్ కేంద్రం ఏర్పాటుకు యోచించి, 2018లో మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఆరెకరాల స్థలం సేకరించి తొలి విడత నిధులు మంజూరు చేశారు. టెండర్లు పూర్తిచేసి స్థలాన్ని చదును చేసి సామగ్రి తీసుకొచ్చారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ప్రాజెక్టుని అటకెక్కించింది. ఆర్భాటంగా పోర్టుకు శంకుస్థాపన.. వాస్తవానికి ఈ ప్రాంతంలో హార్బర్ నిర్మించాలని తొలుత భావించారు. గోదావరి సముద్రంలో కలిసే సంగమ ప్రాంతం కావడంతో పూడిక ఏర్పడి పెద్ద పెద్ద ఓడలు నిలిపేందుకు కష్టమవుతుందని ఫిష్ ల్యాండింగ్ నిర్మాణానికి నిర్ణయించారు. తర్వాత వచ్చిన వైకాపా సర్కార్ ప్రజలను తప్పుదోవ పట్టించి హార్బర్ నిర్మిస్తామంటూ గొప్పలు చెప్పింది. చినమైనవానిలంక వద్ద సముద్రం ఒడ్డున కార్గో పోర్టు నిర్మిస్తామని అప్పటి సీఎం జగన్ ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. రెండడుగుల మేర చిన్నగొయ్యి తవ్వి వదిలేశారు.పూర్తయితే ఉపయుక్తం.. ప్రస్తుతం అంతర్వేదిలో ఉన్న ఫిష్ ల్యాండింగ్ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. బియ్యపుతిప్పలో కేంద్రం పూర్తయితే దూరభారం తగ్గడంతోపాటు చేపలు ఎండబెట్టేందుకు ప్లాట్‌ఫాంలు, శీతల గిడ్డంగులు, ఐస్ తయారీ పరిశ్రమలు అందుబాటులోకి వచ్చేవి. ఏటా రూ.350 కోట్ల విలువైన మత్స్యసంపద ఇక్కడి నుంచి ఎగుమతి అయ్యేవి. ఫిష్ ల్యాండింగ్ కేంద్రం ఏర్పాటుపై ప్రభుత్వం చర్చలు జరుపుతోందని, త్వరలోనే ఆదేశాలొస్తాయని మత్స్యశాఖ జేడీ నాగలింగాచారి తెలిపారు.

# డ్వాక్రా సంఘాలకు సాంకేతిక ముడి

ఆచంట : భవిష్యత్తులో డ్వాక్రా మహిళల కార్యకలాపాలన్ని సాంకేతిక తతో ముడిపడనున్నాయి. ఈ క్రమంలో జిల్లాలోని డ్వాక్రా బృందాల సభ్యులందరూ సూక్ష్మరుణ అవసరాలకు సంబంధించి, గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ(సెర్ప్) వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు నమోదు చేయించుకోవాల్సి ఉంది. దరఖాస్తు సమయంలో దళారుల ప్రమేయాన్ని నివారించడానికి డిగ్రీ, ఆపై చదివిన మహిళలను డిజిటల్ లక్ష్మిలుగా నియమించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ఆలోచన కూడా చేస్తోంది.

**జిల్లాలో ఇలా..**మొత్తం 27 వేల మహిళా సంఘాలు ఉన్నాయి. 2.70 లక్షల సభ్యులు ఉండగా, ఇప్పటి వరకు 19,500 మంది డేటా నమోదు చేయించుకున్నారు. ఈ నెలాఖరుకు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. గడువు లోపు ఇది సాధ్యమయ్యేలా లేదు. క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి సభ్యురాలికి డిజిటల్ వేలిముద్ర, ముఖం, కళ్లు వంటి ఫొటోలు, గ్రూప్ సమావేశమయ్యే ప్రదేశం జియోట్యాగింగ్ వంటివి నమోదు చేయాలి. జిల్లాలో అనేక మంది మహిళలు ఉపాధి ఇతర అవసరాల కోసం దూర ప్రాంతాల్లో ఉ ంటున్నారు. కొందరు గల్ఫ్ దేశాల్లో ఉన్నారు. గ్రామాల్లో క్షేత్ర స్థాయి సిబ్బంది వద్ద వేలి ముద్రలు తీసుకోవడానికి ఫింగర్ ప్రింట్ స్కానర్లు పూర్తిస్థాయిలో లేవు. జిల్లాలో అనేక గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్య వల్ల డేటా నమోదుకు గంటల సమయం పడుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డీఆర్డీఏ పీడీ వేణుగోపాల్‌ను సంప్రదించగా సచివాలయాల్లో పింఛన్ల పంపిణీకి సంబంధించిన డివైజ్‌లు వినియోగించుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. నిరంతర ప్రక్రియగా డేటా నమోదు గడువు పెంచే అవకాశం ఉందని చెప్పారు.

# దేనికైనా సిద్ధం.. పారిశ్రామిక పథం!

పుత్తూరు : చెన్నై శివారులోని అంబత్తూరు ప్రాంత పరిశ్రమలను బయట ప్రాంతాల్లో పెట్టాలని భావించారు. ఈ నేపథ్యం లో చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం విజయపురం మండలంలో కోసలనగరంలో 5,810 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో అధికంగా ప్రభుత్వ, డీకేటీ భూములే ఉన్నందున భూసేకరణకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు సైతం భావించారు. ఇప్పటికే ఏపీఐఐసీ పరిధిలో 2,042 ఎకరాల భూమి ఉంది.వైకాపా హయాంలో పారిశ్రామిక రంగం పూర్తిగా పడకేసింది.. నేతల వ్యవహార శైలితో పారిశ్రామికవేత్తలు పారిపోయారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాప్రతి నిధుల చొరవతో పారిశ్రామికవేత్తలు మళ్లీ జిల్లా వైపు చూస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధమంటున్నారు. నగరి నియోజకవర్గంలోని కోసలనగరం పారిశ్రామికవాడ ప్రస్తుత పరిస్థితి చూస్తే ఇదే సన్నివేశం కన్పిస్తోంది.

**2014లోనే అడుగులు**

కోసలనగరం పారిశ్రామికవాడ ఏర్పాటుకు 2014లోనే దివంగత నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఏపీఐఐసీ ద్వారా 5,810 ఎకరాలు గుర్తించారు. రెండు విడతలుగా ఆపై 500 ఎకరాలు సేకరించారు. మలి దశలో 1,442 ఎకరాలు సేకరించారు. ఆపై వచ్చిన వైకాపా ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు నిధులు ఇవ్వకపోగా, పారిశ్రామిక ప్రగతి పట్టించుకోలేదు.

**వరుస చర్చలతో ఒప్పించి..**

అంబత్తూరుకు చెందిన పారిశ్రామికవేత్తలతో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



ఇప్పటికే మూడుసార్లు చర్చించడంతో వారు ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. భూములు ప్రభుత్వం అభివృద్ధి చేసినా, లేదా తమకు ఇచ్చినా అభివృద్ధి చేసుకుంటామని వారంటున్నారు. ఈ క్రమంలో వెంటనే 600 ఎకరాలు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పార్కుకు ప్రతిపాదించిన స్థలం: 5,810 ఎకరాలు

సేకరించిన భూమి: 2,042.13 ఎకరాలు

సేకరించాల్సిన భూమి: 1,600

ఉన్న అడ్డంకులు రెండే..: కోసలనగరం పారిశ్రామికవాడకు ఉన్న ప్రధాన అడ్డంకులు రెండే. అవి తాగునీరు, రహదారి సౌకర్యం. కోసలనగరం, ఇల్లత్తూరు పరిధిలోని కొండల మధ్యలో రెండు చెరువులను గుర్తించారు. వీటిలో 3 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునేలా అభివృద్ధి చేయాలని నివేదించారు. ఇందుకు తెలుగుగంగ నుంచి తాగునీటిని తేవాలని గతంలోనే ప్రతిపాదించారు.

అంబత్తూరు నుంచి 60 కి.మీ. మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నది పారిశ్రామికవేత్తల కోరిక. ఈ రెండూ పూర్తయితే మరిన్ని పరిశ్రమలు తరలివచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేస్తే కోసలనగరం పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తుంది.

పన్నూరు వద్ద కనెక్టివిటీ ఇస్తే వస్తామన్నారు..

కోసలనగరం పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటుకు అంబత్తూరు పరిశ్రమల అసోసియేషన్ సిద్ధంగా ఉంది. చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ వే.. పారిశ్రామికవాడకు విజయపురం మండలం పన్నూరు సమీపంలో 15 కి.మీ. దూరంలో ఉంది. ఈ రోడ్డుకు కనెక్టవిటీ ఇప్పించాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి పరిశ్రమల ప్రతినిధులు తీసుకురాగా ఆయన.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశారు. అనుమతి రాగానే సీ బ్లాక్‌లో 476 ఎకరాల డీకేటీ భూములకు నోటిఫికేషన్ ఇచ్చి పరిశ్రమలకు అప్పగిస్తాం.

సుబ్బారావు, జోనల్ మేనేజరు, ఏపీఐఐసీ, చిత్తూరు

# పేట.. పరిశ్రమల కోట

పాయకరావుపేట : పాయకరావుపేట నియోజకవర్గం పరిశ్రమల కోటగా మారనుంది. పలు కొత్త పరిశ్రమలు ఈ ప్రాంతంలో కొలువుదీరనున్నాయి. ఇప్పటికే నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ కర్మాగారం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. దీంతోపాటు మిత్తల్ ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. తాజాగా పాయకరావుపేట మండలంలోని రాజవరంలో ఉన్న దక్కన్ పరిశ్రమ విస్తరణకు రంగం సిద్ధమైంది. దీనిని సుమారు 200 ఎకరాల్లో నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది.

రాజవరం, కేశవరం మధ్య ఇప్పటికే దక్కన్ ఫైన్ కెమికల్స్ పరిశ్రమ నడుస్తోంది. దీనిలోనే పవర్‌ప్లాంట్ నిర్వహిస్తున్నారు. తాజాగా కుమార పురం వద్ద సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో 120 ఎకరాలు కొనుగోలు చేశారు. సోలార్ ప్లాంట్ ఆలోచన విరమించుకుని రూ. 1,560 కోట్లతో దక్కన్ పరిశ్రమను రెండో దశ విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనికి ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చింది. ఇక్కడ ఉన్న మరో 70 ఎకరాల ప్రభుత్వ భూమి పరిశ్రమకు కేటాయించే అవకాశముంది. దీనిలో 1800 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. పరిశ్రమ ఏర్పాటుతో భూముల ధరలకు రెక్కలు రానున్నాయి. ఇప్పటికే కేశవరం, రాజవరం, వెంకటనగరం, శ్రీరాంపురం ప్రాంతాల్లో ఎకరా ధర కోట్లకు చేరింది. తాజాగా రెండో దశ విస్తరణ పనులు మొదలు పెడితే ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ వేలాది మంది ఉపాధి పొందే అవకాశముంది.

స్థానికులకు అవకాశం దక్కేనా?.. పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగాలు వస్తాయని ఆశిస్తున్న నిరుద్యోగులకు నిరాశే ఎదురవుతోంది. నక్కపల్లి మండలంలోని రాజయ్యపేటలోని హెటిరో పరిశ్రమ, రాజవరంలోని దక్కన్ పరిశ్రమలో స్థానికులకు అవకాశాలు ఇవ్వడం లేదు. అర్హత ఉన్నా వారిని పట్టించుకోవడం లేదు. ఈసారైనా ఇక్కడ వారికి పరిశ్రమల్లో కొలువులు వస్తాయని ఆశిస్తున్నారు.

ఉద్యోగ అవకాశాలు ఇవ్వాల్సిందే... స్థానికులకు పరిశ్రమల్లో ఉద్యోగాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపడం వాస్తవమే. దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం. ఇక్కడి అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దేందుకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను పరిశ్రమలే ఏర్పాటు చేసే విధంగా వారితో చర్చిస్తాం. ఆ తర్వాత నైపుణ్యాలకు అనుగుణంగా నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉద్యోగాల్లో పెద్దపీట వేయిస్తాం.

వంగలపూడి అనిత, హోంమంత్రి

# కాస్త చొరవ.. కాదా శుద్ధి!



ధర్మవరం : పాఠశాలల్లో కల్పించాల్సిన మౌలిక వసతుల్లో తాగునీరు అత్యంత ప్రధానమైంది. సాధారణ నీరుతో విద్యార్థులు అతిసారం, కామెర్లు, గొంతునొప్పి...తదితరాలతో బాధపడుతున్నారనే ఉద్దేశంతో పాఠశాలల్లో శుద్ధి చేసి జలాలు అందించాలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు ఆర్వో ప్లాంట్లను ప్రభుత్వం అందజేసింది. రాష్ట్ర స్థాయిలో ఒకే గుత్తేదారు సంస్థ ద్వారా యంత్రాలను సరఫరా చేసింది. సదరు సంస్థ వాటిని అమర్చాలి. ఏడాది పాటు యంత్రాలు పాడైనా మరమ్మతు చేయాలి. ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలల్లో ఇప్పటికీ యంత్రాలు అమర్చలేదు. కొన్ని చోట్ల అమర్చినా పని చేయడం లేదు. మరమ్మతులు చేయకుండా వదిలేశారు. వచ్చే నెలలోనే రోజుల్లో బడులు తెరుచుకోనున్నాయి. మరమ్మతులు త్వరగా చేపట్టి, పక్కన పెట్టిన యంత్రాలు అమర్చాలి లేదంటే విద్యార్తులకు శుద్ధమైన నీటి కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. గత 6 నెలలుగా యంత్రాల మరమ్మతులు చేపట్టడం లేదు.

**ఒక్కో పాఠశాలకు రూ.లక్షకు పైగానే..**


విద్యార్థుల సంఖ్య, ఆయా పాఠశాలల్లోని నీటిలో లవణాలు, ఫ్లోరైడ్ శాతాన్ని బట్టి యంత్రాలను సరఫరా చేశారు. విద్యార్థులు 200 మందిలోపు ఉంటే రూ.లక్ష విలువ చేసే యంత్రాన్ని అందించారు. రెండోశ్రేణిలో 300 విద్యార్థులు ఉంటే రూ.2లక్షలు.. మూడోశ్రేణిలో విద్యార్థులు 300కుపైగా ఉన్న పాఠశాలలను చేర్చారు. ఆ యంత్రాల విలువ కూడా ఎక్కువే. సుమారు రూ.3 నుంచి 4లక్షలు ఉంటాయి. నాలుగో శ్రేణిలో 800 నుంచి వెయ్యి మంది ఉండే బడులకు రూ.4.50 లక్షలు విలువ చేసే యంత్రాలు సమకూర్చారు.

**సమస్య పరిష్కరిస్తాం : శంకరయ్య, ఈఈ, సమగ్రశిక్షా విభాగం**

సంబంధిత ప్రధానోపాధ్యాయుల నుంచి ఫిర్యాదులు రావాల్సి ఉంది. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే యంత్రాలు బాగు చేయిస్తాం. విద్యార్థులకు రక్షిత నీరు అందించడానికి తగిన చర్యలు తీసుకుంటాం.

నల్లమాడ మండలం పెమనకుంటపల్లి తండా ప్రాథమిక పాఠశాలకు గతేడాది యంత్రాన్ని ఇచ్చారు. అప్పటి నుంచి దాన్ని ఏర్పాటు చేయకుండా అట్టపెట్టెకే పరిమితం చేశారు. తరగతులు జరుగుతున్నప్పుడు ఉపాధ్యాయులే శుద్ధి జలాన్ని రోజుకో క్యాన్‌ను బయట కొనుగోలు చేసి తెప్పించేవారు.

# పథకం పూర్తవ్వాలా.. గొంతులు తడవాలా!



గుంతకల్లు : గుంతకల్లు మండలంలోని గ్రామాలతో పాటు గుంతకల్లుకు తాగునీటిని అందించడానికి ఉద్దేశించిన రూ.30 కోట్లతో చేపట్టిన భారీ నీటి పథకం నిర్వీర్యమవుతోంది. గండికోట జలాశయం నుంచి పైపుల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నది పథకం ఉద్దేశం. పథకానికి జేసీ నాగిరెడ్డి నీటి పథకమని పేరుపెట్టారు. హడ్కో నిధుల ద్వారా పనులు చేపట్టారు. పామిడి నుంచి గుంతకల్లు వరకు పైప్‌లైన్ ఏర్పాటు పనులు చేపట్టారు. మొత్తం 33 కి.మీ.ల పొడవైన పైప్‌లైన్ పనుల్లో 30 కి.మీ.లు పూర్తి చేశారు. మిగిలిన 3 కి.మీ.ల పనులను గుత్తేదారు పూర్తి చేయలేదు. చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని ఆయన పనులు నిలిపివేశారు.

**దెబ్బతింటున్న నిర్మాణాలు**

నీటి పథకం ద్వారా కదిరిపల్లి, నాగసముద్రం, వెంకటాంపల్లి, నెలగొండ, దోనిముక్కల తదితర గ్రామాలతో పాటు గుంతకల్లుకు నీటిని అందించాల్సి ఉంది. గ్రామాల్లోనే కాకుండా దోనిముక్కల కాలనీలోనూ ఉపరితల ట్యాంకులు నిర్మించారు. పెద్దఎత్తున నీటిని నిల్వ ఉంచి పంపింగ్ చేయడానికి గుంతకల్లు, వెంకటాంపల్లిలో పెద్ద సంపులను నిర్మించారు. వెంకటాంపల్లిలో పంపింగ్ గదులతో పాటు సిబ్బందికి క్వార్టర్సు కట్టారు. ఆయా కట్టడాలన్నీ దెబ్బతింటున్నాయి. ఒక్క దోనిముక్కల ఇందిరమ్మ కాలనీలో మాత్రం నిర్మించిన రెండు ఉపరితల ట్యాంకులను వినియోగిస్తున్నారు. మిగిలిన నిర్మాణాలు, పైపులైన్లు శిథిలమవుతున్నాయి.

**ఇలా చేస్తే 60 వేల మందికి ప్రయోజనం**


గండికోట జలాశయం నుంచి ఇప్పట్లో నీరు వచ్చే పరిస్థితి లేదని, గుంతకల్లు గుండా వెళ్లే హంద్రీనీవా కాలువ నీటి సాయంతో పథకాన్ని వినియోగంలోకి తేవాలని పట్టణ ప్రజలతో పాటు వివిధ గ్రామాలవాసులు కోరుతున్నారు. మిగిలిన పైప్‌లైన్ పనులు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పూర్తిచేసి హంద్రీనీవా కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలను తమకు అందించాలని ప్రజలు కోరుతున్నారు. పథకాన్ని వినియోగంలోకి తెస్తే దాదాపు 60 వేల మందికి తాగునీటిని అందించడానికి అవకాశం ఉంటుంది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**

జేసీ నాగిరెడ్డి తాగునీటి పథకం మూలనపడిన విషయాన్ని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తాం. పథకాన్ని పూర్తి చేయడానికి, ప్రారంభించడానికి నిధులు అవసరం. ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది. నీటిని హంద్రీనీవా కాలువ నుంచి తీసుకోవడానికి ప్రభుత్వం అనుమతులివ్వాలి. ఆదిశగా ప్రయత్నాలు చేస్తాం.

లీలా కృష్ణప్రసాద్, మున్సిపల్ కార్యనిర్వాహక ఇంజినీరు

# పేరుకుపోతున్న నిర్లక్ష్యం!



అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లాలోని పురపాలికల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. ప్రధానంగా శివారు కాలనీల్లో ఇంటింటా చెత్త సేకరణ ప్రహసనంగా మారింది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అడుగడుగునా నిర్లక్ష్యం వహించడమే ఇందుకు కారణం. పుర కమిషనర్లు సైతం ప్రధాన కాలనీల్లోనే పర్యటిస్తూ శివారు ప్రాంతాల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఫలితంగా ఆయా కాలనీల్లో చెత్తాచెదారం కుప్పలుగా పేరుకుపోతోంది. దీనికితోడు కొన్నిచోట్ల కార్మికులే నిబంధనలకు విరుద్ధంగా చెత్తను కాల్చేస్తున్నారు. ఇది స్థానికుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇదిలా ఉండగా మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదు. ఓవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వచ్ఛ ఆంధ్ర పేరుతో కార్యక్రమాలు చేపడుతున్నా.. క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

**పూర్తి అధికారాలు ఇచ్చినా..** కూటమి ప్రభుత్వం వచ్చాక చెత్తపన్ను రద్దు చేయడంతో క్లాప్ వాహనాలను వెనక్కి వెళ్లిపోయాయి. స్థానికంగానే చెత్త సేకరణకు ట్రాక్టర్లు, ఆటోలు సమకూర్చుకోవాలని ప్రభుత్వం.. పూర్తి అధికారాలు ఇచ్చింది. అనంతపురం కార్పొరేషన్‌తో పాటు కొన్ని పురపాలికల్లో అద్దె ప్రతిపాదికన ట్రాక్టర్లు తీసుకుని సేకరణ చేస్తున్నారు. ఇంటింటా సేకరణకు ఈ-ఆటోలు, తోపుడుబండ్లు కొనుగోలు చేసి కార్మికులకు అందించారు. పారిశుద్ధ్య కార్మికులు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తుండటంతో సేకరణ ప్రక్రియ సరిగ్గా జరగడం లేదు. అనంతపురం, ధర్మవరం, కదిరి, గుంతకల్లు, హిందూపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం పురపాలికల్లోని శివారు కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణ లేకపోవడంతో మురగుకూపాలుగా మారిపోతున్నాయి.

**అంతా ఇష్టారాజ్యంగా..**అనంతపురం కార్పొరేషన్‌లో అధికారుల నిర్లక్ష్యమే శాపంగా మారింది. ప్రస్తుతం 10 ట్రాక్టర్లు ఉండగా.. అద్దె ప్రతిపాదికన మరో 30 ట్రాక్టర్లు తీసుకున్నారు. ఒక్కో దానికి రోజుకు రూ.2100 చెల్లిస్తున్నారు. ఒక్కో వాహనం ద్వారా రోజుకు 1300 ఇళ్ల నుంచి చెత్త సేకరించాల్సి ఉన్నా.. క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. సేకరణ సరిగా జరగకపోయినా బిల్లులు ఇచ్చేస్తున్నారు. శివారు కాలనీల్లో రెండు, మూడు రోజులైనా శుభ్రం చేయకపోవడంతో చెత్త పేరుకుపోతోంది. ట్రాక్టర్లు వెళ్లలేని ప్రాంతాల్లో తోపుడుబండ్ల ద్వారా సేకరించాల్సి ఉంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ లేకపోవడంతో పలు కాలనీల్లో పరిస్థితి అధ్వానంగా తయారైంది

**కుండీలు పాడైపోయి..**

కళ్యాణదుర్గం పురపాలికలో ఒక ట్రాక్టరు, ఒక కంపాక్టర్, 5 ఆటోలతో చెత్త సేకరణ చేస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శివారు కాలనీల్లోకి వెళ్లడం లేదు. కార్మికులకు విధులు కేటాయించడంలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నారు. కుండీలు చాలాచోట్ల పాడయ్యాయి. కొత్తవి ఏర్పాటు చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. కమిషనర్ పర్యవేక్షణ కొరవడింది. పురపాలిక పరిధిలోని ఆరు గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది.

# మామిళ్లా.. మండీల్లో చోటులేదు

పాకాల : మామిడి రైతు పరిస్థితి ఈ ఏడాది దైన్యంగా మారింది. పక్వానికొచ్చిన దిగుబడులు అమ్ముకుందామంటే అడిగేవారు లేరు. మార్కెట్‌కు తీసుకొచ్చినా మండీల్లో స్థలం లేదంటూ యజమానులు చోటివ్వడం లేదు. ధర వచ్చేవరకు వేచి చూద్దామంటే పండిన కాయలు నిలువునా నేలరాలిపోతున్నాయి. ఎన్నడూ చూడని విచిత్ర పరిస్థితిని మామిడి రైతులు ప్రస్తుతం ఎదుర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో సుమారు 1.15 లక్షల హెక్టార్లలో మామిడి సాగవుతుండగా రెండు లక్షలకు పైగా కుటుంబాలు ఈ పంట నుంచి వచ్చే ఆదాయంపైనే ఆధారపడుతున్నారు. సాగు కోసం అప్పులపాలైన మామిడి రైతులు ఇప్పుడు పంటను ఒడిపి మార్కెట్‌కు తీసుకురావాలంటే మరింత అప్పుచేయక తప్పడం లేదు. తోతాపురి కాయలు టన్ను కేవలం రూ.6 వేలకే తెగనమ్ముకోవాల్సిన దుస్థితి కొనసాగుతోంది. జిల్లాలోని మామిడి రకాల్లో 60 శాతం పైగా ఇదేరకం సాగు



చేస్తున్నారు. పుల్లూరా రకం కాయలు సైతం రూ.7 వేలకు పడిపోయిన దారుణస్థితి రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. మిగతా రకాల పరిస్థితి సైతం రోజురోజుకూ దిగజారుతోంది. టన్ను తోతాపురి కాయలు కోసి, లోడింగ్ చేసి, రవాణా ఖర్చులతో మార్కెట్‌కు తీసుకొస్తే రూ.1700 ఖర్చవుతోంది. మండీల వద్ద కమిషన్లు పోను టన్నుపై కనీసం రూ.4 వేలు మిగలడం గగనమవుతోంది. ఇది చేసిన అప్పులకు వడ్డీలకు చాలడం లేదు.

**ప్రభుత్వం చొరవ చూపితేనే..**మే పూర్తి కావస్తున్నా జిల్లాలో పలు గుజ్జు పరిశ్రమలు ఇప్పటివరకు తోతాపురి కొనుగోళ్లు ప్రారంభించలేదు. ఇదేమని ప్రశ్నిస్తే గతేడాది గుజ్జు ఇప్పటివరకు అమ్ముడు కాలేదంటున్నారు. కొన్ని పరిశ్రమల యజమానులు లోపాయికారిగా విజయవాడ నుంచి కాయలు తెప్పించుకుంటున్నారు. జూన్ నుంచి ఇక్కడ కొనుగోళ్లు ఉంటాయని భావిస్తున్నా పరిమితంగానే ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు ఉద్యానశాఖ అధికారులు గుజ్జు పరిశ్రమలు, వ్యాపారులతో చర్చలు జరుపుతున్నా ఫలితం కనిపించడం లేదు. ప్రభుత్వం స్పందించి మామిడి రైతులను ఆదుకోవాలని, మార్కెట్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి కొనుగోళ్లు ప్రారంభించాలని మొరపెట్టుకుంటున్నారు.

# హమ్మయ్యా.. ఎట్టకేలకు మోక్షం

పుత్తూరు : తిరుపతి-చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనులు కొన్నింటిని గతంలో అసంపూర్తిగా నిలిపేశారు.. ఈ హైవే 2012లో నిర్మించారు. పలుమార్లు ఈ సమస్యపై కథనాలు ప్రచురితం కావడంతో 2023లో ఎట్టకేలకు పనులు పూర్తి చేయడానికి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు రూ.120 కోట్లు మంజూరు చేశారు.. ఈ మేరకు టెండర్లు పిలిచారు.. తదనుగణంగా నేడు పనులు జరుగుతున్నాయి.

పర్యవేక్షణ: ఎన్‌హెచ్ఏఐ

హైవే పరిధి: చంద్రగిరి సమీప కాలూరు క్రాస్ నుంచి పుత్తూరు శివారు మరాఠీ గేటు వరకు(42 కి.మీ.)

పనులివీ..: చంద్రగిరి సమీపంలోని కాలూరు క్రాస్ వద్ద వంతెన, కేఎల్ఎం ఆస్పత్రి సమీపంలో వంతెన, పాదిరేడు, టోల్‌ప్లాజా వద్ద పుత్తూరుల వద్ద రోడ్డు, వంతెనలుబీ గాజులమండ్యం వద్ద రోడ్డు పనులు ప్రారంభించారు.

పురోగతి..: పాదిరేడు, పుత్తూరు వద్ద వంతెన, టోల్‌ప్లాజా, కాలూరు క్రాస్ వద్ద పనులు పూర్తి చేశారు.

కేఎల్ఎం వంతెన వద్ద పనులు చురుగ్గా సాగుతున్నాయి. త్వరలో ఈ వంతెనపై రాకపోకలు సాగించే అవకాశం ఉంది.

**గ్రామస్థులను ఒప్పించి..**

రెండు తాగునీటి ట్యాంకులు, కింద వంతెన నిర్మించాలని గాజులమండ్యం గ్రామస్థులు పట్టుపట్టడంతో వారిని ఒప్పించి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం వంతెన నిర్మాణం రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువ పనులు సాగుతున్నాయి. ఇవి పూర్తయితే కాలూరు క్రాస్ నుంచి పుత్తూరు మరారీ గేటు వరకు రోడ్డు పూర్తయినట్లే. 13 ఏళ్లుగా ఆగి పనులు పూర్తికావస్తుండటంతో వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఊరట..నిత్యం కేఎల్ఎం వంతెన వద్ద, గాజుల మండ్యం వద్ద ట్రాఫిక్‌తో ప్రజలు, వాహనచోదకులు, ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండూ పూర్తయితే ఇక ట్రాఫిక్ ఇబ్బందులు తీరినట్లే.

# గాజులదిన్నె 'కట్ట'కు కొట్లు

గోనెగండ్ల : పశ్చిమ ప్రాంత జీవనాడి గాజులదిన్నె జలాశయం ఆధునికీకరణ 'కట్ట'కథగా మారింది. గతంలో ఎంతో పటిష్ఠంగా నిర్మించిన డ్యాంను అభివృద్ధి పేరుతో గత వైకాపా పాలనలో విధ్వంసం చేశారు జలాశయంలో ప్రస్తుతం 4.5 టీఎంసీల నీటిని నిల్వ చేయడానికి వీలుంది. అదనంగా మరో టీఎంసీ నీటిని నిల్వ చేయడానికి పనులు మొదలుపెట్టారు. హంద్రీనీవా నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తీసుకురావాలని ప్రణాళిక రూపొందించారు. ఇందుకు రూ.137 కోట్లు కేటాయిస్తున్నట్లు ఆర్భాటం చేశారు. ఆనకట్ట మట్టి పనులు, బండింగ్, క్రస్టు గేట్ల ఆధునికీకరణ పనులు మొదలుపెట్టారు. సకాలంలో నిధులివ్వకుండా 'నీరు'గార్చారు. రెండేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించి పనులు ప్రారంభించాలని రైతులు విన్నవిస్తున్నారు.

**ఎక్కడికక్కడ తవ్వేసి వదిలేశారు**ఆరు గేట్ల వద్ద పనులు చేపట్టారు. ఒకటి, రెండు గేట్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. రెండో గేటుకు స్టాప్‌లాక్ గేట్లు అలాగే ఉన్నాయి. మొదటి గేటుకు రోప్ కనెక్షన్, గ్రూవ్స్ తదితర పనులు చేపట్టాల్సింది. నూతనంగా నిర్మాణాలు చేపట్టినా మిగిలిన నాలుగు గేట్ల నుంచి నీరు లీకేజీ అవుతుండటం విశేషం.ఆనకట్ట ఎత్తు పెంపకంలో భాగంగా బండింగ్ రాళ్లు పెకిలించారు. కట్ట పొడవునా ఎక్కడపడితే అక్కడ తవ్వి వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోయింది. భారీ వరద పోటెత్తితే ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉంది."జలాశయం పనులు నిలిచిపోయింది వాస్తవమే. వారం రోజుల్లో గుత్తేదారుడు పనులు ప్రారంభించేలా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొచ్చాయి. ఒకటి, రెండు గేట్లతోపాటు మిగిలిన క్రస్ట్ గేట్ల పనులు పూర్తి స్థాయిలో చేపడతామని" డీఈ విజయ్‌కుమార్ తెలిపారు.




# రష్మిక ప్లేస్ కి ఎసరు పెట్టేలా అమ్మడి ప్లాన్..?

కన్నడ పరిశ్రమలో ఆరేళ్ల క్రితమే హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది అందాల భామ రుక్మిణి వసంత్. హిందీలో అప్ స్టార్స్ అనే సినిమాలో ఎన్.జి.ఓ గర్ల్ గా కనిపించిన రుక్మిణి కన్నడలో బర్ బల్ ట్రియాలజీ కేస్ 1 ఫైండింగ్ వజ్రముని సినిమాలో నటించింది. ఆ సినిమాలో రుక్మిణిని చూసి రక్షిత్ శెట్టి సప్త సాగరాలు దాటి సినిమాలో ఛాన్స్ పట్టేసింది. సప్త సాగరాలు దాటి రెండు భాగాల్లో రుక్మిణి వసంత్ యాక్టింగ్ అదరగొట్టేసింది. సినిమాలో ఆమెను చూసిన యూత్ ఆడియన్స్ అంతా ఆమెకు ఫిదా అయ్యారు. సప్త సాగరాలు దాటి సినిమా తర్వాత రుక్మిణి వసంత్ సౌత్ ఆడియన్స్ కి హోలిలిట్ ఫేవరెట్ అయ్యింది. అమ్మడికి వరుసగా ఇతర భాషల నుంచి ఛాన్స్ లు వస్తున్నాయి. ఇప్పటికే తమిళ్ లో విజయ్ సేతుపతితో ఏస్ సినిమా చేసిన రుక్మిణి వసంత్ శివ కార్తికేయన్ తో మదరాసి సినిమాలో



కూడా అవకాశం అందుకుంది. ఇక తెలుగులో నిఖిల్ తో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమాతో వచ్చినా ఆ సినిమా ఎవరు పట్టించుకోలేదు. లేటెస్ట్ గా అమ్మడు ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబో సినిమాలో ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది. నీల్ తో సినిమా అది కూడా ఎన్టీఆర్ లాంటి స్టార్ తో ఛాన్స్ అంటే అది మామూలు విషయం కాదు. తప్పకుండా రుక్మిణి సౌత్ సినిమాల్లో తన ఇంపాక్ట్ గట్టిగా చూపించేలా ఉందని అనిపిస్తుంది. తనకు యూత్ ఆడియన్స్ లో ఏర్పడిన క్రేజ్ చూస్తే సరిగ్గా ఒక్క బ్లాక్ బస్టర్ పడితే ఇక అమ్మడిని తీసుకెళ్లి టాప్ ప్లేస్ లో పెట్టేలా ఉన్నారు. ఆల్రెడీ కన్నడ నుంచి వచ్చి రష్మిక టాలీవుడ్ ని మాత్రమే కాదు పాన్ ఇండియా లెవెల్ లో సూపర్ సెన్సేషన్ గా మారింది. ఇక ఇప్పుడు రష్మిక తర్వాత రుక్మిణి అదే రేంజ్ ఫాం కొనసాగించాలని చూస్తుంది. రష్మిక ప్లేస్ కి ఎసరు పెట్టే ప్లానింగ్ లో భాగంగానే రుక్మిణి స్టార్ ఛాన్స్ లు పట్టేస్తుందని అంటున్నారు. ఏది ఏమైనా తప్పకుండా రుక్మిణికి ఆ ఛాన్స్ ఉందనే అనిపిస్తుంది. రుక్మిణి వసంత్ చేస్తున్న ఎన్టీఆర్ సినిమా బ్లాక్ బస్టర్ కొడితే మాత్రం అమ్మడికి ఆపడం ఎవరి వల్లా కాదని చెప్పొచ్చు. ఇదే కాదు మరో రెండు మూడు క్రేజీ ప్రాజెక్ట్స్ కూడా లైన్ లో ఉన్నట్టు తెలుస్తుంది.

# మృణాల్ ను వాడుకుంటారా? సైడ్ చేస్తారా?

కొన్ని సినిమాల్లో కథ కంటే క్యాస్టింగ్ మరింత ఇంట్రెస్ట్ ను కలిగిస్తోంది. బాలీవుడ్ సీక్వెల్స్ అయితే క్యాస్టింగ్ విషయంలో చాలా మిస్టరీగా ఉంటాయి. ఈ నేపథ్యంలో త్వరలో రిలీజ్ కాబోతున్న ఓ బాలీవుడ్ సినిమా క్యాస్టింగ్ విషయంలో ఆసక్తిని కలిగిస్తోంది. జులై లో రిలీజ్ కానున్న సన్ ఆఫ్ సర్దార్2 క్యాస్టింగ్ ఇప్పుడు అందరిలోనూ ఇంట్రెస్ట్ ను పెంచుతోంది. దానికి కారణం ఈ సినిమాతో పంజాబీ స్టార్ నటి నీరూ బజ్వా బాలీవుడ్ లోకి అడుగుపెడుతుంది. ఈ సినిమా సన్ ఆఫ్ సర్దార్ కు సీక్వెల్ గా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. సన్ ఆఫ్ సర్దార్ సినిమా రాజమౌళి దర్వకత్వంలో వచ్చిన మర్యాద రామన్నకు రీమేక్ గా తెరకెక్కి మంచి హిట్ అందుకుంది. ఇప్పుడు దానికి సీక్వెల్ గా వస్తున్న సినిమా మంచి కథతో ఆడియన్స్ ను మెప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక అసలు విషయానికొస్తే సన్ ఆఫ్ సర్దార్2 సినిమాలో అజయ్ దేవగణ్ భార్యగా నీరూ బజ్వా నటిస్తోందని వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి.



పంజాబీ సినీ ఇండస్ట్రీలో నీరూ బజ్వాకు మంచి ఆదరణ ఉంది. ఆ జనాదరణ సన్ ఆఫ్ సర్దార్ ఫ్రాంచైజ్ కు కొత్త ఆడియన్స్ ను తీసుకొస్తుందని, ఈ సినిమాలో నీరూ బజ్వా క్యారెక్టర్ చాలా గణనీయంగా ఉంటుందని అంటున్నారు. నీరూ అజయ్ దేవగణ్ భార్య పాత్రలో నటిస్తుంటే మరి మృణాల్ ఠాకూర్ ఏ పాత్రలో కనిపించనుందని ఇప్పుడు ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. సౌత్ లో మంచి హీరోయిన్ గా పేరు తెచ్చుకుని స్టార్ స్టేటస్ ను తెచ్చుకున్న మృణాల్ కు కూడా భారీ ఎత్తున ఫ్యాన్స్ ఉన్నారు. ఇప్పటివరకు మృణాల్ బాలీవుడ్ లో పలు సినిమాలు చేసినప్పటికీ అమ్మడికి ఇంకా చెప్పుకోదగ్గ హిట్ మాత్రం దక్కలేదు. దీంతో అజయ్ దేవగణ్ తో చేస్తున్న సన్ ఆఫ్ సర్దార్2 ఆమెకు బాలీవుడ్ లో మంచి బ్రేక్ ఇస్తోందని అందరూ భావిస్తున్న టైమ్ లో సడన్ గా అజయ్ దేవగణ్ భార్య పాత్రలో నీరూ నటిస్తుందని అంటున్నారు. అజయ్ దేవగణ్ కు భార్యగా నీరూ నటిస్తే మరి మృణాల్ అతని ప్రేయసి పాత్రలో కనిపిస్తుందా లేక మృణాల్ కు అంతకు మించిన క్యారెక్టర్ ఏమైనా ఇచ్చారా? అదీ లేదంటే మంచి టాలెంట్ ఉన్న మృణాల్ ను కేవలం గ్లామర్ రోల్ కు పరిమితం చేశారా అనేది తెలియాల్సి ఉంది.


# కూలీ.. ఇదేమి బాక్సాఫీస్ ను డ్యామేజ్ చేయదుగా?






ఇండియన్ సినీ ప్రేక్షకులు ఎదురుచూస్తున్న భారీ ప్రాజెక్టుల్లో కూలీ సినిమాకు రోజురోజుకు హైప్ మరింత పెరుగుతోంది. రజనీకాంత్ – లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో వస్తున్న మొదటి సినిమా కావడంతో అన్ని భాషల్లో కూడా కమర్షియల్ గా డిమాండ్ గట్టిగానే ఉంటుందని అనుకున్నారు. తలైవా మాస్ స్టైల్స్‌కు, లోకేష్ డైరెక్షన్ టేకింగ్‌కు, అనిరుధ్ సంగీతానికి ఏ స్థాయిలో క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దానికి తోడు స్పెషల రోల్స్ కూడా మరింత బూస్ట్ ఇస్తున్నాయి. ఇందులో నాగార్జున, ఉపేంద్ర, అమీర్ ఖాన్ లాంటి నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారని క్లారిటీ వచ్చేసింది. దర్శకుడు లోకేష్ అన్ని భాషల్లో సినిమాకు హైప్ వచ్చేలా తీసుకున్న జాగ్రత్తలు దాదాపు బాగానే వర్కౌట్ అయ్యాయి. కానీ ఒక్క దగ్గర మాత్రం కూలీ బజ్ ఇబ్బంది పెడుతున్నట్లు అనిపిస్తోంది. మంచి భారీ హైప్ మధ్య, సినిమాకు సంబంధించిన ఒక నిర్ణయం మైనస్ వైబ్ తీసుకొచ్చింది. అది హిందీలో టైటిల్ మార్పు. కూలీ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ని బదులు, హిందీలో మజ్దూర్గా మార్చారు. ఈ పేరు పట్ల నార్త్ ఆడియెన్స్‌లో మిక్స్ డ్ రెస్పాన్స్ వస్తోంది. మజ్దూర్ అన్న పదం ఓ క్లాస్ టోన్‌లో ఉండటంతో, రజనీ మాస్ ఆడియెన్స్‌కి కనెక్ట్ కావడం కష్టం అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అమీర్ ఖాన్ తో క్రేజ్ ను బ్యాలెన్స్ చేయవచ్చు అనుకున్నప్పటికి టైటిల్ కాస్త ఇబ్బంది పెట్టే పరిస్థితి తెచ్చింది. ఈ టైటిల్ 1950ల నాటి ఫీలింగ్‌ని తీసుకువస్తుందని కొంతమంది సోషల్ మీడియాలో కామెంట్ చేస్తున్నారు. అయితే ఈ మార్పుకు కారణం కాపీ రైట్స్ సమస్యే అని బలమైన ఊహాగానాలు ఉన్నాయి. 1983లో అమితాబ్ బచ్చన్ నటించిన లెజెండరీ హిట్ కూలీ టైటిల్ రైట్స్ ఇప్పటికీ ఆ నిర్మాత వద్దే ఉన్నాయని సమాచారం. ఆ టైటిల్ రీ యూజ్ చేయాలంటే క్లియర్ పరమిషన్ తీసుకోవాల్సి వస్తుంది. అదే సమస్య ఎదురవడంతో హిందీ వెర్షన్‌కి మజ్దూర్ అని పేరు పెట్టారని ఇన్ సైడ్ టాక్. ఇదంతా జరుగుతున్న టైంలో, కూలీకి ఎదురుగా జూనియర్ ఎన్టీఆర్ – హృతిక్ రోషన్ నటిస్తున్న వార్ 2 కూడా ఆగస్ట్ 14న రిలీజ్ కానుంది. నార్త్ మార్కెట్‌లో థియేటర్లు సంపాదించాలంటే టైటిల్, ప్రమోషన్ల స్థాయిలు కూడా కీలకం. అలాంటి సమయంలో ఇలా పేరు మార్చడంపై ఫ్యాన్స్ అసంతృప్తిగా ఉన్నారు. అయినా కానీ, లోకేష్ స్టైల్, రజనీకాంత్ పవర్ స్క్రీన్ మీద దంచికొడితే.. ఓపెనింగ్స్ గ్యారెంటీ అని అభిమానులు నమ్ముతున్నారు. టీజర్ ఇప్పటికే భారీ అంచనాల్ని పెంచింది. పూర్తి ట్రైలర్ వచ్చాక అసలైన కిక్ అందుతుందనడంలో సందేహమే లేదు. అయితే తమిళ సినిమాలకు అందని ద్రాక్షగా మిగిలిన 1000 కోట్ల మార్క్ ను అందుకోవాలి అంటే హిందీ మార్కెట్ చాలా కీలకం. కొంత ఎఫెక్ట్ పడినా కూడా అది కష్టమే. మరి కూలీ ఎలాంటి కలెక్షన్స్ అందుకుంటుందో చూడాలి.

# విజయ్ స్టైలిష్‌గా.. మరింత పవర్‌ఫుల్‌గా




తమిళ స్టార్ హీరో విజయ్ ప్రస్తుతం చేస్తున్న సినిమా జన నాయగన్. ఆదివారం విజయ్ బర్త్ డే సందర్భంగా అర్ధరాత్రి చిత్ర యూనిట్ జన నాయగన్ నుంచి ఫస్ట్ రోర్ పేరుతో టీజర్ ను రిలీజ్ చేయగా, ఆ టీజర్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. అర్ధరాత్రి రిలీజైన టీజర్, సినిమాపై అంచనాలను మరింత పెంచింది. దీంతో విజయ్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీగా ఉన్నారు. విజయ్ ను డైరెక్టర్ వినోత్ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ గెటప్ లో చూపించాడు. టీజర్ తోనే ఫ్యాన్స్ ఫుల్ ఆనందంతో కేరింతలు కొడుతుంటే ఫ్యాన్స్ ఉత్సాహాన్ని రెట్టింపు చేయాలని సినిమా నుంచి విజయ్ పోలీస్ లుక్ లో ఉన్న ఓ సరికొత్త పోస్టర్ ను కూడా రిలీజ్ చేశారు మేకర్స్. టీజర్ లో లాగానే విజయ్ ఈ పోస్టర్ లో కూడా చాలా పవర్‌ఫుల్ గా కనిపిస్తున్నాడు. చాలా కాలం తర్వాత తమ అభిమాన హీరో తిరిగి పోలీస్ పాత్ర చేస్తుండటం, దానికి తోడు ఇందులో విజయ్ స్టైలిష్ గా కూడా కనిపిస్తుండటంతో జన నాయగన్ లుక్ కు ఆడియన్స్ నుంచి భారీ ఎత్తున ప్రశంసలొస్తున్నాయి. ఈ సినిమాను దేశ వ్యాప్తంగా ఒకేసారి, ఒకే టైటిల్ తో రిలీజ్ చేయాలనే ఆలోచనతో సినిమాకు జన నాయగన్ అనే టైటిల్ ను ఫిక్స్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాలో పూజా హెగ్డే, బాబీ డియోల్, మమిత బైజు, గౌతమ్ మీనన్, ప్రకాష్ రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ లో రూపొందుతున్న జన నాయగన్ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, విజయ్ రాజకీయాల్లోకి వెళ్లబోతూ చేస్తున్న ఆఖరి సినిమాగా ఇది తెరకెక్కుతుంది. విజయ్ నుంచి రాబోతున్న ఆఖరి సినిమా కావడంతో జన నాయగన్ పై అందరికీ భారీ అంచనాలున్నాయి.

# జాన్వి అక్కడ బిజీ అవ్వాలని చూస్తుందా..?

శ్రీదేవి తనయురాలు జాన్వి కపూర్ బాలీవుడ్ లో తన మార్క్ నటనతో ఆడియన్స్ ని ఆకట్టుకుంటుంది. హిందీలోనే కాదు తన మదర్ లానే సౌత్ సినిమాల్లో కూడా రాణించాలని అనుకున్న జాన్వి కపూర్ ఎన్ టీ ఆర్ దేవర తో తెలుగు ఎంట్రీ ఇచ్చింది. కొరటాల శివ డైరెక్షన్ లో తెరకెక్కిన దేవర సినిమాలో తంగం పాత్రలో జాన్వి కపూర్ ఆకట్టుకుంది. సినిమాలో అమ్మడి గ్లామర్ కి తెలుగు ఆడియన్స్ పడిపోయారని చెప్పొచ్చు. ఐతే జాన్వి కపూర్ దేవర తర్వాత దేవర 2 చేయాల్సి ఉంది. ఐతే ఈలోగా రాం చరణ్ పెద్ది ఆఫర్ అందుకుంది. బుచ్చి బాబు డైరెక్షన్ లో చరణ్ లీడ్ రోల్ లో చేస్తున్న పెద్ది సినిమా సంథింగ్ స్పెషల్ గా రానుంది. ఈ సినిమా విషయంలో జాన్వి కపూర్ చాలా కాన్ ఫిడెంట్ గా ఉంది. ఐతే దేవర సినిమా చేసినా కూడా జాన్వికి ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ఆ సినిమాలో ఆమెను కేవలం గ్లామర్ షోకి మాత్రమే అన్నట్టుగా చూపించారు. ఐతే పెద్ది విషయంలో అలాంటి తప్పు జరగకూడదని ఫిక్స్ అయ్యింది. అందుకే అమ్మడు ఈ పాత్రని ఎంపిక చేసుకుంది. ఇదిలా ఉంటే సౌత్ సినిమాల మీద ఫోకస్ తో అక్కడ బాలీవుడ్ లో అవకాశాలు



మిస్ అవుతున్నాయని భావిస్తున్న జాన్వి కపూర్ ఇక మీదట అక్కడే ఫోకస్ చేయాలని ఫిక్స్ అయ్యిందట. ఎంత చేసినా సౌత్ లో గ్లామర్ కన్నా యాక్టింగ్ తోనే ఇంప్రెస్ చేయాల్సి ఉంటుంది. ఐతే అలాంటి పాత్రలు పడితేనే కానీ జాన్వికి ఇక్కడ సూపర్ స్టార్ డం వచ్చే అవకాశం ఉండదు. అందుకే సౌత్ సినిమాలు అడపాదడపా చేసినా తనకు అనుకువగా ఉండే హిందీ సినిమాలే చేస్తే బెటర్ అని భావిస్తుందట జాన్వి కపూర్. ప్రస్తుతం అమ్మడు పెద్ది సినిమాతో పాటు రెండు బాలీవుడ్ సినిమాలు చేస్తుంది. అందులో ఒకటి పరం సుందరి కాగా మరొకటి సన్నీ సంస్కారి కి తులసి కుమారి సినిమా చేస్తుంది. ఈ రెండు సినిమాలతో మరోసారి బాలీవుడ్ లో తన సత్తా చాటాలని చూస్తుంది జాన్వి కపూర్. ఐతే తెలుగులో మాత్రం పెద్ది హంగామా బాగుండగా ఆ సినిమా సక్సెస్ ఐతే మళ్లీ తెలుగు ఇంకా సౌత్ పరిశ్రమల నుంచి జాన్వి కపూర్ కి ఛాన్స్ లు వచ్చే వీలుంటుంది.

# కళ్యాణి ప్రియదర్శన్.. ది బాస్ లేడీ వైబ్స్

క్యూట్ లుక్స్‌తో కుర్రకారు గుండెల్ని కొల్లగొడుతున్న ఈ బ్యూటీ ఎవరో పరిచయం చేయాలా? .. అసలు పరిచయమే అవసరం లేని పేరు– కళ్యాణి ప్రియదర్శన్. ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ కుమార్తె. బలమైన సినీనేపథ్యం నుంచి వచ్చిన కళ్యాణి బహుభాషల్లో నటిగా వెలిగిపోతోంది. ఓవైపు మలయాళం, మరోవైపు తెలుగు, తమిళంలోను నటిస్తూ బిజీగా ఉంది. కళ్యాణి ప్రస్తుతం జెనీ అనే తమిళ చిత్రంలో నటిస్తోంది. దీంతో పాటు %–%ఒడం కుతిర చదుం కుతిర – అనే మలయాళ చిత్రం, లోకా– చాప్టర్ 1 (చంద్ర) అనే మలయాళ సూపర్ హీరో ఫిలింలోను నటిస్తూ బిజీగా ఉంది. లోకా చాప్టర్ 1 సినిమాని దుల్కార్ సల్మాన్ సహభాగస్వామిగా నిర్మిస్తున్నారు. కళ్యాణి సోషల్ మీడియాల్లోను బిజీగా ఉంది. ఈ బబ్లీ బ్యూటీ ఇటీవల కొంత ట్రెడిషన్ కి ఆవల ట్రెండీ లుక్స్ లో కనిపిస్తూ ఆకట్టుకుంటోంది. ఇంతకుముందే కళ్యాణి బికినీ లుక్ ఒకటి ఇంటర్నెట్‌లో వైరల్ గా మారింది. ఇప్పుడు ట్రెడిషనల్ వైట్ టాప్, బ్రౌన్ ట్రాక్ ధరించి అదిరిపోయే ఫోజు ఇచ్చింది. ఆ భుజానికి తగిలించిన వైట్ హ్యాండ్




బ్యాగ్, బ్లాక్ గాగుల్స్, ఐఫోన్... కళ్యాణి ఇస్టయిల్ ప్రతిదీ కుర్రకారును ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. కళ్యాణి కెరీర్ గ్రాఫ్‌ని పరిశీలిస్తే కొన్ని ఆసక్తికర చిత్రాల్లో నటించింది. ఈ భామ ప్రారంభం అసిస్టెంట్ ప్రొడక్షన్ డిజైనర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది. ఆమె తెలుగు చిత్రం హలో (2017)లో కథానాయికగా నటనా రంగ ప్రవేశం చేసింది. ఉత్తమ ఆరంగేట్ర కథానాయికగా ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డును గెలుచుకుంది. ఆ తర్వాత హీరో (2019)తో తమిళ సినీ రంగంలో ప్రవేశించింది. వారణే అవశ్యముండ్ (2020)తో మలయాళ సినిమాకు పరిచయమైంది. ఆ తర్వాత చిత్రలహరి (2019), మానాడు (2021), హృదయం (2022), తాళ్ళుమాళ (2022), బ్రో డాడీ (2022) చిత్రాల్లో నటించింది. వీటిలో చివరిదానికి ఆమె మలయాళంలో ఉత్తమ నటిగా సైమా అవార్డును గెలుచుకుంది. ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తూ కెరీర్ పరంగా ఫుల్ బిజీగా ఉంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536